ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం fb.com/vaartha

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 363 పేజీలు: 12 వెల: 6.50

బడ్జెట్ తయారీలో ఆ ఆరుగురే కీలకం
రేప్ కేసులో యుపి ఎంపి రాకేష్ రాథోడ్ అరెస్టు
5లో

# 15 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- తాజా పెట్టబడులద్వారా 19,580 ఉద్యోగాల కల్పన
- మూడు నెలల్లో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్, బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- మొత్తం రూ. 3 లక్షల కోట్లు దాటిన పెట్టుబడులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించేందుకు అందుబాటులోకి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగితే సంపద సృష్టితో పాటు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయన్నారు. మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు మన రాష్ట్రంలో పెట్టుబడులకు ఒప్పంద చేసుకున్న పారిశ్రామికవేత్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పరిస్థితులను సమన్వయం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులపై కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ మూడో సమావేశంలో 15 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. దీంతో ఎస్ఐపిబీ ఇప్పటివరకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల విలువ రూ. 3 లక్షలకోట్లు దాటాయి. వీటితో పాటు అర్సెల్లార్ మిట్టల్, ఎన్టిపిసి, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ వంటి సంస్థలు పెట్టుబడులకు ఇప్పటికే మార్గం సుగమయ్యింది.. రూ. 1.36 లక్షల కోట్లతో ఏర్పాటయ్యే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు, రూ. 96,000 కోట్లతో ఏర్పాటయ్యే బిపిసిఎల్ వంటి ప్రాజెక్టులకు మరో మూడు నెలల్లో శంకుస్థాపన చేయనున్నారు.

ఈ మేరకు అన్ని అనుమతులు పూర్తి చేసి ప్రాజెక్టులను గ్రౌండ్‌చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 7 నెలల కాలంలో తీసుకువచ్చిన పాలసీలు, అందిస్తున్న సహకారంతో పెట్టుబడుల భారీగా రావడంతో ఆశాజనకంగా




సాగుతోంది. మొదటి ఎస్ఐపిబి సమావేశంలో రూ. 83,987 కోట్లు, రెండో ఎస్ఐపిబిలో రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రోజు జరిగిన మూడవ ఎస్ఐపిబి సమావేశంలో మరో రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు >>2



గురువారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద బాపూజీకి నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

కేంద్రం ప్రకటించిన జ్యూరీ అవార్డును స్వీకరించిన సమాచారశాఖ అధికారులు 2లో

## విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టు భూసేకరణకు ఆదేశం

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.అందుకు అనుగుణంగా కీలక ఉత్తర్వులు జారీ చేయనున్నది.ఇప్పటికే స్థల సేకరణ చేయాలని మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేసింది.,మెట్రో రైలు ప్రాజెక్టుకు విజయవాడలో 101 ఎకరాలు, విశాఖలో 98 ఎకరాలు కలిపి మొత్తం 199 ఎకరాల భూమి అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు >>2

# ప్రజల చేతిలో ప్రభుత్వం

### రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ప్రారంభించిన మంత్రి లోకేష్

### తొలి విడతలో 161 సేవలు అందుబాటులోకి

### మొత్తం 520 సేవలు అందించేందుకు కృషి

**విజయవాడ.జనవరి30,ప్రభాతవార్త ప్రతినిధి:** "మన మిత్ర - ప్రజల చేతిలోనే ప్రభుత్వం - ప్రజల చేతిలోనే పాలన - మాది ప్రజా ప్రభుత్వం" అనే నినాదాలతో దేశంలోనే తొలిసారి ఎపిలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించినట్లు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. అన్ని ప్రభుత్వ సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ సేవలను ప్రారంభించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ సేవలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ప్రభుత్వ ధృవపత్రాలన్నీ వాట్సప్ ద్వారానే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా వాట్సప్ సేవల కోసం నెంబర్‌ను విడుదల చేశారు మంత్రి లోకేష్. వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను కేటాయించామని ప్రకటించారు. దేశంలోనే తొలిసారి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించనుంది ఏపీ ప్రభుత్వం. మొదటి విడతలో 161 సేవలను వాట్సప్ ద్వారా అందించనున్నారు. ఈ తొలి విడతలో దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖలలోని సేవలు అందిస్తారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలని సిఎం ఆదేశించారు.

వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించేందుకు 2024 అక్టోబరు 22న మెటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్ తీసుకువస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. వేగంగా పౌరసేవలు అందించటం, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచారగోప్యత, వేగంగా సేవలందించేందుకు జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సప్ >>2

## విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం

### ప్రైవేటుపరం కాబోదన్న కేంద్రమంత్రి కుమారస్వామి

**విశాఖపట్నం, జనవరి 30, ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుందన్న అంశం ప్లాంట్ కార్మికులను, ఈ ప్రాంత వాసులను చాలా కాలంగా ఆందోళనలకు గురి చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఈ ఆందోళనలకు తెరదించారు. స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటేకరించబోమని పరోక్షంగా చెప్పి కార్మికులకు ఊరట కల్పించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఉక్కు శాఖ మంత్రి కుమార్ స్వామి, ఆ శాఖ సహాయ మంత్రి >>2





వాట్సప్ గవర్నెన్స్ గురించి మీడియాకు వివరిస్తున్న మంత్రి నారా లోకేష్

# ప్రజల చేతిలో ప్రభుత్వం

>> గవర్నెన్స్ పని చేస్తుంది. దేవాదాయ శాఖలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనాల టికెట్లు, గదుల బుకింగ్, డోనేషన్ల సేవల్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దరఖాస్తుల స్టేటస్ ల్యాండ్ రికార్డులు, ఇతర ముఖ్యమైన సర్టిఫికెట్లను జారీ చేయనున్నారు. మున్సిపల్ శాఖలో ఆస్తిపన్ను చెల్లింపులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు జారీకి నిర్ణయించారు. ఇతర శాఖల్లో యుటిలిటీ బిల్లులు, ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర సేవల్ని వాట్సప్ పేమెంట్ వ్యవస్థ ద్వారా చెల్లింపులు చేసేందుకు అవకాశం కల్పించారు.

తొలివిడతలో దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ ఎఫ్, మున్సిపాల్ శాఖల సేవలు ప్రారంభం అయ్యాయి. వేగంగా పౌరసేవలు, పారదర్శకత, జవాబుదారీ తనంలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. తొలిదశలో 161 సేవలు, రెండో విడతలో వాట్సాప్‌లో 360 సేవలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రెండో విడత వాట్సాప్ గవర్నెన్స్‌కు ఏఐను కూడా జోడిస్తామని పేర్కొన్నారు.

9552300009 వాట్సాప్ నెంబర్‌గా ప్రకటించినందున ఈ నెంబరును గుర్తుపెట్టుకోవాలన్నారు.. వాట్సాప్ అందరూ వాడే ఫోన్ అప్లికేషన్ అని తెలిపారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా వాట్సాప్ గవర్నెన్స్‌తో సులభంగా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. యువగళం పాదయాత్ర లోనే వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన వచ్చిందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి సేవలు తీసుకురాలేదని తెలిపారు. ఎంవోయూ చేసుకున్న 3 నెలల 9 రోజుల్లోనే దీనిని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రభుత్వ సేవలకు విస్తరిస్తామని తెలిపారు. ప్రతి సర్టిఫికెట్ పైన క్యూఆర్ కోడ్ ఉంటుందని, వాట్సాప్ గవర్నెన్స్‌తో ఎక్కడా నకిలీకి ఆస్కారం ఉండదని మంత్రి లోకేష్ తెలిపారు. మాది ప్రజా ప్రభుత్వం అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. నేను పాదయాత్ర చేసినప్పుడు అనేక మంది ప్రజలను కలిశాను. గతంలో ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి. వాట్సప్ అందరూవాడే ఫోన్‌అప్లికేషన్. వాట్సప్‌లో 360 సేవలను అందుబాటులో ఉంచుతాం. నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసే అవకాశమే లేకుండా వాట్సప్ గవర్నెన్స్ ఉండబోతోంది. రెండో విడతో వాట్సప్ గవర్నెన్స్‌కు ఏఐని కూడా జోడిస్తాం.

ప్రపంచంలో ఇదే తొలిసారిగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చాం. ఇదే అంతిమం అని చెప్పబోవట్లేదు ఇంకా మెరుగుపరుస్తాం. ప్రతి సర్టిఫికెట్ మీదా క్యూఆర్ కోడ్ ఉంచుతాం. క్యూఆర్ కోడ్ ద్వారా అభ్యర్థుల వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. సర్టిఫికెట్లలో ఏ తప్పులు ఉన్నా సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తాం. బటన్ నొక్కితే ఎన్నో ఆర్డర్లు వచ్చినప్పుడు ప్రభుత్వ సేవలు ఎందుకు రాకూడదు. ప్రభుత్వం నూతన సేవలందించే ప్రక్రియలో భాగమే ఈ వాట్సప్ గవర్నెన్స్" అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మొత్తంగా 520కి పైగా సేవలు వాట్సాప్ ద్వారా ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. వాట్సాప్ సేవలన్నీ పూర్తి ఉచితం, ఏదైనా బుక్ చేసుకున్నప్పుడే చెల్లింపులు చేయాలి. రియల్ టైమ్‌లోనే అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షల హాల్ టిక్కెట్లు కూడా విద్యార్థులు వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ఇకపై జారీ చేసే సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ఇస్తాం. చాలా సందర్భాల్లో సర్టిఫికెట్ నిజమైందా? కాదా?అని ధ్రువీకరణకే చాలా సమయం పోతుంది. తాజా విధానం వల్ల ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" అని మంత్రి లోకేశ్ తెలిపారు. రియల్ టైం గవర్నెన్స్ లోకూడా అన్ని శాఖల నుంచి సమాచా రాన్ని తీసుకుని క్రోడీకరిస్తున్నాం. డేటా లేక్ క్రియేట్ చేసి సీమ్ లెస్ సర్వీసెస్ అందిస్తాం. గత మూడు నెలలుగా మా టీం అహర్నిశలు కష్టపడ్డారు. గత 15 రోజులుగా టెస్టింగ్ చేస్తున్నాం. ఇంకా మెరుగులు దిద్దాలని నాకు అర్థమైంది. ఇదొక ప్రయాణం. ఆరు నెలల్లో ఐడియల్ ప్రొడక్ట్‌గా తీర్చిదిద్దుతాం. అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నా. ఆరు నెలల్లో ఎంతమార్పు వస్తుందో ప్రజలే చూస్తారు.

మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్య దేవనాథన్ మాట్లాడుతూ.. ఈ రోజు మీ మధ్య ఉండటం చాలాఆనందంగా ఉంది. మన మిత్ర వాట్సప్ సేవలు ప్రారంభించడం జరుగుతోంది. ప్రతి ఒక్కరి జీవితంలో వాట్సప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మన మిత్ర ద్వారా ఇప్పుడు కొన్ని పౌర సేవలను ప్రతి ఒక్కరికి అందిస్తాం. ప్రజలు సులభంగా వినియోగించేలా వాట్సప్ గవర్నెన్స్‌ను రూపొం దించాం. వాట్సప్ గవర్నెన్స్ సేవలకోసం చాలాకృషిచేశామన్నారు. ఏపీ ప్రభు త్వంతో కలిసి మనమిత్రను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు. వాట్సప్ డైరెక్టర్, ఇండియా హెడ్ రవి గార్గ్ మాట్లా డుతూ.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం. అయితే సింగిల్ ప్లాట్ ఫామ్‌పై అన్ని రకాల సేవలు అందించడం ఎక్కడాలేదు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను మరింత అభివృద్ధి చేసి మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. హాయ్ అని టైప్‌చేయడం ద్వారా ప్రజలు సులభంగా పౌరసేవలను పొందవచ్చని అన్నారు. మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్య దేవనాథన్ మాట్లా డుతూ.. ఈ రోజు మీ మధ్య ఉండటం చాలా ఆనందంగాఉంది. మన మిత్ర వాట్సప్ సేవలు ప్రారంభించడం జరుగుతోంది. ప్రతి ఒక్కరి జీవితంలో వాట్సప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మన మిత్ర ద్వారా పౌర సేవలను ప్రతి ఒక్కరికి అందిస్తాం. ప్రజలు సులభంగా వినియోగించేలా వాట్సప్ గవర్నెన్స్‌ను రూపొందించాం. వాట్సప్ గవర్నెన్స్ సేవల కోసం చాలా కృషిచేశామన్నారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి మన మిత్రను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు. వాట్సప్ డైరెక్టర్, ఇండియా హెడ్ రవి గార్గ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం. అయితే సింగిల్ ప్లాట్ ఫామ్‌పై అన్ని రకాల సేవలు అందించడం ఎక్కడా లేదు. మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను మరింత అభివృద్ధి చేసి మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకు వస్తాం. హాయ్ అని టైప్ చేయడం ద్వారా ప్రజలు సులభంగా పౌరసేవలను పొందవచ్చని అన్నారు.



ఏటికొప్పాక శకటానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జ్యూరీ అవార్డును కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సథ్ నుండి గురువారం స్వీకరిస్తున్న సమాచారశాఖ జెడీ కిరణ్‌కుమార్

# కేంద్రం ప్రకటించిన జ్యూరీ అవార్డును స్వీకరించిన సమాచారశాఖ అధికారులు

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపత్‌లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవం పెరేడ్‌లో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడవ స్థానం లభించింది. ఏటి కొప్పాక శకటానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జ్యూరీ అవార్డును గురువారం కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సథ్ నుండి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, ఆర్టు డిమాన్స్ట్రేటర్ జి.మధులు సంయుక్తంగా స్వీకరించారు. ఏటి కొప్పాక బొమ్మల తయారీదారుల ప్రతిభకు అవార్డు పొందిన శకటం ప్రతీకగా నిలిచింది. ప్రభుత్వం తరపున ఏటి కొప్పాక కళాకారుల పక్షాన ఈ అవార్డును స్వీకరించే అవకాశం తమకు లభించడం సంతోషంగా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు.

# 15 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

>> ఆమోదం తెలిపింది. నేడు ఆమోదం పొందిన 15 ప్రాజెక్టుల ద్వారా రూ. 19,580 మందికి ఉపాధి లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు రూ. 3,10,925 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 3,12,576 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. గత రెండు ఎస్ఐపిబి సమావేశాల్లో ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల పురోగతి పైనా ఈ రోజు చర్చించారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతరం చర్చలు జరుపుతూ సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సిఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలో అనుమతులు, క్షేత్రస్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష జరపాలని ప్రధాన కార్యదర్శికి సిఎం సూచించారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థలు, జాతీయఅంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందని అన్నారు. ప్రతి అవకాశాన్ని రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ఉపయోగించుకోవాలన్నారు. పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని... ఈ రంగంలో 20 శాతం వృద్ధి సాధించాలని చెప్పారు.

**ఎస్ఐపిబి మూడో సమావేశంలో 15 ప్రాజెక్టులు ఆమోదం**

రాష్ట్రానికి పునరుత్పాదక విద్యుత్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయి. మొత్తం 15 ప్రాజెక్టులుకు పెట్టుబడులు వస్తున్నాయి. వాటిలో నవయుగ ఇంజినీరింగ్ సంస్థద్వారా పునరుత్పాదకరంగంలో పెట్టుబడులు భారీగా ఉన్నాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా గుజ్జిలిలో 1,500 మెగావాట్లతో, చిత్తంవలసలో 800 మెగావాట్ల ప్రాజెక్టును నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ. 14,328 కోట్లతో ఏర్పాటు చేస్తోంది..దీనివలన 3,450 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాలో కొమ్మూరులో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ. 10,300 కోట్లతో 3,000 మందికి ఉపాధి కలిగేలా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును నెలకొల్పనుందన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 118.80 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు యాస్పరి రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తి కనబరిచింది. ఈ ప్రాజెక్టు రాకతో 150 మందికి ఉపాధి లభిస్తుంది. అనంతపురంలో 178.20 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును అనంతపూర్ రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 972.23 కోట్లతో 225 మందికి ఉపాధి కలిగించేలా ఏర్పాటు చేయనుంది. కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వచ్చి శ్రీసత్య సాయి జిల్లాలో కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1,163.11 కోట్లతో 300 మందికి ఉపాధి కలిగేలా 231 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు నెలకొల్పనుంది.

కోరెన్ ఎనర్జీ ఇండియాసంస్థ వచ్చేసి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ 201.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును రూ. 1,651 కోట్లతో నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుద్వారా 255 మందికి ఉపాధి కలుగుతుంది ఎకోరెన్ లిమిటెడ్ నుంచి అయానా రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 4,435 కోట్లతో కర్నూలు జిల్లాలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. 498.30 మెగావాట్ల సామర్థంతో నెలకొల్పే ఈ పవర్ ప్లాంటుతో 630 మందికి ఉపాధి దక్కనుంది.

ఎకోరెన్ లిమిటెడ్ నుంచి ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు, నంద్యా లలో రూ. 3,142 కోట్లతో 350 మెగావాట్ల సామర్థంఉన్న పవనసౌర విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పనుంది. దీనివలన 1,200 మందికి ఉపాధి కలుగుతుంది.. ఒకొక్కటి 300 మెగావాట్ల సామ ర్థంతో మొత్తం 600 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఎస్ఇఎఎల్ సోలార్ ఏర్పాటు చేస్తోంది. రూ. 3,456 కోట్లతో 2,070 మందికి ఉపాధి కలిగేలా అనంతపురం, కడప, నంద్యాలలో ఈ ప్లాంట్లను నెలకొల్పనుంది. అనంతపురంలో 400 మెగావాట్ల సామర్థంతో రూ.2,000 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్ కేంద్రాన్ని టాటా పవర్ నెలకొల్పనుంది. ఈ కేంద్రంద్వారా 1,380 మందికి ఉపాధిలభిస్తుంది. ఎకోరెన్ నుంచి ఎన్ఎస్ఎల్ రెన్యూవబుల్ సిపిపి ప్రైవేట్ లిమిటెడ్ 50 మెగావాట్ల సామర్థం కలిగిన విండ్, సోలార్ హైబ్రిడ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీనికి రూ. 567 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 170 మందికి ఉపాధికలుగుతుంది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ రూ. 1,539 కోట్లతో కాకినాడ జిల్లాలో తమ ఫెర్టిలైజర్ ప్లాంటును విస్తరించేందుకు పెట్టుబడులు పెట్టేందుకు తాజాగా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న సంస్థల్ని సమన్వయం చేసుకుంటూ, త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా చేసేందుకు కన్వీనర్‌ను నియమించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పెట్టుబడులకు ముందుకు వచ్చిన 15 ప్రాజెక్టులకు స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ మూడో సమావేశంలో ఆమోదం లభించింది.

# మహాత్మునికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులర్పిస్తూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అహింసను పరమధర్మంగా చెప్పిన మహాత్ముడు ప్రాత:స్మరణీయుడని అన్నారు. ఆయన బోధనలు నేటికీ అనుసరణీయమని అన్నారు. జాతిపితకు మరొక్కసారి ఘన నివాళి అర్పిస్తున్నానని సిఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఉండవల్లిలోని తన నివాసగృహంలోని మహాత్ముని చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జాతిపితకు మంత్రి నారా లోకేష్ నివాళి**

సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆ మహనీయునికి ఘన నివాళి అర్పించారు. అహింస అనే ఆయుధంతో సూర్యడస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహోన్నతుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరని, తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారని, భారతదేశంపై చెరగని ముద్ర వేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషిచేద్దామని మంత్రి లోకేష్ అన్నారు.



గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు



గురువారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద బాపూజీకి నివాళులర్పిస్తున్న ఖర్గే, రాహుల్

# విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం

>> భూపతిరాజు శ్రీనివాస వర్మతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఆంధ్ర ఎంపీలు ముఖ్యంగా భరత్ అనేకసార్లు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. అనంతరం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి పలుసార్లు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించామని మంత్రి కుమారస్వామి తెలియజేశారు. ఉక్కు ఉత్పత్తిలో భారతదేశం చైనాతో పోటీ పడుతోందని, ఇందులో ఆర్ఎన్ఎల్ పాత్ర చారిత్రాత్మకమైనదని కొనియాడారు. అనేకమంది ఆత్మ బలిదానాల వలన ఈ ప్లాంట్ సాధించుకున్నారన్న విషయం తెలిసి తాను గర్వపడ్డాను అని కుమారస్వామి వెల్లడించారు. 2013 వరకు స్టీల్ ప్లాంట్ గణనీయమైన ఉత్పత్తిని సాధించిందని, ఆ సమయంలో ప్లాంట్ ఉత్పత్తి విస్తరణకు ప్రతిపాదించినప్పటి నుంచి సమస్యలు మొదలయ్యాయని ఆయన తెలియజేశారు. ప్లాంటు సమస్యల్లో ఉండడం, నష్టాల బాట పట్టడంతో ఈ కర్మగారని ప్రైవేటుపరం చేయాలని ఆలోచన గతంలో వచ్చిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే తాను జూలైలో ప్లాంట్ సందర్శించినప్పుడు, దీనిని ప్రైవేటుపరం చేయకూడదని, ఈ కర్మాగారాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలన్న ఆలోచనకు వచ్చామని కుమారస్వామి స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రితో చర్చించానని, ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేయొద్దు అంటూ పలుసార్లు చేసిన విజ్ఞప్తులను కూడా పరిగణలోకి తీసుకుందామని మంత్రి వెల్లడించారు. తన విశాఖపట్నంలో భాగంగా స్టీల్ ప్లాంట్ కార్మికులతో మాట్లాడానని, ప్లాంట్ ను ఉన్నతంగా నిర్ణయానికి వచ్చామని కుమారస్వామి వివరించారు. ఆంధ్ర ప్రజల మనోభావాలకు అనుగుణంగా కార్మికుల కోరికలకు అనుగుణంగా నడుచుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఉక్కు యాజమాన్యంతో మాట్లాడేందుకు విశాఖ వచ్చామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులతో ప్లాంట్‌ను ఏ విధంగా ముందుకు తీసుకు వెళ్లాలి అన్న అంశాన్ని చర్చిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఉన్న పరిస్థితిని ప్రధానికి వివరిస్తామని చెప్పారు. 2030 నాటికి స్టీల్ ఉత్పత్తిని 2000 టన్నులకు తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక పర్యాయాలు ఢిల్లీ వచ్చి ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి తో చర్చలు జరిపారని, అందువలన ప్లాంట్ కు మంచి జరిగిందని శ్రీనివాస వర్మ తెలిపారు.

## బాపూజీ నివాళి సభలో
# చప్పట్లు కొట్టిన బీహార్ సీఎం

**పాట్నా, జనవరి 30:** మహాత్మాగాంధీ వర్ధంతి సభలో పూజ్యబాపూజీకి నివాళులర్పించిన అనంతరం బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చప్పట్లు కొట్టడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గురువారం ఆయన నివాళులు అర్పించిన వెంటనే చపట్లు చరిచారు. అంతలోనే తన తప్పును తెలుసుకుని చప్పట్లను నిలిపివేసారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో బాపూజీకి ఘననివాళులర్పించే కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ సిఎం నితీష్‌కుమార్ బాపూజీకి నివాళులర్పించి అందరిలోను ఒక్కసారిగా చప్పట్లు కొట్టడంతో పక్కనున్నవారు విస్తుపోయారు. అసలు సందర్భం ఏమిటి? నితీష్ చప్పట్లు కొట్టడం ఏమిటి అన్న అంశాన్ని అందరూ చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ స్పీకర్ నంద్‌కిశోర్‌యాదవ్ ఆయన పక్కనే నిలుచుని ఉండటంతో చప్పట్లు ఆపేయాలని సంకేతాలివ్వడంతో నితీష్ తన తప్పు తెలుసుకుని చప్పట్లు నిలిపివేసారు. నితీష్‌కుమార్ ఇలా తప్పులుచేసి హెడ్‌లైన్లలోకి రావడం కొత్తేమీ కాదు. ఎన్డీయే కూటమికోసం 2024 లోక్‌సభ ఎన్నికల్లోప్రచారంచేస్తూ ఎన్డీయేకు లోక్‌సభలో 4000 సీట్లకుపైగా వస్తాయని ప్రకటించారు. లోక్‌సభ సీట్ల కంటే ఎన్నోరెట్లు సంఖ్యను చెపుతూ ఆయన ప్రకటన చేయడాన్ని అందరూ నోరెళ్లబెట్టారు. ఆయన విడియోలను అప్పట్లో ఆర్జేడి నాయకులు రాష్ట్రమంతటా వైరల్‌చేసారు.

**ఢిల్లీలోనూ మహాత్మకు ఘననివాళులు**

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలనాయకులు, అధికార పార్టీలనేతలు ఘననివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానిమోడీతోపాటు విపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, ఖర్గే, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు మహాత్మకు నివాళి అర్పించినవారిలో ఉన్నారు. ప్రధానిమోడీ ఈ సందర్భంగా బాపూజీ అభివృద్ధిచెందిన భారతావనికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారన్నారు. అహింసావాదం, సత్యమేవ జయత్ నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంచేసారన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్; ఇతర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కూడా బాపూజీకి నివాళులర్పించారు.

## మూడున్నర దశాబ్దాల పోలీసు జీవితాన్ని
# సంతృప్తికరంగా ముగిస్తున్నా
## నేడు పదవి విరమణ చేయనున్న డిజిపి తిరుమలరావు



**విజయవాడ జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు సర్వీసును తానెంతో సంతృప్తి ముగిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ డిజిపి ద్వారకా తిరుమల రావు అన్నారు. సీహెచ్ ద్వారకా తిరుమల రావు శుక్రవారం పదవి విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా నియమితులయ్యారు. ఇప్పటి వరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా ఆయన విధులు నిర్వహించారు. ఇక, ఈ రోజు మీడియాతో మాట్లాడిన డిజిపి ద్వారక తిరుమల రావు ఏడు నెలలుగా డిజిపిగా పని చేస్తున్నాను. 35 ఏళ్లుగా పోలీస్ సేవలు సంతృప్తికరంగా అందించాను అనే తృప్తి ఉందన్నారు. చాలా సంతోషంగా పదవి విరమణ చేయబోతున్నానే. ఏపిలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి. సైబర్ క్రైమ్ తప్ప మిగతా వాటిలో నిందితులను గుర్తిస్తున్నామన్నారు.. సైబర్ క్రైమ్ తప్ప అన్నీ కంట్రోల్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు.

కచ్చితంగా ఏపి పోలీసు ఈ విషయంలోను విజయం సాధిస్తుందనే తాను అభిప్రాయపడుతున్నానన్నారు. వరదల సమ యంలో కూడా పోలీసులు మెరుగైన సేవలు అందించారని అభినందించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థలో టెక్నాలజీని అంది పుచ్చుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. నేరాల రేటు తగ్గింది. మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు 9.5 శాతం తగ్గాయన్నారు. రోడ్డు సేఫ్టీ పై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. సిసి కెమెరాలను ప్రజల భాగస్వామ్యంతో కలిసి ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు 25 వేల కెమెరాలు ఏర్పాటు చేశాం. మార్చి 31వ తేదీ నాటికి లక్ష కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. డ్రోన్స్ ను కూడా దాతల సాయంతో అన్ని చోట్లా అందుబాటులోకి తెచ్చే యత్నం చేస్తున్నాం అన్నారు.

# మెట్రోరైలు ప్రాజెక్టు భూసేకరణకు ఆదేశం

>> ఇచ్చిన ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.. నిజానికి మెట్రో రైలు ప్రాజెక్టుల తొలి దశ పనులకు గత డిసెంబర్‌లో జరిగిన కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపింది. రెండుచోట్లా కలిపి తొలిదశ పనులకు రూ.11,009 కోట్లు అవసరమని అంచనా వేశారు. డిపిఆర్‌లను కేంద్రప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. వీటికి 100 శాతం నిధులు ఇవ్వాలని సిఎం చంద్రబాబు కేంద్రా నికి లేఖ రాశారు. ఈ లోగా భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవలే విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల తొలిదశ డిపిఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. విశాఖలో మొదటి దశలో రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో 46 కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వ కారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మిస్తారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30 కిలోమీటర్లు మరో కారిడార్ నిర్మించనున్నారు. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో రెండు కారిడార్‌లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించింది. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ చేపట్టనున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 31-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
శుక్ల విదియ మ.1.59
శతభిష తె.4.13
వర్జ్యం మ.12.33-2.02
దు.ఉ.9.04-9.49, 2) మ.12.52-1.37
శుభసమయం : ఉ.7.00-8.00, సా.5.00-5.50
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** అనారోగ్యం, బంధువులతో విరోధాలు ఏర్పడి చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు ఏర్పడిన అధిగమించి ముందుకు సాగతారు. ధనలాభం.

**మిథునం:** పనులు వాయిదా పడుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో లాభాలు పొందుతారు. నూతన పరిచయాలు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. కొత్త పనులు చేపడతారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**సింహం:** దూర ప్రాంతాలనుంచి ఆహ్వానాలు అందుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** పారిశ్రామిక, రాజకీయ వర్గాలలో వారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**తుల :** ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు, మానసిక ప్రశాంతత పొందుతారు. నూతన వస్తు, వస్త్రాల కొనుగోలు.

**వృశ్చికం:** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తువులు కొంటారు, వాహన యోగం.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకొంటారు. ఆరోగ్య భంగం. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మకరం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగిన నిదానంగా తీసుకొంటారు. దైవదర్శనాలు ప్రయాణాలు.

**కుంభం:** కుటుంబ బాధ్యతులు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. వస్తుసేకరణ, సంఘంలో గౌరవం పెరుగుతుంది.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అస్థిగమిస్తారు. ధన వ్యయం. జీవిత భాగస్వామి సాయం అందిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## పుంగనూరు ఓటర్ల కన్నా పెద్దిరెడ్డి పాపాల లిస్టే ఎక్కువ

### - శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ

విజయవాడ జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతికి అంతంలేకుండా వ్యవహరించారని ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. ఆయన అవినీతి వ్యవహారాలపై ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే ఆయన్ను మించిన వ్యక్తి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని పుంగనూరు ఓటర్ల లిస్టు కన్నా పెద్దిరెడ్డి అవినీతి, పాపాల లిస్టే ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన పగలు పూజలు రాత్రంతా దోపిడీలు చేస్తుంటారని ఆరోపించారు. పెద్దిరెడ్డి అవినీతి సామ్రాజ్యం మండల స్థాయం నుంచి కేంద్రం వరకు పాకిందన్నారు. శివశక్తి పాల డైయిరీ ద్వారా రైతుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో అసైన్డ్ భూములు పుంగునూరు మండలం రాగానిపల్లెలో భూములు కొట్టేయలేదా అని ప్రశ్నించారు. రేణిగుంట పరిధిలోని 20 ఎకరాల ప్రభుత్వ భూమి పెద్దిరెడ్డి భార్య పేరున ఎలా వచ్చిందని అనురాధ నిలదీశారు.



ముఖ్యమంత్రి తో మెటా ఇండియా పాధ్యక్షురాలు సంధ్య దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గ్, మెటా స్ట్రాటజిక్ ప్రొగ్రామ్స్ పార్టనర్‌షిప్స్ దివ్య కెమనీ వధేరా ఐటీ, విద్యాశాఖా మంత్రి లోకేష్

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో మెటా ఇండియా ప్రతినిధుల భేటీ

విజయవాడ.జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మెటా ఇండియా ఉపాధ్యక్షురాలు సంధ్య దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గ్, మెటా స్ట్రాటజిక్ ప్రొగ్రామ్స్ పార్టనర్ షిప్స్ దివ్య కెమనీ వధేరా ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌తో కలిసి సమావేశమయ్యారు. రాష్ట్రం లో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు గురువారం ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని సీఎం చంద్రబాబు నాయుడు సముచిత రీతిన సత్కరించారు. దేశంలో తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందించిన మెటా ఇండియా సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మంచి పౌరసేవలు అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## భవిష్యత్ బిజినెస్ లీడర్లను తయారు చేయడమే సీడ్ యాప్ లక్ష్యం

### - చైర్మన్, రాష్ట్ర ఉపాధి కల్పన వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ గుణపాటి దీపక్ రెడ్డి

విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రం నుంచి భవిష్యత్తు బిజినెస్ లీడర్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీడ్ యాప్ పనిచేస్తుందని అందుకు ఐఎస్బీ తో ఒప్పందం కూడా చేసుకున్నామని ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి తెలిపారు.. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లో గల సీడ్ యాప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ దీపక్ రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో కొన్ని కోర్సులకు ఎంవోయూ చేసుకోవడంలో ముఖ్యమైన ఉద్దేశ్యం వన్ ఫ్యామిలీవన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదమే అని అన్నారు. అదేవిధంగా సెంచూరియన్ యూనివర్శిటీతో ఒప్పందం చేసుకున్నామని, దీనివల్ల 40 శాతం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి స్వయం ఉపాధిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లో రానున్న మూడు సంవత్సరాల్లో 22 వేల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సీడ్ యాప్ ఒక నోడల్ ఏజెన్సీగా ఉండేలా, ముఖ్యమంత్రి డైరెక్షన్స్ లో పనిచేస్తుందన్నారు. యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా క్షేత్ర స్థాయిలో యువతకు అవకాశాలు కల్పిస్తామన్నారు. మంత్రి లోకేష్ మార్గనిర్ధేశంలో మేం డైనమిక్ గా పని చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు 6 ఇండస్ట్రియల్ పాలసీలు ఈ ఆరు నెలల్లోనే ప్రకటించామన్నారు. ప్రజల సౌకర్యం కోసం మన మిత్ర అనే యాప్ ద్వారా 166 సర్వీసులు అందుబాటులో ఉండేలా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చమని, దీన్ని 520 సర్వీసులకు తీసుకెళ్లతామన్నారు. స్వర్ణాంధ్ర 2047 విడుదల చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 347 లక్షల కోట్లకు పెంచేందుకు, తలసరి ఆదాయాన్ని 58 లక్షలకు పెంచేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. ఏపీని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా పని చేయాలని ముఖ్యమంత్రి చెప్పారని, 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ధ్యేయంగా పెట్టుకున్నారని అందులో సీడ్ యాప్ కూడా భాగస్వామి అయ్యిందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ళు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్నారు. ఏపీ ఫిజికల్ హెల్త్ ఇండెక్స్ 17 వ స్థానానికి దిగజారిందని, చివరన పంజాబ్ రాష్ట్రం మాత్రమే ఉండగా, ఆ రాష్ట్రం పైన మన రాష్ట్రం ఉండటం దురదృష్టకరమన్నారు. ఐఎస్బీ ప్రతినిధి డాక్టర్. చందన్ చౌదరి మాట్లాడుతూ మాన్యుఫాక్షరింగ్ రంగంలో లీడర్స్ ను తయారు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఉద్యోగ సృష్టి ఎగుమతిని పెంచడానికి మనం తయారీ రంగం వృద్ధిని పెంచాలన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం తయారీ రంగంలో వేగవంతమైన వృద్ధిని ప్రదర్శించడం, ఉద్యోగాలను సృష్టించడం సరికొత్త విధానం.




సీడ్ యాప్. ఐఎస్బీ తో ఒప్పంద దృశ్యం

## ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు యధాతథం

### - ప్రభుత్వం కీలక నిర్ణయం

విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలపై వచ్చిన ప్రజాభిప్రాయాల ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు యథాతథంగా నిర్వహించాలనే నిశ్చయానికి వచ్చింది. జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) సిలబస్ అమలు, పరీక్షల నిర్వహణ, అంతర్గత మార్కుల విధానం లాంటి పలు ప్రతిపాదనలను ఇటీవల ఇంటర్మీడియట్ విద్యామండలి ఇటీవల ప్రకటించింది. ఈ ప్రతిపాదనలపై ఈ నెల 26 వరకు సలహాలు, సూచనలు స్వీకరించింది. ఈ సూచనల మేరకు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు యథాతథంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరీక్షలు నిర్వహించకపోతే విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టరని, అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోతాయని లాంటి పలు సూచనలు వచ్చాయి. అంతర్గత మార్కుల విధానం ప్రతిపాదనలను విరమించుకోనుంది. ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేస్తూ ప్రస్తుతం ఉన్న విధానంలోనే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. గణితంలో ఏ, బీ పేపర్లు ఉండవు. రెండింటిని కలిపి ఒకే పేపర్‌గా ఇస్తారు. వృక్ష, జంతు శాస్త్రాలు కలిపి జీవశాస్త్రంగా ఒకే పేపర్ ఉంటుంది. రెండు భాష సబ్జెక్టుల్లో ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటుంది. మరో భాష సబ్జెక్టును విద్యార్థులు ఐచ్ఛికంగా ఎంపిక చేసుకోవచ్చు. వీటిపై త్వరలో ఇంటర్మీడియట్ విద్యామండలి సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయనున్నారు.

## రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

### - ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం - వాయిదాల్లో ఫీజుల చెల్లింపు, 150 గజాల వరకూ ఉచితం

విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో అభ్యంతరం లేని గవర్నమెంటు భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట ఆక్రమించుకున్న భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి నిబంధనలు జారీ చేసింది. ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులన్నింటిని పక్కన పెడుతూ జీవో నెంబర్ 30ని జారీ చేసింది. 2019 అక్టోబర్ 15 తేదీని కట్ ఆఫ్ డేట్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. 150 గజాల వరకూ ఉచితంగానే క్రమబద్ధీకరణ చేయనున్నట్టు వెల్లడించింది. 301 గజాల కంటే ఎక్కువ భూమి ఆక్రమణలో ఉంటే సాధారణ రిజిస్ట్రేషన్ విలువతోనే క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం కల్పిస్తూ.. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు (బీపీఎల్) ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు, గుడిసెలు వేసుకొని ఉంటే అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. పేదలు కాని వారు ఉన్నా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం ఈ ఏడాది డి సెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. వీటిపై గ్రామ వీఆర్వో, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసిల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా తహసిల్దార్ కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారు. ఇదిలాఉండగా, గతంలో జగన్ సర్కారు వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు, అసలు దరఖాస్తు చేసుకోనివారు కూడా ఇప్పుడు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని రె వెన్యూశాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది.

## రైల్ భవన్‌పై త్రివర్ణ పతాకం!

### - రైల్వే ఎన్నికల ఫలితాల తుది జాబితా వెల్లడి - 08 రైల్వే జోన్‌లలో ఎన్‌ఎఫ్‌ఐఆర్ విజయబావుట

గుంతకల్లు రైల్వే,జనవరి 30,ప్రభాతవార్త దేశవ్యాప్తంగా అత్యధిక కార్మికులు ఉన్న రైల్వే శాఖలో జరిగిన రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలలో ఈ దఫా కార్మిక లోకం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్(ఎన్ఎఫ్ఐఆర్)వైపు మొగ్గు చూపింది. అత్యధికంగా 08రైల్వే జోన్‌లలో విజయం సాధించి మొదటి స్థానంలో నిలవగా అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య (ఎఐఆర్ఎఫ్)07రైల్వే జోన్‌లలో గెలుపొంది రెండో స్థానంలో నిలిచింది. అలాగే ఈ ఎన్నికలలో ఈస్ట్ సెంట్రల్ రైల్వేఎంప్లాయిస్ యూనియన్, ఈశాన్య రైల్వే మజ్దూర్ కాంగ్రెస్, సిఎల్‌డబ్ల్యూ ట్రేడ్ యూనియన్, ఆర్‌సిఎఫ్ ఎంప్లాయిస్ యూనియన్‌లు చెరో ఒక్కొక్క రైల్వే జోన్‌లలో గెలుపొందాయి. డిసెంబరు 4-6వ తేదీల్లో జరిగిన రహస్య బ్యాలెట్ ఎన్నికలు-3-2024 ఫలితాల తుది జాబితాను రహస్య బ్యాలెట్ ఎన్నికల కమిటీ చైర్మన్ రాజీవ్ కిశోర్ సభ్యులు అలోక్ కుమార్, రాజీవ్‌గాంధీలు విడుదల చేశారు. ఆయా రైల్వే జోన్‌లలో పోటీ చేసి నిర్ణీత ఓట్ల శాతంతో గుర్తింపును చేజిక్కించుకున్న కార్మిక సంఘాలు, వాటి వివరాలు ఇలా వున్నాయి.

**ఎన్ఎఫ్ఐఆర్ విజయం సాధించిన రైల్వే జోన్‌లు :** సెంట్రల్ రైల్వే-45.76శాతం ఓట్లను సాధించగా, ఈస్ట్ కోస్ట్ రైల్వే-47.62శాతం, నార్త్ సెంట్రల్ రైల్వే-38.92శాతం, ఈశాన్య రైల్వే-52.62శాతం, నార్త్ వెస్ట్రన్ రైల్వే-38.53శాతం, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే-28.61శాతం, పశ్చిమ రైల్వే-37.68శాతం, పశ్చిమ మధ్య రైల్వే-40.01శాతం ఓట్లను సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

**ఎఐఆర్ఎఫ్‌కు దక్కిన రైల్వే జోన్‌లు :-** ఈస్ట్రన్ రైల్వే-42.07శాతం, నార్దన్ రైల్వే-46.11శాతం, సదరన్ రైల్వే-38.20శాతం, దక్షిణ మధ్య రైల్వే-47.46శాతం, ఆగ్నేయ రైల్వే-37.51శాతం, నైరుతి రైల్వే-41.77శాతం, మెట్రో రైల్వే-36.23శాతం ఓట్ల శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఇక ఈస్ట్ సెంట్రల్ రైల్వ జోన్‌లో ఎంప్లాయిస్ యూనియన్‌కు 34.14శాతం ఓట్లు లభించగా, ఈశాన్య రైల్వే జోన్‌లో ఎన్ఇఆర్ ఎంసికు 46.33శాతం, చిత్తరంజన్ లోకో మోటివ్ వర్క్స్‌లో సిఎల్‌డబ్ల్యులేబర్ యూనియన్‌కు 43.28శాతం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఆర్‌సిఎఫ్ ఎంప్లాయిస్ యూనియన్‌కు 43.81శాతం ఓట్లతో చెరో ఒక్కొక్క రైల్వే జోన్‌లలో గెలుపొంది తమ తమ అధిక్యతను చాటి చెప్పాయి.

## మహాత్ముడికి వైఎస్ జగన్ నివాళి

విజయవాడ జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భాఇన్న పురస్కరించుకుని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా నివాళులర్పించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ వారి వర్ధంతి సందర్భంగా నివాళులు. అహింస వాదంతో ఏమైనా సాధించవచ్చని దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చి చూపించిన మహనీయుడు ఆయన. గాంధీ సిద్ధాంతాలు, ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శనీయం. సత్యమేవ జయతే అని సందేశం ఉంచారాయన అంటూ ట్వీట్‌లో జగన్ పేర్కొన్నారు.

## తిరుమలలో శిలాతోరణం వద్ద చిరుత సంచారం

### - సర్వదర్శన క్యూలైన్ వద్ద భయంభయంగా భక్తులు

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో ఔటర్‌రింగురోడ్డులో శిలాతోరణం వెళ్ళే మార్గంలో సర్వదర్శనం క్యూలైన్ సమీపంలో చిరుతపులి గురువారం రాత్రి సంచరించింది. ఏకంగా క్యూలైన్‌కు పక్కనే ఓ బండపై కూర్చుని ఉండటంతో గమనించిన సిబ్బంది భయంతో పరుగులుతీశారు. ఏకంగా శిలాతోరణం ప్రాంతంలో చిరుతపులి రావడంతో సామాన్యభక్తులు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. సాధారణంగా ఈ ప్రాంతంలో చీకటిపడితే భక్తుల సంచారం కూడా పెద్దగా ఉండదు, రద్దీ ఎక్కువైతే క్యూలైన్‌లు ఔటర్‌రింగురోడ్డు వరకు విస్తరిస్తాయి. మరీ అడవిని వదలి జనావాసాల్లోకి వచ్చిన చిరుతను బందించాలని భక్తులు కోరుతన్నారు.

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు త్వరలో బయటికి వస్తాయి

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, జనవరి 30 : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అన్యాయాలు అక్రమాలు త్వరలో బయటకు తీసి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 7 నెలల కాలంలోనే ప్రజలు సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారన్నారు. ప్రజలు మాపై చూపిన నమ్మకాన్ని తప్పక నెరవేరుస్తామని గతంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయడం జరుగుతుందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ఐదు సంవత్సరాలలో పుంగనూరు నియోజకవర్గ ప్రజలనే మోసం చేసి వారి భూములను దోచుకోవడం జరిగిందన్నారు. మీ నియోజకవర్గ ప్రజలు నాలుగైదు సార్లు ఎమ్మెల్యేగా మీ కుమారుడిని ఎంపీగా గెలిపించారని అయినా వారి మీద ఎలాంటి దయాదాక్షయాలు లేకుండా వారికి ఎంతో అన్యాయం చేశారన్నారు. మీ నియోజకవర్గంలో గతంలో పాడి రైతులు లీటరు పాలు 25 రూపాయలకు అమ్ముకుని బ్రతికేవారని అలాంటి వారిని బెదిరించి కేవలం 18 రూపాయలకే వారి దగ్గర పాలు కొనుగోలు చేసి వారి కడుపు కొట్టింది నీవు కాదా! రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు మదనపల్లె ప్రాంతాల్లో ఉన్న మామిడి రైతుల పంటలను దోచుకుని కిలో 13 రూపాయలకు అమ్మే మామిడికాయలను కేవలం 8 రూపాయలకే కొనుగోలు చేసి మామిడి రైతుల కడుపు కొట్టలేదా! అంటూ ప్రశ్నించారు.

# తిరుమల సమాచారం

## ఫిబ్రవరి 4న రథసప్తమి వేడుకలు

### - ఒకేరోజు సప్తవాహనాలపై ఊరేగనున్న శ్రీవారు
### - ఫిబ్రవరి 3నుండి 5వరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ రద్దు

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి: మాఘమాసం సప్తమితిధి ఫిబ్రవరి 4వతేదీ మంగళవారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, విజిలెన్స్, పోలీసు విభాగాల అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ, కాఫీ, పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు. మంగళవారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు, బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. ఫిబ్రవరి 3వతేదీ నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. 4వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభ వాహనసేవలు నిర్వహిస్తారు.

## ఎస్వీసర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



తిరుమల,జనవరి 30ప్రభాత వార్తప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లలో భాగంగా దాతలు అన్ని పథకాలకు విరాళాలందిస్తున్నారు. తాజాగా గురువారం ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు బ్లిస్‌హోటల్స్ గ్రూప్ ఛైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి దంపతులు 10,00,116రూపాయలు విరాళాల చెక్కును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## సర్వభూపాలవాహనం ప్రయోగాత్మక పరిశీలన

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి: రానున్న మంగళవారం రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని ఏడువాహనాలపై దేవదేవుడు ఊరేగనున్న నేపథ్యంలో ముందస్తుగా సర్వభూపావాహనం ప్రయోగాత్మక పరిశీలన చేశారు. గురువారం మధ్యాహ్నం ఈ వాహనం పటిష్టతను పరిశీలించేందుకు టిటిడి అధికారులు ట్రయల్‌రన్‌ను నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి విహరించే అన్ని వాహనాల్లోకంటే సర్వభూపాలవాహనం బరువుగా ఉంటుంది. ఈ వాహనసేవ సమయంలో వాహనమోతదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా అధికారులు పరిశీలించారు.


## శ్రీవారి తోమాల సేవలో కేంద్రమంత్రి కుమారస్వామి



తిరుమల,జనవరి 30ప్రభాతవార్త ప్రతినిధి: కలి యుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వేకువజామున కేంద్ర మంత్రి కుమారస్వామి కుటుంబంతో కలసి తోమాలసేవలో పాల్గొన్నారు. వేకువజామున ఆలయం వద్దకు విచ్చేసిన కేంద్ర మంత్రికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోని శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులుశ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రితో బాటు టిటిడి మాజీ బోర్డుసభ్యుడు ఓవి రమణ ఉన్నారు.

## నేడు టిటిడి పాలకమండలి సమావేశం

### - ప్రయాగ్‌రాజ్‌లో డిప్యూటేషన్ విధుల్లో ఉద్యోగి అదృశ్యంపై ఆందోళన



తిరుమల,జనవరి 30ప్రభాత వార్త ప్రతినిధి: తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్లు సౌకర్యాలు కల్పించడం, త్వరితగతిన దర్శనం ఏర్పాట్లు, ఏఐ విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఉదయం టిటిడి పాలకమండలి సమావేశం కీలకంగా చర్చించనుంది. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అంతేగాక ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యాలు, రద్దీ నియంత్రణ, బోర్డు సభ్యులు సేవలందించడం, అధికారులతో సమన్వయంగా వ్యవహరించడం, పాత కాటేజీలను పడగొట్టి కొత్తవి నిర్మాణం చేయడం, నెయ్యి సరఫరా, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం పలు అంశాలు చర్చకు రానున్నాయి. సాధారణంగా ప్రతి మూడునెలలకోసారి జరగాల్సిన పాలకమండలి సమావేశాన్ని ఛైర్మన్లు, కొందరు బోర్డు సభ్యులు తమకు అనుకూలంగా మలచుకుని ఇష్టానుసారంగా జరిపిస్తున్నారనే విమర్శలు కూడా టిటిడి వర్గాల్లోవినిపిస్తున్నాయి. కాగా ఉత్తరప్రదేశ్ ప్రయోగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా వేడుకల్లో టిటిడి అక్కడ శ్రీవారి నమూనా ఆలయం నిర్మించి ఉత్తరాదిభక్తులకు దర్శనం చేయిస్తోంది. ఆ ఆలయంలో తిరుమల తరహాలు నిత్యకైంకర్యాలు, నిత్య పూజలు జరిపించి భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. ఇందుకోసం తిరుమల, తిరుపతి నుండి 200మంది పలు విభాగాల ఉద్యోగులను, అర్చకులను డిప్యూటేషన్‌పై ప్రయోగరాజ్‌కు పంపారు. రెండురోజుల క్రిందట జరిగిన మహాతొక్కిసలాటలో 30మంది వరకు యాత్రికులు చనిపోయారు.

ఈ నేపథ్యంలో డిప్యూటేషన్ విధులకు వెళ్ళిన టిటిడి ఉద్యోగి దీవేటి సుబ్రమణ్యం బుధవారం సాయంత్రం నుండి కనిపించడం లేదని తిరుపతిలోని టిటిడి అధికారులకు సమాచారం అందింది. దీనిపై టిటిడి ఇఒ, అదనపు ఇఒలు వెంటనే స్పందించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ప్రయాగరాజ్‌లోని పోలీసు అధికారులు, ఇతర టిటిడి ఉద్యోగులతో సంప్రదింపులు జరిపారు. ఆచూకి తెలుసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఉద్యోగి ఆచూకీ కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు.

వార్త

మానవుడు తన అదృష్టం వక్రించినప్పుడు మానవాతీత శక్తి ఏదో ఉందని అనుకుంటాడు. అదృష్టం బాగా ఉన్నప్పుడు అదంతా తన గొప్పతనమే అనుకుంటాడు.

-జార్జ్ శాంతాయన

# డాలర్ కలలు కల్లలు!

అలనాడు శ్వేత సౌధాధినేత ట్రంప్ పాలనను హర్షించని వారు సైతం ఈసారి ఆయనేకావాలని అమెరికన్లు అనుకున్నారు. భారత్ తదితర దేశాల వారూ కోరుకున్నారు. కానీ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఈ పది రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు బాగా చర్చనీయాంశమయ్యాయి. ఏరోజు కారోజు ఆయన తీసుకున్న నిర్ణయాలపై ఎడతెగని చర్చ కొనసాగుతోంది. అమెరికన్ల తొలిప్రాధాన్యత అనే లక్ష్యంతో ముందుకు సాగడం మంచిదే కానీ ఇతరత్రా కొన్ని దేశాలను, ఎంతో ఆశతో బ్రతుకు తెరువుకోసం మంచి భవిష్యత్తును ఆశించి అమెరికాకు వచ్చిన వారి ఆశలపై నీళ్లు జల్లారు. కొంతమందిలో హర్షాతిరేకాలు మరి కొంత మందికి ఆందోళన ఈసారి ప్రధానంగా ఆయన అమెరికన్లే ఫస్ట్ తొలి ప్రధానిగా అమెరికా నుండి వారిసంక్షేమం, ఉపాధి సంరక్షణ అనేదారుల్లో ముందుకు సాగుతున్నారు. ట్రంప్ అంటే ఆచితూచి అడుగులు వేసేరకం కాదు.లేడికి లేచిందే పరుగు అన్నట్లుంటుంది ఆయన వ్యవహారశైలి. తమ దేశానికి నష్టంకలిగించే విధానాలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలో ఇప్పుడాయన ఘనాపాటి. విదేశీ వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తే దేశఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు వారిస్తున్నా ఆయన ఆగడం లేదు.వివిధ దేశాల ఉత్పత్తులను అమెరికన్లు వినియోగిస్తుంటారు.వాటిపై ఇప్పుడు అధికసుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమైంది. నిన్న గాక మొన్న వలసలపై తన విశ్వరూపం చూపించారు. తన అంతరంగాన్ని బయటపెట్టారు. అమెరికాలో పౌరసత్వం లేకుండా నివసిస్తున్న వారిపై చెక్ పెట్టారు.వారిని తిప్పి వారి వారి దేశాలకు పంపించేయాలన్నది ఆయన ఆలోచన. అదే చెప్పారు కూడా.వారివల్లనే అమెరికన్లకు పనులు తగ్గాయన్నది ఆయన అభియోగం. 'జన్మతః పౌరసత్వం' ఆలోచన పర్యవసానం ఎలాఉంటుందో అంచనా వేసిన ఐఎంఎఫ్ వంటిసంస్థలు హెచ్చరిస్తూనే ఉన్నాయి. తాత్కాలికంగా అమెరికన్లు ఉపాధి అవకాశాలు పెంచుకోగలిగినా ఈ నిర్ణయం అమెరికా ఆర్థికవ్యవస్థకు ఏమాత్రం నష్టం కలిగినా ఊహించని ఉపద్రవాలు ఎదురౌతాయి. ఆదిలో ట్రంప్ నిర్ణయాలు రుచించడం లేదని ససేమిరా అన్న కొలంబియా ఇప్పుడు ట్రంప్ దారిలోకివచ్చింది. కొలంబియా ఉత్పత్తులపై టారిఫ్ విధిస్తామని హెచ్చరించడంతో అమెరికాలో ఉన్న కొలంబియా వాసుల్ని తిరిగి తమ దేశానికి రప్పించేసుకుంటామని భరోసా ఇచ్చింది. ఎవరెవరికి వలసదారుల అనుమతులున్నా శాశ్వత పౌరులు కాని వారిపై వేటుపడే విషయం సుస్పష్టం.మరోటి పారిస్ ఒప్పందంనుంచి అమెరికా వైదొలగడం.ఇవన్నీ ఇలావుంటే అమెరికన్లపై ఆదాయం పన్ను భారం లేకుండా చేయాలని మరో వ్యక్తీకరణ. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన అభిప్రాయం. అమెరికన్లు అంతర్జాతీయంగా శక్తివంతులుగా, సంపన్నులుగా చూడాలన్నదే తన ఆకాంక్షగా అభివర్ణించారు. నిజంగా పాలకుడికి ఉండాల్సిన లక్షణమే. అమెరికా వాణిజ్య వ్యవస్థను మార్చేందుకు సైతం ఆయన కంకణం కట్టుకున్నారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై ఎలాంటి విధానాన్నిఅనుసరిస్తారో ఇతమిత్థంగా తెలలేదు. కానీ భారతీయులు ఆందోళన పడుతున్నారు. ప్రసవ వేద నలుపడుతున్న వారిలోసైతం కంగారు మొదలైంది. ట్రంప్‌రాకతో భారతీయుల డాలర్ డ్రీమ్స్‌కు ఆటంకం ఏర్పడిందన్నది విదితమే. మెక్సికో, బ్రెజిల్, కొలంబియా దేశాల విద్యార్థులైతే తిరిగి తమదేశాలకు ప్రయాణం కట్టారు. ఇప్పటికే డిపోర్టేషన్ నిర్భయం వెలువడగానే అమెరికన్ పోలీసులు అక్రమ వలసదారులు జల్లెడపట్టే పనిలో ఉ న్నారు. న్యూయార్క్,న్యూజెర్సీ లలో గురుద్వారాలు,సోదా మొదలైంది. ఎఫ్1బి పత్రాలతో అనేక లక్షల మంది అక్కడే కాలక్షేపం చేస్తున్నారు.వారిలో భారతీయ విద్యార్థులూ అధికులే. భారత దేశ ఉత్పత్తులను కూడా అధిక సుంకం జాబితాలో చేర్చినందున,భారతీయ విద్యార్థుల స్థితిగతులపై ట్రంప్ ప్రభుత్వానికి పెద్దగాసానుకూల వైఖరి ఉన్నట్లు లేదు. అయితే భారత ప్రధాని నరేంద్ర మోడీ, ట్రంప్‌ల మధ్య ఏదైనా సయోధ్య నిర్ణయాలు జరిగితే తాము గట్టెక్కినట్లేనని భారతీయులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రోజుకో కొత్తఉత్తర్వుతో వలసదారుల వెన్నులో చలిపుట్టిస్తున్న ట్రంప్ అమెరికాపౌరుల ఆదాయ పన్ను రద్దుచేసారు సరే. ఆలోటు భర్తీచేయడానికి తమపై భిన్న ఆలోచనలున్న దేశాలకు బాగా వడ్డించి ఆదాయం పొందాలని రంగంలోకి దిగాడు. ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీస్ ప్రారంభించానని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. 1913వరకూ అమెరికాలో సుంకాల ఆధారిత ఆర్థికవ్యవస్థ ఉండేదన్నారు. ఇండియా నుంచి అమెరికావెళ్లే ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచడంవల్ల అమెరికా మార్కెట్‌ను లక్ష్యంగా వ్యాపారం చేసే భారతీయులు వ్యాపారం దెబ్బ తినడం ఖాయం. విదేశీయులపై కూడా సుంకం పెంచడ మంటే అమెరికాలోని ఎన్నారైలు కూడా రిస్కులో పడుతు న్నట్లే. అదే జరిగితే అమెరికా వచ్చేఎన్నారైల సంపాదన ఇక్కడపన్నులతో సరిపోతుంది. ఇలా చేస్తే విదేశీయులు రాక తగ్గి స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని ట్రంప్ ఎత్తుగడ. కొత్త విధానాల అమలులో కూడా అమెరికా దుందుడుకు వైఖరి అవలంబిస్తే ప్రపంచ దేశాలతో వివాదాలను కొనితెచ్చుకున్నట్లే! ఇదిలా ఉండగా చైనా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో అమెరికా చాట్ జీపీటీని తలదన్నే సరికొత్త టూల్‌ను అభి వృద్ధి చేసింది. దాంతో అమెరికా 600 బిలియన్ డాలర్ల మార్కెట్ కోల్పోయి చైనాపై గుర్రుగా ఉంది. ఏదిఏమైనా ట్రంప్ తొందరపాటు నిర్ణయాలు అమెరికాకు మేలు చేస్తాయా లేదా అనేది భవిష్యత్తులో తెలుతుంది.

మనల్ని గాయపరిచినవారితో మనల్ని పోల్చుకోకపోవడమే సరైన ప్రతీకారం.



జేన్ పోర్టర్

మనిషి తన ధనాన్ని బుర్రగా మార్చుకుంటే దాన్నెవరూ తస్కరించలేరు. జ్ఞానంపై పెట్టిన పెట్టుబడి ఎల్లప్పుడూ మంచి వడ్డీనే ఇస్తుంది.



పాస్కల్

# భూ సమస్యల పరిష్కారం ఇంకెప్పుడు?

**ప్రస్తుతం డ్రోన్ల ద్వారా, రోవర్ల ద్వారా జరగడం వలన భూమి విస్తీర్ణం 5శాతం తగ్గడం రైతులలో అసహనానికిగురిచేస్తుంది. దానికి తోడుభూములు ఒక సెంటు లక్షల్లో ఉండడం వల్ల ఎకరానికి 10లక్షల వరకు నష్టంవాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఇంకా తీరనిపరిస్థితిలో ఉండగా,ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటన్నిటిని సవాలుగా తీసుకొని, పరిష్కరించే మార్గంలో మళ్లీ రీసర్వేని ప్రారంభించింది.కూటమి ప్రభుత్వం పై తెలిపిన సమస్యలే కాకుండా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలనుపరిష్క రిస్తుందా? అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా సరైనవిధివిధానాల ద్వారా, సమాలోచనలు చేసిన తర్వాత రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగానిర్వహిస్తే చాలా సమస్యలు తగ్గుతాయని నిపుణుల అభిప్రాయం.**

తలారి మారుతీ

భూ మ్మీద జనాభా పెరిగే కొద్దీ,నివాస స్థలాలకు, వ్యవసాయ సంబంధిత ఉత్పాదకతకు భూమి చాలా అవసరం. భూమి ఒక సహజ వనరు మాత్రమే కాదు. అది మానవ జీవితంపై అత్యంత సన్నిహిత సంబంధం కలిగి ఉంది. చారిత్రాత్మకంగా, భౌగోళికంగా,సాంఘికంగా,ఆర్థిక సామాజికంగా ఎంతో సమ్మిళితమైఉన్నది. భూమి ప్రాథమిక వనరుగా, నివాసానికి యోగ్యమైనదిగా, వ్యవసాయానికి మానవుడు ఇతర జంతుజాలం ఆహార ఉత్పత్తిదారుగా ఎంతో అగ్రస్థానంలోఉంది. అలాంటి భూమిని రక్షించడానికి సేద్యం చేస్తున్నటువంటి రైతుకు హక్కు కలిగించడానికి భూవివాదాల నుండి రక్షణసాంత్వన చేకూర్చడానికి అనేక ప్రభుత్వాలు రెవెన్యూ సంబంధించినటువంటి భూవివాదాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల మన్ననలను పొందాయి. అలాగే సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత భూస్వాములు భూములను భూమిలేని దారిద్రరేఖకు దిగువనున్న పేదలకు, నిరుపేదలకు, వెనకబడిన తరగతులకు భూములు మంజూరు చేసినటువంటి ఘనత ప్రభుత్వాలకి ఉంది. అలాగే ప్రభుత్వ భూములను కూడా భూమిలేని నిరుపేదలకు డి పట్టాలు మంజూరు చేస్తూ ప్రజలను ఆర్థికంగా,సాంఘికంగా అభివృద్ధి చెందేలా వారి వ్యక్తిగత పరపతి పెంచేలా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. అంతేకాకుండా దేవాలయ భూములకు రక్షణ కల్పిస్తూ అనేక చట్టాలుచేస్తూ వచ్చారు. ఇందులో భాగంగానే నాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి అధినాయకత్వంలో"జగనన్న శాశ్వత భూహక్కు చట్టం" (రి సర్వే కార్యక్రమం) కార్యక్రమొకటి ఆంధ్రప్రదేశ్లో రూపుదిద్దుకుంది. అయితే అది క్షేత్రస్థాయిలో ప్రజలకు కాస్త ఇబ్బందులకు గురిచేసి, భూమి విస్తీర్ణంలో తేడాలు, జాయింట్ ఎల్పీఎంలు, సబ్ డివిజన్ సరిగా జరగకపోవడం తదితర అంశాలద్వారా ప్రజల మన్నన పొందలేక పోయిందనేది క్షేత్రస్థాయి ప్రజల అభిప్రాయం. అయితే ఈ రీసర్వేలో వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారానికి నాటి ప్రభుత్వం తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలం కావడం. రైతుల దృష్టిలో ప్రభుత్వం వ్యవహారం, అలాగే సంబంధిత ప్రక్రియ విధానం రైతులకు అయోమయంగా తయారై, అనవసరమైన లంచాలు ఊబిలో చిక్కుకునేలా చేసాయన్నమాట వాస్తవం. మరి ఆ రీసర్వే సమస్యల మీద ప్రస్తుతకూటమి ప్రభుత్వం యోచన ఏ విధముగా ఉన్నది. మళ్లీ దాన్నిపునః ప్రారంభించడం, లేదా రీసర్వేలోనే అవకతవకలను సరదిద్దడం, రీ సర్వేలో ఉన్నటువంటి లోపాలను గమనించి వాటి పరిష్కార మార్గాలను ఏ విధంగా పరిష్కరించగలదో భవిష్యత్తులో చూడాల్సి ఉంది. ముఖ్యంగా మద్రాస్ ప్రావెన్స్‌లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం కూడా అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి రైతుకు భూ సరిహద్దును చూపించి ఆ భూమికి ఒక నెంబర్ను కేటాయించడం జరిగింది. దానినే మనం ప్రస్తుతం వాడుక భాషలో "సర్వేనెంబర్" అంటున్నాం. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం డైక్లాట్ అనేటువంటి ఒక శాశ్వత రిజిస్టర్ను తయారుచేసి అందులో ప్రతి రైతుకు తాను సాగు చేస్తున్నటువంటి ప్రతి పొలానికి ఒక నెంబర్ కేటాయిస్తూ వచ్చారు. అయితే కొంతమంది రైతులు భూమిశిస్తు సరిగ్గా కట్టలేదు అటువంటి సందర్భంలోబ్రిటిష్ వారు రెవెన్యూ రికార్డులలో వారు పేర్లకు బదులుగా హక్కు దారుగా ఖాళీ ప్రదేశాన్ని లేదా చుక్కలను సూచించేవారు. ఆ చుక్కలనే ప్రస్తుతం చుక్కల భూములుగా పరిగణిస్తూ ఉన్నాం. తర్వాతకాలంలో సదరు చుక్కల భూములకు శిస్తు కట్టిన వారికి పట్టా మంజూరు చేయడం కూడా జరిగినది. అలా పట్టా మంజూరు చేసిన వారి భూములకు రిజిస్ట్రేషన్ హక్కును కూడా కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చుక్కల భూముల మీద విస్తృత



స్థాయి చర్చలు జరిగిన తర్వాత జీవో నెంబర్: 575ను ప్రకటించడం జరిగింది. ఈ జీవో ప్రకారం 08.06.1954 కు కన్నా ముందు ఎవరైతే చుక్కల భూములో పట్టాలు పొంది ఉంటారో, లేదా అసైన్మెంట్ చేయబడి ఉంటుందో వారికి కూడా రిజిస్ట్రేషన్ హక్కు కల్పించడం జరిగింది. తెదేపా ప్రభుత్వం బి.వీ.ఓ్బ.వ్పి.195 ను మేరకు 2016వ సంవత్సరంలో నిషేధిత భూముల జాబితాను తయారు చేసింది. అసలు దీనిఉద్దేశం ఏమిటంటే ఇందులో ఐదు రకాలైనటువంటి ప్రభుత్వ భూములు నమోదయిఉంటాయి. ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా, రిజిస్ట్రేషన్ హక్కు కల్పించకుండా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడం దీనిసదుద్దేశం. అయితే జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత సదరు నిషేధిత జాబితాలో 2005 కన్నా ముందు డి పట్టా మంజూరు చేసిన భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పిస్తూ జీవోలు కూడా విడుదల చేయడం జరిగింది.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాని మీద విస్తృతమైనటువంటి పరిశీలన చేసి, క్విడ్ ప్రోకో ఏమైనా జరిగిందా? అనే ఉద్దేశంతో దానిలో ఉన్నటువంటి అవకతవకలను గ్రహించి ప్రస్తుతం రెవెన్యూ రికార్డులలో ఫ్రీ హోల్డ్ రైట్స్ ఇచ్చిన డి పట్టా భూములు లావాదేవీలు జరగకుండా రిజిస్ట్రేషన్లు, మీసేవలో పట్టాదారు పాసుపుస్తకాలు కోసం దరఖాస్తు చేయడానికి సదుపాయం లేకుండా చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన తరువాత ప్రభుత్వం మళ్లీ తదుపరిచర్యలు తీసుకునే యోచనలో ఉంది. అయితే నిషేధిత భూముల జాబితాలో కూడా అనేక పొరపాట్లు జరిగాయి. అందులో అత్యంత ముఖ్యమైనవి ఎవరికైనా సీలింగ్ భూములు అసైన్మెంట్ చేసినప్పుడు సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్ను రెండు భాగాలుగా విభజించిన తర్వాత వాటికి డిపట్టా మంజూరు చేస్తారు.అయితే నిషేధిత భూములు జాబితా తయారు చేసేటప్పుడు పూర్తి సర్వేనెంబర్ను జాబితాలో ఉంచడం వల్ల పట్టా భూమి కలిగినటువంటి వ్యక్తులు చాలా అవస్థలు పడుతున్నారు. తమ భూములు ఆస్తులుగా భావించినటువంటి రైతులు తమకు అవసరమైన సమయంలో తనకా పెట్టడానికి,అమ్మడానికి, దానవిక్రయం చేయడానికి ఇతరత్రా లావాదేవీలు రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరడం లేదు. ఈ విషయమే క్షేత్రస్థాయిలో మండల తహసీల్దారులు మీసేవ ద్వారా నిషేధిత భూముల జాబితానుంచి సదరభూములను తొలగించడానికి కలెక్టర్ కార్యాలయాలకు సిఫారసు చేసినప్పటికీ, సంబంధిత దస్త్రాలు కలెక్టర్ వారికార్యాలయాల్లో మగ్గుతున్నాయి. అంతేకాకుండా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నటువంటి అధికారులు సంబంధిత నిషేధిత భూములో సర్వే నంబర్ను తొలగించడానికి ఆర్ హెచ్, చేతివ్రతతో కూడిన ఈసీ, ఆన్లైన్ ఈసి, లింకు డాక్యుమెంట్లు ఇతరత్రా దస్తావేజులు అడగడం ద్వారా రైతులు విపరీతమైనటువంటి ఖర్చులు,లంచాలు ఇచ్చి రిజిస్టర్ కార్యాలయాల్లో తమ హక్కుకు సంబంధించిన పత్రాలు తీసుకుని కలెక్టర్ చుట్టూ తిరగడం తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి రైతులలో ఏర్పడింది. అయినా ఇప్పటికీ పరిష్కారం కాక కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతున్నారు. అంతేకాకుండా నిషేధిత భూములరిజిస్టర్‌లోపట్టా భూములు కూడా నమోదుకావడం రైతుల పాలిట శాపంగా మారింది.రీ సర్వేలో ప్రముఖంగా కనిపించే సమస్య భూమి విస్తీర్ణం ఎకరానికి దాదాపు 25 సెంట్లు తగ్గడం దీని ద్వారా అత్యధిక భూమి కలిగినటువంటి భూస్వాములకు 10 ఎకరాలకు దాదాపు అర్ధఎకరా నుండి పాతిక సెంట్ల వరకు భూమి తగ్గుదల చూపిస్తోంది. దీనికి కారణం పూర్వంబ్రిటిష్ కాలంలో ఇనుప గొలుసుతో భూమిని కొలచడం ఒకకారణం అయితే , రెండవది పొలాలు ఎగుడు దిగిడులు ఉండటం ద్వారా గొలుసు ద్వారా కొలిచినప్పుడు ఖచ్చితత్వంలో తేడాలు ఉండడటం.అయితే ప్రస్తుతం డ్రోన్ల ద్వారా, రోవర్ల ద్వారా జరగడం వలన భూమి విస్తీర్ణం 5శాతం తగ్గడం రైతులలో అసహనానికిగురిచేస్తుంది. దానికి తోడుభూములు ఒక సెంటు లక్షల్లోఉండడం వల్ల ఎకరానికి 10లక్షల వరకు నష్టంవాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఇంకా తీరనిపరిస్థితిలో ఉండగా,ప్రస్తుత కూటమిప్రభుత్వం వీటన్నిటిని సవాలుగా తీసుకొని, పరిష్కరించే మార్గంలో మళ్లీ రీసర్వేని ప్రారంభించింది.కూటమి ప్రభుత్వం పై తెలిపిన సమస్యలే కాకుండా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలనుపరిష్క రిస్తుందా? అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా సరైనవిధివిధానాల ద్వారా, సమాలోచనలు చేసిన తర్వాత రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగానిర్వహిస్తే చాలా సమస్యలు తగ్గుతాయని నిపుణుల అభిప్రాయం. ●

# యువతను సన్మార్గంలో నడిపించాలంటే..


మోటె చిరంజీవి

దేశ జనాభాలో సుమారు 50 శాతానికి పైగా యువత ఉంది. వారు తలుచుకుంటే దేనినైనా సాధించవచ్చు.దేశ అభివృద్ధిలో వారి పాత్ర కీలకం. యువతలో సాధారణ చెడు అలవాట్లు చూసినట్లయితే అధిక సమయం సెల్ ఫోన్ చూడడం, పెద్దలపట్ల, చిన్నలపట్ల, అగౌరవంగా కించపరిచి మాట్లాడడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు అలవాటు పడడం, తరచుగా ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఏ పనినైనా వాయిదా వేయడం, సరైన నిద్ర లేకపోవడం, పరిశుభ్రత పాటించకపోవడం, ధూమపానం, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసవ్వడం, మాదకద్రవ్యాలకు అలవాటు పడడం,అధిక సోషల్ మీడియా వినియోగం, సమయపాలన పాటించకపోవడం ఇలా అనేక అలవాట్లకు నేటి యువత బానిస అవుతున్నారు. యువతీ యువకుల్లో విచ్చలవిడితనం పెరిగిపోవడం,తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించకపోవడం వల్ల ఇటువంటి దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎటువంటి అలవాట్లను అలవర్చుకుంటున్నారనేటువంటి విషయాలను వారు గమనించడం లేదు. ప్రపంచం



మొత్తం మీద జనాభాలో యువతశాతం ఎక్కువగా ఉంటుంది.అయితే యువత ఈ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు చాలానేఉన్నాయి. వాటిలో నిరుద్యోగంఎంతో ముఖ్యమైనది. డిగ్రీ పట్టాలు చేతిలోఉన్నా, ఉన్నత విద్యలు చదివినా ఉద్యోగ అవకాశాలు సరైనవిధంగా లేక మిగిలిపోతున్న యువత ఎందరోఉన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి నేటి యువత తమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన నిద్రను పొందడం, శారీరకంగా చురుకుగాఉండటం, ఆరోగ్యకరమైన ఆహారంతీసుకోవడం, స్నేహితులు కుటుంబ సభ్యుల తో సన్నిహితంగా ఉండటం సరైన మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో చాలాదూరంగా ఉంటుంది. యువజనులలో నైపుణ్యాలను పెంచాలి.వాటిద్వారా మరింత సంపన్నమైన, శాంతియుతమైన,స్థిరమైన భవిష్యత్తు కోసం,యువత అభివృద్ధి చెందడానికీ, మార్పును సృష్టించేందుకు అవసరమైన నైపుణ్యాలు, సాధనాలతో యువతను సన్నద్ధంచేయడంలో అందరూ చేతులు కలపాలి. యువత సన్మార్గంలో నడవడానికి ఇంట్లోతల్లిదండ్రులు, పాఠశాల,కళాశాల, విశ్వవిద్యాలయాల్లో గురువులు అత్యంత ప్రధానమైనటువంటి భూమికను పోషించవలసి నటు వంటి అవసరం ఉంది. అప్పుడే యువత సరియైన మార్గంలో పయనిస్తారు. ●

# ప్రజావాక్కు



## సుంకాలు విధించాలి

మైనింగ్, ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ విధించేహక్కు రాష్ట్రాలకున్నదని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం వెలువరించింది. తీర్పుతో పదమూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ అతి పురాతనమైన కేసు పరిష్కృతం కావడం మరో రికార్డు. రాయల్టీ అనేది పన్ను వంటిది కాదని, రాయల్టీని విధించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేయడం ఫెడరలిజానికి బలం చేకూర్చే అంశం. ఖనిజాలను కలిగి ఉన్న భూమిపై రాయల్టీని వసూలు చేసే రాష్ట్ర ప్రభుత్వ హక్కును ఈ తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు సమర్థించింది. అక్కడి ప్రభుత్వాలు ఇప్పుడు తమ భూభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైనింగ్ కంపెనీలపై అదనపు సుంకాలు వసూలు చేసేందుకు దీని ద్వారా అవకాశం ఏర్పడుతుంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కేంద్రప్రభుత్వ ఆరోగ్య పథకం మన రాష్ట్రంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు, ఉత్తరాంధ్ర ఐదు జిల్లాలకు ప్రస్తుతం రెండు మాత్రమేఉన్నవి. యేటా రిటైర్ అయ్యే ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు విపరీతంగా ఉన్నారు. దీనిలో సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు కూడా భాగమే. సెంటర్లు అద్దె భవనాల్లో కనీస సదుపాయాలు, సామాగ్రితో లేక పేషంట్స్ ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్ర ఆరోగ్యశాఖకు పంపిన నివేదికలు రాష్ట్ర సహాయ కార్యదర్శి వారి కృషి, సంఘం ప్రతినిధుల జోక్యంతో మంజూరు అత్యవసరం. వైద్యుల నియామకాలను చేపట్టాలి.

-బి. మేఘనాథం, విశాఖపట్నం

## బాధ్యత తల్లిదండ్రులదే

మనుషులకు భయం భక్తి ఉండాలి. లేకుంటే కఠిన చట్టాలకుకూడా భయపడకుండా ప్రవర్తిస్తుంటారు. మహిళలపై పాశవికంగా జరుగుతున్న అత్యాచారాలు,హత్యలపై ప్రజలు రోడ్డెక్కి నిరసనలు, నినాదాలు చేస్తుంటే, ఏదో ఒక చోట ఇలాంటివి పునరావృతంకావడం చాలా బాధాకరం. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లయిన మనదేశంలో ఇక నుంచి అయినా తగ్గుముఖం పట్టాలి. కన్నబిడ్డల్ని మాత్రం మంచిగా పెంచి సొసైటీలో ఉత్తమ పౌరుడిగా అందించవలసిన బాధ్యత అమ్మానాన్నలది.

- ఎన్.కృష్ణమోహన్, కర్నూలు జిల్లా

## నెట్‌వర్క్‌ను విస్తరించాలి

రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వాడోఫోన్, ఐడియాతో సహా భారతదేశంలోని ప్రైవేట్ టెలికాం కంపెనీలు గత నెలలో తమ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ రీచార్జ్‌ల ప్లాన్‌ల ధరలను భారీగా పెంచాయి. టారిఫ్ ధరలు పెంచడంతో ఇప్పుడు చాలా మంది కస్టమర్లు బియస్ఎన్ఎల్‌వైపు మళ్లుతున్నారు. ఇతర టెలికాం కంపెనీలు ధరలు పెంచినా బిఎస్ఎన్ఎల్ మాత్రం ఎలాంటి రీఛార్జ్ ధరలను పెంచలేదు. ఇప్పటికే చాలా మంది కస్టమర్లు బియస్ఎన్ఎల్‌వైపు వెళ్లిపోయారు. కావున కేంద్రప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించి ఎక్కువ టవర్లను ఏర్పాటు చేస్తే ముఖ్యంగా తక్కువ ఆదాయం గల ప్రజలకు అలాగే శ్రామిక వర్గానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కావున ఆ దిశగా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగళూరు

## పటిష్ట భద్రత అవసరం

గృహ అవసరాల కోసం విద్యుత్ శక్తి సరఫరాలో హెచ్చుతగ్గులు నివారించుటకు ప్రతి వాడలలో వినియోగదారుల అవసరం, వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని తగు సామర్థ్యంగల కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు, చేస్తున్నారుకూడా. దీని వలన వినియోగదారులకు నాణ్యమైన కరెంటు సరఫరా జరుగుతున్నదనడంలో సందేహంలేదు.కానీ ఈఫ్లింత్ ఏరియా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినస్థలంలో సరైన రక్షణ కవచాలు ఏర్పాటు చేయడం లేదు. నిర్వహణ లోపం వలన భూమిపై చిన్న చిన్న పిచ్చిమొక్కలు చెట్లు పెరుగుతున్నాయి. కొంత మంది వ్యక్తులు సామాజిక బాధ్యతను విస్మరించి అక్కడ చెత్తాచెదారం వేయడం జరుగుతున్నది. ఫలితంగా క్రిమి కీటకాలకు స్థావరంగా, దోమలు వ్యాప్తి చెందడానికి దోహదం చేస్తున్నది.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## పనులు వేగవంతం కావాలి!

అమరావతి రాజధాని రైలు మార్గానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఆపై సంబంధిత డిపిఆర్ సిద్ధంగా ఉందని రైల్వే అధికారులు ప్రకటించడం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి మరో అడుగుపడినట్లే. అయితే పనులు వేగవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం,ప్రజాప్రతినిధులురైల్వేశాఖతో పూర్తి సమన్వయంతో పనిచేయాలి.ఎక్కడా ఎటువంటి అవాంతరాలు రాకుండా అందరి సమిష్టికృషితోనే అభివృద్ధి ప్రాజెక్టులు సాకారమవుతాయి.ఇప్పటికే ఉన్నరైలు మార్గాలకు అనుసంధానం చేయాలి.

-ఎన్. అజయ్‌కుమార్, కృష్ణాజిల్లా

# సామాజిక స్పృహతో ఆధ్యాత్మిక జాతర

ననుబోలు రాజశేఖర్

కుంభమేళా సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక స్ఫూర్తిని ప్రతిబింబించే విశిష్టమైన పండుగ. ఓ గొప్ప సామాజిక దృక్పథాన్ని అంతర్లీనంగా కలిగున్న ఆధ్యాత్మిక జాతర. కోట్ల మంది భక్తులను ఒకచోటకుచేర్చి తన భక్తి జలాలతో తడిపిముద్దచేసే అత్యంత పురాతన ఆధ్యాత్మిక వేడుక. వేలసంవత్సరాల నాటి పురాణ గాథల ఆధారంగా సాగిన ఈ మహాసమ్మేళనం భారతదేశం అప్రతిహత ఆధ్యాత్మిక వారసత్వానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రాచీన భారతదేశంలో ఈ కుంభమేళకు ఆధ్యాత్మిక సాధకులు, తత్వవేత్తలు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం వలన కుంభమేళా ఆధ్యాత్మికత వేదికగానే కాకుండా జ్ఞాన మార్పిడి వేదికగాకూడా ఉపయోగపడింది. విశ్వాసం, సంస్కృతి, ఆధ్యాత్మికత,సమాజానికి సంబంధించిన అందమైన దృశ్యం ఈ కుంభమేళా. కుంభమేళా అనేది కుంభం, మేళా అనే రెండు పదాలకలయిక.కుంభ అనేది కుండకు సంస్కృతంలో సమానమైన అర్థంగల పదం. దీనికే కలశంఅనే అర్థంకూడా ఉంది. భారత ఖగోళ శాస్త్రం ప్రకారం కుంభం అనేది ఒక రాశిని కూడా సూచిస్తుంది. ఈ రాశిలోనే ఈ పండుగను నిర్వహిస్తారు. మేళా అంటే కూటమి,కలయిక లేక జాతరగా భావించవచ్చు. అతిపెద్ద ధార్మిక కార్యక్రమమైన కుంభమేళాలో నదులకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కోట్లమంది భక్తులు పవిత్ర నదుల వద్దకు చేరుకొని చేసేవేడుకయే ఈకుంభమేళా. కుంభమేళా ఉత్తరప్రదేశ్లోని హారిద్వార్, ప్రయాగరాజ్‌తో పాటు మహారాష్ట్రలోని నాసిక్, మధ్యప్రదేశ్లోని ఉజ్జయినిలలో జరుగుతుంది. ప్రయాగరాజ్లో గంగా, యమునా, సరస్వతి నదుల సంగమ తీరంలో, హరిద్వార్లో గంగాతీరంలో, నాసిక్ గోదావరి తీరంలో, ఉజ్జయినిలో పవిత్ర క్షిప్రానది తీరంలో కుంభం కుంభమేళా జరుగుతుంది. కుంభమేళా అనేది భిన్నత్వాలను ఏకత్వంచేసేవేడుక, ఇక్కడ అన్నివర్గాల ప్రజలు ఆధ్యాత్మిక శుద్ధి జ్ఞానోదయం కోసం పవిత్ర నదులలో స్నానమాచరిస్తారు. ఈ పండుగ భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం. దేశం అద్భుతమైన వైవిధ్యాన్ని ప్రజలను ఒకచోట చేర్చే సామర్థ్యాన్ని కలిగినదే ఈ కుంభమేళా. కుంభమేళా ముఖ్యమైన సామాజిక ప్రభావాలను కలిగి ఉంది.ఎందుకంటే ఇది ప్రజలు ఒకరితో ఒకరు మమేకమవడానికి, వారి అనుభవాలను పంచుకోవడానికి ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడానికి ఒక వేదికను నిర్మిస్తుంది. ఈ కుంభమేళా సామాజిక అడ్డంకులను ఛేదించడంలో,విభిన్న నేపథ్యాల ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించడంలో విశిష్టపాత్రను పోషిస్తుంది. ఆర్థికకుంభమేళా గణనీయమైన ఆర్థిక ప్రభావాన్ని చూపుతూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. వాణిజ్య పర్యాటక రంగాలను ప్రోత్సహిస్తుంది. కుంభమేళా భారతదేశ ఆర్థిక దృశ్యంలో ముఖ్యమైన భాగం. కుంభమేళా అనేది ఒక శక్తివంతమైన సాంస్కృతిక మార్పిడి ఈ ఉత్సవం సంగీతం, నృత్యం ప్రదర్శనలతోసహా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలను కుంభమేళ వేదికగా ప్రదర్శిస్తారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనలు భారతీయ సంస్కృతి అద్భుతమైన వైవిధ్యాన్ని



ప్రదర్శిస్తాయి. ఒక కథ ప్రకారం కుంభమేళాకి ఒక క్రమబద్ధమైన రూపాన్ని ఇచ్చిన ఘనత ఆది శంకరాచార్యుల వారికి దక్కుతుందనేది చరిత్రకారుల అభిప్రాయం. నాలుగుప్రధాన తీర్థాలలో నాలుగు పీఠాలను స్థాపించినట్లే నాలుగు తీర్థ స్థలాలలో కుంభమేళాలో సాధువుల భాగస్వామ్యాన్ని కూడా ఆయన నిర్ధారించారు. నేటికీ కుంభమేళాలలో శంకరాచార్య మతానికి చెందిన సాధువులు, శిష్యులతో సహాపాల్గొంటారు. మధ్యయుగంలో మౌర్యులు, గుప్తులు వంటి రాజవంశాలు కుంభమేళాకు అనేక రకాల సహకారం అందించాయి. ఈ సమయంలో కుంభమేళా భారతదేశంలో ప్రధాన యాత్ర సంస్కృతిగా నిలిచింది. 12వ శతాబ్దం తర్వాత కుంభమేళా ప్రతిష్ఠ మరింత పెరిగింది. వివిధ రాజ్యాలకు చెందిన రాజులు చక్రవర్తులు ఈ వేడుకల్లో పాల్గొని తగిన ఆర్థిక సాయం వసతి ఏర్పాట్లు కల్పించేవారు. ముఖ్యంగా అక్బర్ కాలంలో మహా కుంభమేళ కోసం ప్రత్యేక నిధులు, భూ కేటాయింపులు జరిగాయి. బ్రిటిష్ పాలన సమయంలోనూ కుంభమేళా ఖ్యాతి మరింత పెరిగింది. 1918లో జరిగిన మహా కుంభమేళాల్లో మహాత్మా గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు ప్రజల్ని ఏకతాటి మీదకు తీసుకొస్తున్నాయన్న కారణంతో క్రమంగా చరిటిష్ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించింది. పన్నులు విధించి అణగదొక్కే ప్రయత్నం చేసింది. స్వతంత్రం తర్వాత తొలిసారిగా 1954లో తొలి కుంభమేళా నిర్వహించారు. అప్పుడునుంచి ఈ పుణ్య కార్యక్రమ నిరంతరాయంగా కొనసాగుతుంది.పురాణాలను పరికిస్తే ఒకసారి దేవతలు, రాక్షసులు కలిసి అమృతంకోసం క్షీరసాగర మథనం చేశారు. ఈ క్షీరసాగర మథనం నుండి అమృతాన్ని కలిగి ఉన్నకుంభం (కుండ) కనబడగానే దేవతలు రాక్షసులు మధ్య అమృతపు కుండకోసం భీకర పోరు జరుగుతుంది. పన్నెండు రాత్రులు పన్నెండు పగళ్ళు పాటు (మనుషుల దృష్టిలో పన్నెండు సంవత్సరాలు) జరిగిన ఈ యుద్ధ సమయంలో శ్రీ మహావిష్ణువు మోహినిఅవతారమెత్తి అమృతభాండం రాక్షసులకు దక్కకుండా. తీసుకెళుతున్నప్పుడు నాలుగు అమృతపు చుక్కలు భూలోకంలోని హారిద్వార్లోని గంగ ఉజ్జయినిలోని శివరా,నాసిక్లోని గోదావరి, ప్రయాగ్లోని త్రివేణీ సంగమంలో పడ్డాయని చెబుతారు. ఈ కారణంగానే ఆ నదుల్లోని నీళ్లు కొన్ని సమయాల్లో అమృతత్వాన్ని సంతరించుకుంటాయని చెబుతారు. సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. అందుకే అప్పుడు ఈ నదుల్లో స్నానం చేసేందుకు కోట్లాది భక్తులు సిద్ధమవుతారు. కుంభమేళా నిర్వహించే వేదికలను, తేదీలను సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి వివిధ రాశిచక్రాలలో ఆ కాలంలో ఉన్న స్థితిని బట్టిఎప్పటికప్పుడు నిర్ణయించడం జరుగుతుంది. సూర్యుడు. బృహస్పతి సింహరాశిలో ఉన్నప్పుడు ఈకుంభమేళాను నాసిక్‌లోని త్రియంబకేశ్వర్‌లోను, బృహస్పతికుంభ రాశిలో సూర్యుడు మేషరాశిలో ఉన్నప్పుడుహారిద్వార్‌లోను, బృహస్పతి వృషభరాశిలో సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు కుంభమేళాను ప్రయాగలోను, బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలోను నిర్వహించడం జరుగుతుంది.144 సంవత్సరాల తర్వాత ప్రయాగరాజ్లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 25 వరకు మహా కుంభమేళా జరుగుతుంది. దాదాపు 15 కి.మీ. దూరం వరకు విస్తరించి ఉన్న త్రివేణి సంగమ తీరంలో కోట్లమంది భక్తులు స్నానం చేసే దృశ్యం అద్భుతంగా ఉంటుంది.దేశం నుంచే కాకుండా విదేశాలనుంచి కూడా భక్తులు ఇక్కడికివచ్చి మహాకుంభమేళా చారితరాత్మిక దృశ్యాలకు సాక్షులు అవుతారు. మహా కుంభ స్నాన మంచు తెరల మాటున దాగివున్న కుంభమేళా ఆధ్యాత్మిక సౌందర్య దృశ్యాలను వీక్షి స్తూ అనుభవించడంఒ గొప్ప అనుభూతి అంతకుమించి పూర్వజన్మ సుకృతం. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బడ్జెట్ తయారీలో ఆ ఆరుగురే కీలకం



## ఆర్థిక వృద్ధి 6.4 శాతంగా అంచనా

**న్యూఢిల్లీ, జనవరి 30:** కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని ఐదుగురు అధికారులు కీలకంగాపనిచేసారు. ఆర్థికవృద్ధి 6.4శాతంగా ఉంటుందని బడ్జెట్‌లోవేస్తున్న అంచనాలు ద్రవ్యోల్బణం తగ్గుతుందన్న అంచనాలు కూడా ఉన్నాయి. ఆర్థికస్థిరత్వానికి బడ్జెట్ దోహదంచేస్తుందని చెపుతున్నారు. ఆర్థిక మంత్రి సీతారామన్ నిపుణులైన ఆర్థికవేత్తలు అధికారుల బృందంతో కలిసి పనిచేసారు. ఆర్థిక రోడ్ మ్యాప్‌కు ఒక నిర్దిష్టమైన రూపాన్ని ఇచ్చారు. వారిలోప్రధానంగా ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఒకరు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థి అయిన అనంత నాగేశ్వరన్ స్థూల ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో కీలకంగా పనిచేసారు. అంతేకాకుండా బడ్జెట్ లక్ష్యాలు కూడా నిర్దేశించారు. ఆర్థిక సర్వేను రూపకల్పనచేసారు. ఈ ఆర్థికసంవత్సరం లోనే ఆయన పదవీకాలం పూర్తవుతుంది. ఇక ఐఐటి కాన్పూర్ పూర్వ విద్యార్థి అయిన ఆర్థికశాఖ వ్యయకార్యదర్శి మనోజ్‌గోవిల్ కొత్త పథకాల మంజూరులు, వ్యయం మార్గదర్శకాలు రూపొందించారు. అలాగే రాష్ట్రాలకు ఆర్థిక వనరుల బదిలీలో కూడా కీలకంగాపనిచేసారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో 1991 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన గోవిల్ వ్యయవిభాగం కార్యదర్శిగా 2024నుంచి పనిచేస్తున్నారు. కార్పొరేట్ వ్యవహారాల్లో విశేష అనుభవం ఉన్న అధికారి. ఇక ఆర్థికవ్యవహారాల కార్యదర్శి అజయ్‌సేథ్ 2021నుంచి ఈవిభాగంలో ఉన్నారు. బడ్జెట్ తుదిపత్రాల రూపకల్పనలో ఆయన దిట్ట. ఇక రెవెన్యూ ఆర్థికకార్యదర్శిగా తుహిన్‌కాంత పాండే కూడా బడ్జెట్‌రూపకల్పనలోభాగం అయ్యారు. ఒడిశా కేడర్ ఐఎఎస్ అధికారి అయిన తుహిన్ కాంత పాండే ఈ ఏడాది జనవరిలోనే చేరారు. సరళీకృత పన్నువ్యవస్థను రూపొందించడంలో కీలకంగా పనిచేసారు. ఇక దీపక్ కార్యదర్శి అరునిష్ చావ్లా కూడా బడ్జెట్‌లో కీలకమే. బీహార్ కేడర్ ఐఎఎస్ అధికారి పెట్టుబడుల ఉపసంహరణ, స్థిరాస్తి నగదీకరణ పథకాలు, ఐడిబిఐ బ్యాంకులో వాటా విక్రయాలలో కీలకంగా వ్యవహరించారు. ప్రాధాన్యేతర ఆస్తులను ఉపసంహరించడంలో ఆయన అందెవేసినచేయి. ఇక ఆర్థిక సేవల కార్యదర్శిగా ఎం నాగరాజుకూడా బడ్జెట్‌లో కీలకంగాపనిచేసారు. 1993 బ్యాచ్ త్రిపుర కేడర్ ఐఎఎస్ అధికారి అయిన దేశ అవసరాలకు అనుగుణంగా రుణపరపతి, ఫిన్‌టెక్ నిబంధనలు, బీమాకవరేజి విస్తరణ వంటి వాటిలో కీలకంగా పనిచేసారు. వివిధ ప్రభుత్వశాఖల్లో ఆయనకు విశేషానుభవం ఉంది. అందువల్లనే ఆర్థిక శాఖకు ఆయన్ను నియమించారు.



# రేప్‌కేసులో యుపి ఎంపి రాకేష్ రాథోడ్ అరెస్టు

**న్యూఢిల్లీ, జనవరి 30:** కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు రాకేష్ రాథోడ్‌ను ఒక అత్యాచారం కేసులో పోలీసులు అరెస్టుచేసారు. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ ఎంపిగా ఎన్నికైన రాకేష్ మీడియా సమావేశం నిర్వహిస్తుండగానే పోలీసులు వచ్చి అరెస్టుచేసారు. రాథోర్‌పై పోలీసులు కేసునమోదు చేసారు. యుపి కాంగ్రెస్ యూనిట్‌కు ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఒక మహిళ ఆయనపై ఈనెల 17వ తేదీ ఫిర్యాదుచేసింది. గడచిన నాలుగేళ్లుగా తనపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు ఆమె ఫిర్యాదుచేసింది. తనను పెళ్లిచేసుకుంటానని నమ్మించాడని, తనకు మంచి రాజకీయ కెరీర్‌ను ఇస్తానని నమ్మబలికి తనను లొంగదీసుకున్నాడని ఆమె తెలిపింది. ఆమె రాకేష్ తనతో మాట్లాడిన కాల్‌రికార్డులు, కాల్స్ వివరాలు, రికార్డింగ్‌లను కూడా పోలీసులకు షేర్‌చేసింది. గత వారంలోనే మహిళ భర్త వేరుగా ఒక ఫిర్యాదుచేసారు. ఐదుగురు వ్యక్తులపై ఆయన ఫిర్యాదుసాడు. వారిలో రాథోడ్, ఆయన కుమారుడిపైనా నమోదుచేసిన కేసును సెటిల్‌చేసుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు అలహాబాద్ హైకోర్టు లక్నోబెంచ్ రాథోడ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించి వెంటనే లొంగిపోవాలని ఆదేశించింది.

హైకోర్టుకువెళ్లడానికి ముందు ఎంపిఎమ్మెల్యే కోర్టుకూడా ఆయనముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. కాంగ్రెస్‌లో చేరే ముందు రాథోర్ యుపి అసెంబ్లీఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా కూడా కొనసాగారు. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా కూడా పోటీపడ్డారు. అంతకు ముందుయుపి మాజీ సీఎం మాయా వతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీలో కూడా కొనసాగారు.

# నోబెల్ శాంతి బహుమతి రేసులో ఎలాన్ మస్క్!

**వాషింగ్టన్, జనవరి 30:** ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి-2025 రేసులో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు బ్రాంక్ గ్రిమ్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నోబెల్ శాంతి బహుమతి అభ్యర్థిత్వానికి ఎంపికయ్యారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కులపై ఆయన ఎక్స్ వేదికగా తన నిబద్ధతను చాటుకున్నారు' అని గ్రిమ్స్ పేర్కొన్నారు. ఈ నెల 29న ఈ అభ్యర్థిత్వాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఇక, గత యేడాది ఫిబ్రవరిలోనూ మస్క్ నోబెల్ శాంతి బహుమతి రేసులో ఉన్నారు. అప్పట్లో నార్వేకు చెందిన పార్లమెంట్ సభ్య మారియస్ నీల్సన్ ఆయన పేరును ప్రతిపాదించారు.

ప్రపంచంలో అత్యున్నత పురస్కారం నోబెల్ బహుమతి. ఈ నోబెల్ బహుమతిని డైనమేట్ కనుగొన్న విఖ్యాత రసాయన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరు మీద ప్రారంభించారు. వైద్యం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి విభాగాల్లో ఈ బహుమతిని అందజేస్తారు. 1968 స్వీడన్ బ్యాంక్ 300వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతిని ఏర్పాటుచేసి, 1969 నుంచి ప్రదానం చేస్తున్నారు. దీన్ని నోబెల్ ప్రైజ్ ఇన్ ఎకనామిక్స్‌గా పిలుస్తారు. నోబెల్ బహుమతులను డిసెంబరు 10న నోబెల్ వర్ధంతి సందర్భంగా స్టాక్‌హోంలో ప్రదానం చేస్తారు.

# అమెరికా విద్యార్థి వీసాల్లో మార్పులు




## భారత్‌పై ప్రభావం!

**వాషింగ్టన్, జనవరి 30:** విద్యార్థి వీసాల గడువు ముగిసినా అమెరికాలో అక్రమంగా ఉంటున్న వారిపై ఇప్పుడు ఆ దేశం దృష్టి కేంద్రీకరించింది. తాజాగా అమెరికాలో 'వలస చట్టాల అమలును పునరుద్ధరించడంపై హౌస్ కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చట్టసభ సభ్యులు పలు సూచనలు చేశారు. 2023లో వీసా గడువు ముగిసినా.. 7,000 మంది భారతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లుచాలాకాలం అమెరికాలోనే ఉండిపోయారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్‌కు చెందిన జెస్సీకా ఎం.వాఘన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం 32 దేశాలకు చెందిన విద్యార్థులు, స్టూడెంట్ ఎక్స్ఛేంజి విజిటర్లలో 20 శాతానికిపైగా వీసా గడువు దాటినా అమెరికాలోనే ఉంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు పొందిన వారే అత్యధికంగా ఈ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా స్కూళ్లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి విద్యార్థిలా చదువుకొనేందుకు ఎఫ్-1 వీసాలు జారీ చేస్తారు. దీంతోపాటు సెమినార్లు, భాషపై శిక్షణలకు కూడా వాడతారు. ఇక ఎం-1 వీసాలను వృత్తివిద్యా కోర్సులు, నాన్‌అకడమిక్ అవసరాలకు, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లకు వాడుతుంటారు.

'బ్రెజిల్, చైనా, కొలంబియా, ఇండియాల్లో ఒక్కో దానికి చెందిన 2,000 మందికిపైగా విద్యార్థులు వీసా గడువు ముగిసినా ఇంకా అమెరికాలోనే ఉన్నారు. వీరిలో అత్యధికంగా భారతీయుల సంఖ్య 7,000. వీసా పాలసీల్లో మార్పులు అవసరం. మారుమూల ప్రాంతాల్లో కూడా అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాన్ని బలోపేతం చేయాలి. చట్టంలో కాంగ్రెస్ పలు సవరణలు చేయాలి. ద్వంద్వ ఉద్దేశాలను విద్యార్థి వీసాలకు వర్తింపజేయకూడదు. దీంతోపాటు ప్రతి స్టూడెంట్ చదువు పూర్తయిన తర్వాత స్వదేశానికి వెళ్లటానికి సిద్ధంగా ఉండాలి' అని జెస్సీకా ఎం.వాఘన్ పేర్కొన్నారు.

**మొత్తం 75,000లోపే వీసాలు ఉండాలి..**

ఇక హెచ్-1బి వీసాలకు రెండేళ్లగడువు మాత్రమే ఉండాలని జెస్సీకా పేర్కొన్నారు. వీటిని అవసరాన్ని బట్టి నాలుగేళ్లకు పొడిగించుకొనేల అవకాశం ఇవ్వాలన్నారు. గ్రీన్‌కార్డు పిటిషన్ల ఆధారంగా ఆటోమేటిక్‌గా పొడిగింపులు లభించకూడదని కమిటీకి సూచించారు. 'రీసెర్చి, నాన్‌ప్రాఫిట్ సహా వీసాల సంఖ్య 75,000లోపే ఉండాలి. ప్రస్తుతం అపరిమితంగా ఉంది. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అత్యధికంగా వేతనాలు చెల్లించే సంస్థకు కేటాయించారు. ఇలా చేయడం వల్ల ఎక్కువ ప్రతిభ ఉన్న వారికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా చాలా పరిమిత సంఖ్యలో.. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వీసాలు కేటాయించాలి' అని ఆమె సూచించారు.

# మహాకుంభ్‌మేళాలో వివిఐపి పాస్‌ల రద్దు

## ట్రాఫిక్ క్లియరెన్స్‌కోసం చిరువ్యాపారాల తొలగింపు

## మహాకుంభ్ నగర్ మొత్తం నో వెహికల్ జోన్

**మహాకుంభ్‌నగర్, (యుపి), జనవరి 30:** ప్రయాగరాజ్‌లోజరుగుతున్న కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది మృతిచెంది 90 మందివరకూ గాయపడటంతో అధికారులు వెంటనే సర్దుబాటు చర్యలుచేపట్టారు. కుంభమేళా జరుగుతున్న ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గాప్రకటించారు. వివిఐపి పాస్‌లన్నింటినీ రద్దు చేసారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు రోడ్లన్నీ కూడా వన్‌వేగా మార్చారు. మౌని అమావాస్యను పురస్కరించుకుని పవిత్రస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది ఒక్కసారిగా తోసుకురావడంతో సంగమ ప్రాంతంలో తొక్కిసలాటజరిగింది. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో అప్రమత్తం అయిన సీఎం యోగి పలు జిల్లాలపోలీసులు అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను నియంత్రించేందుకు పలుసూచనలు కూడా చేసారు. మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి రాకుండా అన్ని వాహనాలకు ఎంట్రీ పాస్‌లు రద్దుచేసారు. ప్రయాగరాజ్ చుట్టుపక్కల జిల్లాలనుంచి వస్తున్న వాహనాలను సరిహద్దుల్లోనే నిలిపివేస్తున్నారు. ఫిబ్రవరి 4 వరకూ నగరంలోకి రాకుండా నాలుగు చక్రాల వాహనాలను నిషేధించారు. రోడ్డుపక్కల చిరుతిళ్లను విక్రయించే వారందరినీ ఖాళీప్రదేశాల్లోకి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్‌చేయాలని సీఎం యోగి ఆదేశించారు.

ఇదిలా ఉంటే వచ్చే నెల మూడో తేదీ వసంత పంచమి సందర్భంగామూడో అమృత్‌స్నానాలు జరుగుతాయి. ఆరోజు కూడా భక్తులుభారీగా అమృత్‌స్నానాలకు తరలివచ్చే అవకాశం ఉంది. దాంతో మళ్లీ తొక్కిసలాట లాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఆప్రాంతాన్ని గురువారం రాష్ట్రప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, డిజిపి ప్రశాంత్‌కుమార్‌లు పరిశీలించారు. అంతేకాకుండా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై సమగ్ర విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాం దాఖలయింది. తొక్కిసలాటకు సంబంధించిన నివేదిక కోరాలని డిమాండ్‌చేస్తూ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని పిటిషనర్‌కోరారు. కేంద్ర ప్రభుత్వం,యుపితో సహా అన్నిరాష్ట్రాలను పార్టీలుగాచేర్చారు.

# మేయర్ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

## ఛండీఘర్ మేయర్ బిజెపి వశం

**ఛండీఘర్, జనవరి 30:** ఛండీఘర్ మేయర్ ఎన్నికల్లో బిజెపి విక్టరీ నమోదుచేసింది. మొత్తం ఓట్లలో 19ఓట్లు సాధించిమేయర్‌పదవిని కైవసం చేసుకుంది. ఆప్ కాంగ్రెస్ కూటమిలో 17 ఓట్లు మాత్రమే రావడం 19 ఓట్లు బిజెపిరావడంతో మేయర్ గా బిజెపి అభ్యర్థి హర్‌ప్రీత్‌కౌర్ బబ్లా ఎన్నికలయినట్లు ప్రకటించారు. ఆప్‌నుంచి ప్రేమ్‌లత మేయర్‌పదవికి పోటీపడిన సంగతి తెలిసిందే. ఛండీఘర్‌మేయర్ ఎన్నికలు ఇటు బిజెపి, అటు కాంగ్రెస్, ఆప్‌కూటమిలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. చండీఘర్‌మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం 35 మంది సభ్యులున్నారు. ఎన్నికయిన కౌన్సిలర్లతోపాటు చండీఘర్ ఎంపి ఇపుడు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా కొనసాగుతున్నారు. ఎన్నికలకు ముందు ఆప్ 13 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ ఆరు, బిజెపి 16, ఒక వోటు చండీఘర్ ఎంపి కాంగ్రెస్‌కు ఉన్నాయి. అయితే పోలింగ్ సరళిని చూస్తే ఖచ్చితంగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్నది రుజువవుతోంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కౌన్సిరల్ గురుబక్స్ రావత్ బిజెపివైపు మొగ్గుచూపించారు. దీనితో పార్టీబలం 16కు పెరిగింది. రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. నామినేటెడ్ కౌన్సిలర్ రామ్‌నీక్‌సింగ్ బేడి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. పంజాబ్ హర్యానాహైకోర్టు రిటైర్డ్ జడ్జి జయశ్రీ ఠాకూర్‌ను స్వతంత్ర పరిశీలకురాలిగా సుప్రీంకోర్టు నియమించింది. మొత్తం ఎన్నికలప్రక్రియను విడియో చిత్రీకరించాలనికూడా సుప్రీం ఆదేశించింది.

# గగనతలంలో విమానం, హెలికాప్టర్ ఢీ



## పోటోమాక్ నదిలో కుప్పకూలిన వైనం

## ఇప్పటివరకూ 28 మృతదేహాలు రికవరీ

**ఆర్లింగ్టన్, జనవరి 30:** అమెరికాలోని రొనాల్డ్ రీగన్ ఎయిర్‌పోర్టుకు వచ్చే క్రమంలోనే గగనతలంలో ఒక విమానం, ఆర్మీ హెలికాప్టర్లు ఢీకొనడంతో అక్కడికక్కడే కుప్పకూలాయి. ఈ ప్రమాదంలో 28 మందిమృతదేహాలను ఇప్పటివరకూ రికవరీచేసారు. అయితే ఈ ఘటనలో ఏఒక్కరూ బతికి ఉంటారని భావించడంలేదని ప్రమాద స్థితిని బట్టి అధికారులు చెపుతున్నారు. రీగన్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోనే ఉన్న పోటోమాక్ నదినుంచి కొన్ని మృతదేహాలను రికవరీ చేసారు. 60 మంది ప్రయాణీకులు, నలుగురు క్రూసిబ్బందితో వస్తున్న ఈ విమానం ఇక కొద్దిసేట్లో రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుందనగా ఈప్రమాదం చోటుచేసుకుందని ఈప్రమాదంలో అమెరికా ఆర్మీకి చెందిన బ్లాక్ హాక్ హెలికాప్టర్ కూడా ధ్వంసం అయినట్లు వాషింగ్టన్ డిసి అధికారులు చెపుతున్నారు. వాషింగ్టన్ ఫైర్ చీఫ్ జాన్ డోన్నెల్లీ మాట్లాడుతూ ఈప్రమాదంలో ఎవ్వరూ బతికి ఉంటారని అనుకోవడంలేదన్నారు. సహాయ కార్యక్రమాలతోపాటు బాడీల రికవరీకి కూడా కృషిచేస్తున్నా మన్నారు. బుధవారం రాత్రి వేళ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అమెరికన్‌ఎయిర్‌లైన్స్ అనుబంధ సంస్థ ఈ బాంబార్డియర్ విమానాన్ని నడుపుతోంది. అదేక్రమంలో ఆర్మీ హెలికాప్టర్ కూడా పైలట్లకు సిబ్బందికి శిక్షణనిస్తోంది. అత్యంతశీతలనదిగా ఉన్న పోటోమాక్ నదిలోనే గగనతలంలో ఢీకొని కూలిపోయాయి. క్రాష్ క్రాష్ అన్న శబ్దాలు బిగ్గర వినిపించాయి. బ్లాక్‌హాక్ హెలికాప్టర్ కూడా ముగ్గురు సైనికులతో వెళుతోంది. అత్యవసర సిబ్బంది సుమారు 300 మందికిపైగా ఇపుడు మృతదేహాల రికవరీకి పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈప్రమాదంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. ఈప్రమాదంపట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలపై తీవ్ర విమర్శలుచేసారు. విమానం ఖచ్చితమైన రూటులోఉన్నపుడు హెలికాప్టర్‌నేరుగా విమానం వైపునకు ఎలా వస్తుందని స్పష్టంగా ఉన్న రాత్రివేళ కూడా ఇలా జరిగితే ఎలా ఇందుకు ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలదే బాధ్యత కాదా అని ఆయన ట్రూత్‌సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. ఫెడరల్ ఏవియేషన్ పాలనా యంత్రాంగం ముందు విచారణకు ఆదేశించింది. రీగన్ విమానాశ్రయంలోకి అన్ని విమానాల రాకపోకలను నిషేధించింది. శుక్రవారం ఉదయం వరకూ కూడా విమానాల ల్యాండింగ్‌ను నిలిపివేసింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌సిఇఒ ఒక విడియో విడుదలచేస్తూ తీవ్ర విచారం కలిగిస్తోందని పేర్కొన్నారు.

అమెరికా కన్సాస్ సెనేటర్ రోజర్ మార్షల్ మాట్లాడుతూ ఈప్రమాదం అంతా ఒక క్షణంలో జరిగిపోయిందని అన్నారు. అత్యాధునిక సాంకేతికపరిజ్ఞానంతో ఉన్న విమానం ఒక మిలిటరీ హెలికాప్టర్‌ను ఎలా ఢీకొట్టిందన్న అంశంపై విచారణ జరుపుతున్నారు. వాషింగ్టన్ గగనతలం నిత్యం రద్దీగా ఉంటుంది. తక్కువ ఎత్తులోనే విమానాలు రాకపోకలు సాగిస్తుంటారు. మిలిటరీ, ప్రభుత్వ హెలికాప్టర్లు కూడా వివిధ ప్రాంతాలకు తగిన ఎత్తుల్లో వెళుతుంటాయి. రాత్రిపగలు కూడా రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. ఇలా తక్కువ ఎత్తులో గగనతలంలో రద్దీగా రాకపోకలు సాగించడంపైనా ఇపుడు విచారణ సాగిస్తున్నారు.

# బంగ్లా ప్రధాన సలహాదారు యూనస్‌తో జార్జిసోరస్ కుమారుడు భేటీ


## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఫెక్ట్

**ఢాకా, జనవరి 30:** వివాదాస్పద అమెరికన్ బిలియనీర్, ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ అధినేత జార్జిసోరస్ కుమారుడు అలెక్స్.. బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు మహమ్మద్ యూనస్‌తో భేటీ అయ్యారు. ఆ దేశానికి నిధులను నిలిపేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నాక ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. మూడు నెలల వ్యవధిలోనే వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి. ఓపెన్ సొసైటీ ఫౌండేషన్‌కు చెందిన కీలక వ్యక్తులు చీఫ్ ఇంటీరియం అడ్వైజర్‌తో భేటీ అయ్యారని యూనస్ ఆఫీస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. 'బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలని, అసత్య ప్రచారాలతో ఎలా పోరాడాలో, కీలక ఆర్థిక సంస్కరణలు వంటి అంశాలపై చర్చించారు. అని యూనస్ ఆఫీసు పేర్కొంది. వీటితోపాటు రోహింగ్యా సంక్షోభం వంటి వాటిపైనా మాట్లాడినట్లు స్థానిక మీడియా పేర్కొంది. సోరస్‌కు చెందిన ఒఎస్‌ఎఫ్ తూర్పు ఐరోపా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాల్లో ప్రభుత్వాల మార్పిడిని ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వ పతనంలో కూడా కీలకపాత్ర పోషించారని ప్రచారంలో ఉంది.

యుఎస్ ఎయిడ్ నుంచి వివిధ దేశాలకు అందుతున్న సాయాన్ని ట్రంప్ సర్కారు 90 రోజులపాటు నిలిపివేసింది. ఈ జాబితాలో బంగ్లాదేశ్ కూడా ఉంది. దీంతో యుఎస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానికి చిక్కులు ఎదురుకానున్నాయి.

ఆసియాలోనే యుఎస్‌ఎయిడ్ అతిపెద్ద సాయం బంగ్లాదేశ్‌కు అందుతుంది. ముఖ్యంగా ఆహార, ఆరోగ్యం, పాలన, విద్య, పర్యావరణం సంబంధిత రంగాల్లో వీటిని వినియోగించేవారు. 2024లో అమెరికా నుంచి 202 మిలియన్ డాలర్లు అందాయి.

# యమునలో అమోనియం స్థాయిలు అధికంగా ఉన్నాయన్న ఆప్




## తగిన ఆధారాలు చూపాలన్న ఇసి!

**న్యూఢిల్లీ, జనవరి 30:** యమునా నదిలో అమోనియా స్థాయిలు పెరగడాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఎన్నికల సంఘం సూచించింది. హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ఇసి జారీ చేసిన నోటీసులకు ఆయన సమాధానమిచ్చారు. దీనిపై తాజాగా ఇసి ప్రతిస్పందించింది. యమునా నదిలో అమోనియా పెరుగుదలను నరమేధం, రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని ఇసి కేజ్రీవాల్‌కు సూచించింది. వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడంతో పాటు అశాంతిని కలిగించేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరింది. పెరిగిన అమోనియా స్థాయిలను విషప్రయోగం అనే అంశంతో కలపకుండా నదిలోని నీటి స్వభావం, పరిణామం, విషపూరితమైన విధానం, దాన్ని గుర్తించే పద్ధతులపై సరైన సాక్ష్యాలను అందించేందుకు మరో అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఆయా సాక్ష్యాలను ఢిల్లీ జల్ బోర్డుకు సమర్పించాలని ఆదేశించింది. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదిలో అమోనియం స్థాయిలు ఆరురెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం వాదిస్తోంది. వీటివల్ల నగరవాసులకు ఆరోగ్యసమస్యలు వస్తాయని, ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని ఆరోపిస్తోంది.

ఈ క్రమంలో నదిలో విషం కలపడం ద్వారా ప్రజలను హతమార్చాలని అక్కడి బిజెపి ప్రభుత్వం చూస్తోందని కేజ్రీవాల్ ఇటీవల సంచలన ఆరోపణలు చేశారు.

మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ కూడా యమునను కలుషితం చేయడం 'జల ఉగ్రవాదం'గా పేర్కొన్నారు. ఈఆరోపణలపై స్పందించిన ఇసి తగిన ఆధారాలు చూపించాలని ఆప్‌ను ఆదేశించింది. దీనికి కేజ్రీవాల్ స్పందించగా, తాజాగా ఇసి ప్రతిస్పందించింది.

# మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం..

## 15 గుడారాలు దగ్ధం..

**ప్రయాగ్‌రాజ్, జనవరి 30:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో మరోసారి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్- 22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దాదాపు 15 గుడారాలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. 11 రోజుల క్రితం రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 18 టెంట్లు దగ్ధమయ్యాయి.

# ప్రొఫెసర్‌ను పెళ్లాడిన విద్యార్థి

## బెంగాల్‌లో వింత సంఘటన వైరల్

**కోల్‌కత్తా, జనవరి 30:** బెంగాల్‌లోని మౌలానా అబుల్ కలామ్ అజాద్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న హరింఘటా టెక్నాలజీ కాలేజీలో ఒక ప్రొఫెసర్ అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థిని పెళ్లాడింది. కోల్‌కత్తాకు 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న నదియాలో ఈసంఘటన జరిగింది. పాయల్ బెనర్జీ అనే సైకాలజీ ప్రొఫెసర్ తన విభాగంలోనే చదువుతున్న విద్యార్థిని పెళ్లాడిందని విడియోల్లో రుజువయింది. ఆమె పెళ్లిందండలు, వధువు దుస్తులు అలంకారంలో కనిపించింది. అయితే ఇది నిజమైన పెళ్లికాదని, అకడమిక్ కసరత్తుల్లో భాగంగా అంతర్గత వినియోగంకోసం జరిగినదేనని ఆమె వాదిస్తోంది. హల్దీ వేడుకలు, పూలదండలు మార్చుకోవడం వంటివి తరగతి గదిలోనే జరిగాయి. ఈసంఘటనను తీవ్రంగా పరిగణించిన వర్సిటీ అధికారులు ఆమెను సెలవుపై వెళ్లాలని ఆదేశించి దర్యాప్తునకు ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురుసభ్యుల ప్యానెల్‌ను కూడా ఏర్పాటుచేసి దోషులుగా ఎవరుతేలినా కఠిన చర్యలు తీసుకుంటామని వర్సిటీ అధికారులు చెప్పారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న విడియోల్లో విద్యార్థిపై హల్దీని చల్లారు. హిందూ వివాహ వేడుకల్లో ఈ వేడుక జరుగుతుంది. మరో విడియోలు ఇద్దరూ దండలు మార్చుకుని పవిత్ర అగ్నిగుండం తరహాలో ఒక క్యాండిల్‌చుట్టూ ఏడు అడుగులు నడిచినట్లు కనిపిస్తోంది. అలాగే విద్యార్థి కూడా ఆమె నుదుటిపై సిందూరం పెట్టాడు. అంతేకాకుండా ఆమెకు రోజాపువ్వును ఆఫర్‌చేసాడు. విద్యార్థి ప్రొఫెసర్ సంతకాలతో ఉన్న యూనివర్సిటీ లెటర్‌హెడ్‌పై ఆమె ఆతడు ఒకరికొకరు ఇష్టపడుతున్నట్లు అందుకే పెళ్లిచేసుకున్నట్లు సంతకాలున్న పత్రం కూడా వైరల్ అయింది. ఏళ్లతరబడి సైకాలజీ ప్రొఫెసర్‌గా బెనర్జీ పనిచేస్తోంది. అయితే సైకలాజికల్ డ్రామాలో ఇదొక భాగమని తన బోధనా తీరును తరగతుల్లో కూడా ఆమె ఈవిధంగా వివరిస్తుందని ఈ విడియోలు ఆమెను అప్రతిష్టపాలుచేయడానికే వైరల్‌చేసారని ఆమె ఆరోపిస్తోంది. అయితే ఈ తతంగం మొత్తంపై విద్యార్థి మాత్రం ఎలాంటి వ్యాఖ్యలుచేయలేదు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేయడం పక్కా

## - జిల్లాలో హార్టికల్చర్ ఎయిర్ పోర్టు ఏర్పాటు - వచ్చే ఆర్థిక సంవత్సరానికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల అమలు :మంత్రి పయ్యావుల కేశవ్




**ఉరవకొండ, జనవరి 30 ప్రభాతవార్త** గత వైఎస్సార్సీపీ పాలకుల ఆర్థిక విధ్వంసం, అరాచకం కారణంగా భారతదేశం మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ కు అప్పు తీసుకోవడానికి అర్హత, శక్తి లేదని నీతి అయోగ్ తేల్చి మన రాష్ట్రానికి సున్నా మార్కులు వేసిందని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం కింద డ్రిప్పు మరియు స్ప్రింక్లర్లు మంజూరైన రైతులకు పరికరాలను పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో ఒక్కసారిగా అద్భుతాలు చేయడం అనేది సాధ్యమయ్యే పని కాదన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత ప్లానింగ్ కమిషన్ కాకుండా నీతి అయోగ్ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. వారం రోజుల కిందట భారతదేశం ఆర్థిక వ్యవస్థకి మార్గదర్శిగా నిలబడే వ్యవస్థ అయిన నీతి అయోగ్ సంస్థ దేశంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండాలని అధ్యయనం చేసిందని, దేశంలో ప్రధానంగా 18 రాష్ట్రాలను తీసుకోవడం జరిగిందని, 18 రాష్ట్రాలలో మన రాష్ట్రం 17వ స్థానంలో ఉందని, మన తర్వాత చివరిగా పంజాబ్ రాష్ట్రం ఉందన్నారు. ఆర్థికంగా ఐదు ఫ్యాక్టర్లను పెట్టుకొని ఏరంగంలో ఎవరెవరు ఎలా ఉన్నారు అని చూస్తే అన్ని రంగాల్లోనూ మన రాష్ట్రం 17వ స్థానంలో ఉందని తెలిపారు. వారు అప్పు తీసుకునే శక్తి ఉందా లేదా అనేది ప్రత్యేకంగా సర్వే చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం కింద జిల్లా 37,500 హెక్టార్లు అనగా లక్ష ఎకరాలు లక్ష్యం ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో ప్రభుత్వాలు ఉమ్మడి అనంత జిల్లాకు 34 వేల హెక్టార్ల లక్ష్యం ఇవ్వడం జరిగిందని, ఈరోజు విడిపోయిన సగం జిల్లాకే లక్ష ఎకరాలు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. జిల్లా రైతాంగం రుణం తీసుకునే బాధ్యత తమ పార్టీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజా ప్రతినిధులపై ఉందని గుర్తుపెట్టుకుని పనిచేస్తున్నామని, ప్రతి రంగంలోనూ మార్పులు చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. 18 రాష్ట్రాలకు ఎంతో కొంత అప్పు తీసుకునే అవకాశం ఉంది, తిరిగి కట్టే శక్తి ఉంది, కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అప్పు తీసుకునే శక్తి లేదని తేల్చి చెప్పిందని, ఇది ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అని, ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి నుంచే అప్పులు మొదలయ్యాయని, అప్పులు ఉన్నాయనే సాకు చూపించి తప్పించుకోవాలనే ఆలోచన లేదని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేయడం పక్కా అని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు ఇవ్వడం పక్కా అని తెలియజేశారని, అప్పులు ఉన్న పరిస్థితి నుంచి నిలుదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పాఠశాలలు రీఓపెనింగ్ లోపలే తల్లికి వందనం పేరుతో 15,000 రూపాయలను ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టంగా ప్రకటించారని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, ఇప్పటికే దీపం 2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే పథకాన్ని ప్రారంభించామని, భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనంత ఎక్కువగా, అత్యంత ఎక్కువ జనాభాకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. ఆర్థికంగా భారమైన సరే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా తీసుకుపోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, టీం చంద్రబాబు పనిచేస్తుందన్నారు.

ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ కూటమికి ఓటు వేసి ప్రభుత్వాన్ని మార్చి ప్రజలు చూపించిన విజ్ఞత ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తును కాపాడిందన్నారు.

# పేరుకు వంద పడకల ఆసుపత్రి - నెలలో 20 ఆపరేషన్లు కూడా లేవు

## డాక్టర్లు ఉన్నా కొంతమందిపైనే ఒత్తిడి, వారు కూడా సెలవు తీసుకోనున్నట్లు సమాచారం

**శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో 1999లో అప్పటి ఇప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చొరవతో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.5కోట్లతో ఇక్కడ అప్పటి వరకు ఉన్న 30 పడకల ఆసుపత్రి స్థానంలో 11 ఎకరాల విస్తీర్ణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించి ప్రారంభించారు. గత ప్రభుత్వ హాయంలో ఈ ఆసుపత్రిని 200 పడకలకు పెంచుటకు రూ.8కోట్లు వెచ్చించి రెండవ అంతస్తు నిర్మాణం చేపట్టారు.అయితే ఈ ప్రభుత్వాసుపత్రి కరోనా కాలంలో ఎంతో ఉపయోగపడింది. జవాబుదారి తనంతో పని చేసే డాక్టర్లతో సేవలందించింది. ముఖ్యంగా కరోనా కాలంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ కిరణ్‌కుమార్ సేవలు అనిర్వచనీయంగా ప్రసంశలందుకుంది. అయితే అలాంటి ఆసుపత్రిలో నేడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. శ్రీకాళహస్తి లో నిరుపేదలకు వైద్యసేవలందించుటకు దీర్ఘకాలం నియోజక వర్గాన్ని పరిపాలించిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సేవలు సాధించిన ప్రగతి ఈ ప్రాంత ప్రజలు మరువరు. ఇక్కడి ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ తిరుపతి, నెల్లూరు,చెన్నై వెళ్ళటానికి ఆర్థిక స్తోమత లేక పడుతున్న తిప్పలను చూసి ఇక్కడ డయాల్సిస్ కేంద్రాన్ని ఏర్పాటుకు అప్పటి వైద్యఆరోగ్యశాఖ మంత్రి వద్దకు పలుమార్లు తిరిగి తిరిగి సాధించారు. ఈ సాధనలో బొజ్జల బృందమ్మ పాత్రను నాటి సభలో మంత్రి ప్రశంసించటం గమనించదగ్గ విషయం. అలాగే ఆసుపత్రిలోని రోగుల అటెండర్లకు మధ్యాహ్నం దేవస్థానం నుంచి భోజనం అందించుటకు గోపాలకృష్ణారెడ్డి తీసుకున్న నిర్ణయం గొప్పదిగా చెప్పవచ్చు. ఆపరేషన్లు చేసే వైద్యులపై వత్తిడి తెస్తున్నారు. ఇక ఆపరేషన్లు చేసే వైద్యులకు అందాల్సిన ఆరోగ్య నగదు గత మూడు సంవత్సరాలుగా అందలేదంటే ఆశ్చర్యం కలగకమానదు. జనరల్ సర్జన్‌ను నియమించుకోవాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సూచించినా నియమించలేదంటే నిర్లక్ష్యం కంటికి కనిపిస్తోంది. గత ప్రభుత్వ హాయాంలో రూ.8కోట్లతో నిర్మించిన రెండవ అంతస్థ ఆసుపత్రి భవనాలు నాణ్యత ఎంతో ఇటీవల కురిసిన వర్షాలకే ఉరిసిందంటే ఇక చెప్పక్కర్లేదు. ఈ ఆసుపత్రిలో సదుపాయాల కల్పనకు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చేయని ప్రయత్నం అంటూ లేదు. పలుమార్లు వైద్యఆరోగ్యశాఖ మంత్రిని అభ్యర్థిస్తున్నారు.ఇక ఆసుపత్రిలోని జనన మరణ నమోదు వార్డులో రోగులు నిలబడటానికే పరిమితం కనీసం కూర్చొటానికి బెంచీలు లేదు. ఇక 150 గదుల ఆసుపత్రిలో జనవరి నెలలో చేసిన ఆపరేషన్ల సంఖ్య చూస్తే ఆశ్చర్యమేస్తుంది. సిజేరియన్ ఆపరేసన్లు 7 ట్యూబెక్టమి ఆపరేషన్లు 6 మాత్రమే.ఇక్కడ రేడియాలజిస్లు లేరు. జనరల్ మెడిసిన్ డాక్టర్ లేదు. ఇఎన్‌టి డాక్టర్ ఉన్నా ఆమెను బయట క్యాంపులకు తిప్పుతున్నారు.ఇక్కడి ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులుంటే డాక్టర్ హారిత వత్తిడి తట్టుకోలేక గురువారం నుంచి సెలవులో వెళ్ళినట్లు సమాచారం. ఇక గర్భిణీస్త్రీలకు సిజేరియన్లు తప్ప సాధారణ కాన్పులు చేసేవారు కరువయ్యారు. ఇక్కడి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసే డాక్టర్లు ఉండగా కొంతమందిపైనే వత్తిడి తీసుకు వస్తుండడంతో వారు కూడా సెలవు తీసుకోనున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రోగుల కంటే డాక్టర్లు, సిబ్బందే ఎక్కువ అని చెప్పవచ్చు.నిరుపేదల కోసం ప్రభుత్వం కోట్లు వెచ్చిస్తుంటే ఇక్కడి ఆసుపత్రికి వెళ్ళిన నిరుపేదలకు నిరాశ ఎదురౌతుంది. మత్తుఇచ్చే డాక్టర్ సూచనలతో రోగులు భయపడి బయటి వైద్యానికి వెళుతున్నారు.ప్రభుత్వం ఏమో ప్రతి కాన్పు ఆసుపత్రిలోనే జరగాలని ఆదేశిస్తున్నారు.



ఆసుపత్రిలో కూర్చోటానికి బల్లలు లేక నిల్చున్న పేషెంట్లు




## డంపింగ్‌యార్డ్ లేని రాష్ట్రంగా నిలపడమే లక్ష్యం: బిఐఎస్

### స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరాజు పట్టాభి

**విజయవాడ, జనవరి 30, ప్రభాతవార్త :** దేశంలోనే డంపింగ్‌యార్డ్‌లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ శాస్త్రవేత్త డి అండ్ జాయింట్ డైరెక్టర్ ఎం రమాకాంత్ సాగర్ వెల్లడించారు. ఘన వ్యర్థాల నిర్వహణ కోసం బిఐఎస్ నిర్వహిస్తున్న మనక్‌మందన్ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించగా ముఖ్య అతిథిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరాజు పట్టాభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాకాంత్‌సాగర్ ప్రసంగిస్తూ ఘనవ్యర్థాల విభజన, సరైన సేకరణపై దృష్టిసారించడంపై అవగాహన కల్పిస్తు ప్రసంగించారు. వాణిజ్య సౌకర్యాలు పర్యావరణ పరంగా స్థిరమైన పద్దతులు అవలంబించడానికి ఈ మనక్‌మందన్ దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. కాలుష్యం తగ్గింపు, రీసైక్లింగ్ ప్రోత్సహించడం ద్వారా ప్రపంచానికి సవాల్‌గా మారిన ఘనవ్యర్థాల నిర్వహణను సమర్థంగా నిర్వహించడం సులభమవుతుందన్నారు. బిఐఎస్ శాస్త్రవేత్త మరియు డిప్యూటి డైరెక్టర్ డి అఖిల్ తన సాంకేతిక ప్రజంటేషన్ ద్వారా బిఐఎస్ మరియు ఉత్పత్తి ధృవీకరణ యొక్క వివిధ కార్యకలాపాలను వివరించారు. ఐఎస్ 18520-2024 ఘనవ్యర్థాల నిర్వహణ వాణిజ్యసౌకర్యాల్లో విభజన సేకరణ మరియు వినియోగం, దుకాణాలు, మార్కెట్లు, మాల్స్ మొదలైన వాటిలో ఎలా నిర్వహించాలో సోదాహరణంగా వివరించారు. బిఐఎస్ రూపొందించిన నిర్దిష్ట మార్గదర్శకాలను సవివరంగా విపులీకరించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరాజు పట్టాభిరాం మాట్లాడుతూ బిఐఎస్ రూపొందించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ రాష్ట్రమంతటా ఘనవ్యర్థాల సేకరణ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 250 మంది పట్టణ, స్థానిక సంస్థలనుండి ప్రతినిధులు హాజరయ్యారు.

## గాంధీజీపై పరిశోధనాత్మకంగా పాఠ్యాంశాల్లో పొందుపర్చాలి

### నాస్తికకేంద్రం అధ్యక్షుడు డా.సమరం

**విజయవాడ. జనవరి31,ప్రభాత వార్తప్రతి నిధి:** మహాత్మాగాంధీ జీవన విధానం,జాతీయోద్యమ రథసారధిగా ఆయన నిర్వహించిన పాత్రపై మరింత సమగ్రంగా పరిశోధనాత్మకంగా పాఠ్యాంశాల్లో పొందుపర్చాలని విజయ వాడ నాస్తిక కేంద్రంలో గురువారం జరిగిన జాతిపిత వర్ధంతి కార్యక్రమంలో పలువురు వక్తలు కోరారు. ఆయన సహాయక సేవలు ,కుష్టు వ్యాధి నివారణ తదితర కార్యక్రమాలు గురించి నేటి తరానికి వివరించారు.ఈ కార్యక్రమం ప్రారంభంలో గాంధీ స్మృతిలో భాగంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. నాస్తికకేంద్రం అధ్యక్షులు డా సమరం మాట్లాడుతూ అహింసే మార్గంగా జీవించిన గాంధీజీ గురించి మరింత విశ్లేషణాత్మక పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. రష్మి మాట్లాడుతూ గాంధీ ,గోరాల సంభాషణలకు గల చారిత్రాత్మక ప్రాధాన్యతను వివరించారు. గాంధీజీ స్మృతి దినాన్ని ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం గా జరుపుకుంటున్నారు వాసవ్య మహిళా మండలి మెడికల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా పి. దీక్ష తన ప్రసంగంలో గాంధీజీ కుష్టు వ్యాధిగ్రస్తుల కొరకు ఎంతో కృషిచేశారన్నారు. సేవాగ్రాం ఆశ్రమంలో పరుచూరి శాస్త్రికి స్వయంగా గాంధీజీ సేవలు చేశారన్నారు. ఆయన గాంధీజీకి సహాయైది, సంస్కృతంలో పండితులు కూడా. సేవాగ్రాంలో ప్రత్యేకించి ఒక విభాగం కస్తూరిబా హెల్త్ సొసైటీకి అనుబంధంగా గాంధీ మెమోరియల్ లెప్రసీ ఫౌండేషన్ కుష్టువ్యాధిగ్రస్తుల కొరకు ఎన్నో విశేషసేవలు చేస్తున్నదని తెలిపారు. చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థి దశనుంచే గాంధీజీ గురించి మరింత తెలుసుకునేవిధంగా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలని విజ్ఞప్తి చేశారు. డా మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ గురించి తెలియనివారు ప్రపంచంలో లేరంటే అతిశయోక్తి లేదన్నారు. మహాత్మాగాంధీ విగ్రహాలు విదేశాలలో సైతం నెలకొల్పుతున్నారంటే దానికి కారణం హింస, రక్తపాతంలేకుండా కేవలం సత్యాగ్రహం, అహింస మార్గాలలో భారత స్వాతంత్రం సాధించడానికి వారుచేసిన కృషే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖిగాంధీ కింగ్ ఫౌండేషన్‌ఖి ప్రతినిధి, సర్వోదయ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న డా క్రాంతి, శ్రీమతి రజతగోరా మరియు వాసవ్య మహిళా మండలి కార్యకర్తలు, వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్న యువతులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ సమరం

# ప్రశ్నార్థకమైన పశువైద్య విద్యార్థుల భవితవ్యం

**గరివిడి (విజయనగరం), జనవరి 30 ప్రభాతవార్త :** ఉత్తరాంధ్రలో ఉన్న ఏకైక పవువైద్య కళాశాల విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. విసిఐ అనుమతులు రాకపోవడంతో వారు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాలుగో సంవత్సరం పూర్తి చేసి ఏప్రిల్ నెలలో ఇంట్రషిప్‌కి వెళుతున్న ఈ కళాశాలకు చెందిన 69 మంది మొదటి బ్యాచ్ విద్యార్థులు తమ పరిస్థితి తలచుకుని ఆందోళన చెందుతున్నారు. కష్టపడిన చదవుకి గుర్తింపు లేని పరిస్థితి ఏర్పడటంతో వారు తీవ్ర వేదనకు లోనవుతున్నారు. చదువుపై దృష్టి పెట్టలేని స్థితతిలో కొట్టుమిట్టాడుతున్నారు. నాలుగేళ్లు చదివిన విద్యకు గుర్తింపు లేదు. సర్టిఫికేట్ చెల్లు బాటు కాదు, పిజికి అనుమతి లేని పరిస్థితి ఏర్పడిందని విద్యార్థి లోకం గగ్గోలు పెడుతోంది. తమ భవిష్యత్ తలచుకుని విద్యార్థులు రోడెక్కి ఆందోళనకు సిద్దమయ్యారు. దర్నాతో ప్రభుత్వం దృష్టికి తమ సమస్య తీసుకెళ్లారు. న్యూ ఢిల్లీ పశు వైద్య మండలి అనుమతి లేకపోవడంతో ఇక్కడ పశువైద్య విద్యలో పట్టా పొందిన విద్యార్థులకు పట్టా చెల్లుబాటు కాదు. అలాగే పిజి చదివేందుకు అవకాశం ఉండదు. ఇతర దేశాలకు వెళ్ళి చదివేంఉదకు అనుమతి రాదు. రాష్ట్రంలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడిలో పశువైద్య కళాశాలలు ప్రభుత్వం నెలకొల్పింది. మిగతా మూడు కళాశాలలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) అనుమతులు మంజూరు అయ్యాయి. ఆయా కళాశాలల్లో అవసరమైన మేరకు ప్రొఫెసర్‌లు ఉన్నారు. భవనాలు, ఇతర మౌళిక సౌకర్యాలు ఉన్నాయి. 2020లో గరివిడి పశువైద్య కళాశాల ఏర్పాటైంది. అయితే కళాశాలకు అవసరమైన మేరకు మౌళిక సౌకర్యాలు లేవు, పశువైద్య కళాశాలకు అనువైన విధంగా భవనాలు లేవు 65 మంది ప్రొఫెసర్‌లు ఉండాల్సిన స్థితిలో కేవలం 40 మంది ఉన్నారు. వారిలో ఇటీవల 18 మందిని డిప్యూటేషన్‌పై తిరుపతి, గన్నవరం కళాశాలకు బదిలీ చేశారు. నవంబర్‌లో విసిఐ బృందం కళాశాల పరిశీలనకు వచ్చే సమయంలో తిరుపతి, గన్నవరం ఒనుంచి ప్రొఫెసర్‌లను ఇక్కడ కళాశాలకు బిదిలీ చేసిన అధికారులు ఇన్స్పెక్షన్ అయిన మూడు నెలల్లోనే మళ్ళీ 18 మంది ప్రొఫెసర్‌లను డిప్యూటేషన్‌పై పంపారు.



## జర్నలిస్ట్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్2025 క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీపీజెఏ సభ్యులు సీఎంను సచివాలయంలో కలిసి ఆయన చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. క్యాలెండర్‌లో పొందుపరిచిన ఫోటోలను సీఎం ఆసక్తిగా చూశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన వారిలో ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, నారాయణ, మహేష్, ప్రశాంత్, సతీష్ ఉన్నారు.

## అత్యాచారం, పోక్సో కేసులో నేరస్తునికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష

**సిద్దిపేట రూరల్, జనవరి 30, ప్రభాతవార్త :** అత్యాచారం, ఫోక్సో కేసులో నేర స్తునికి 20 యేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తు జిల్లా ప్రిన్సిపల్అండ్‌సెషన్స్ న్యాయమూర్తి సాయిరమాదేవి తీర్పునిచ్చినట్లు సీపీ అనురాధ గురువారం తెలిపారు. అమె తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాలలో ఇంటెగ్రేటెడ్ అపా ర్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మనవరాలు(3) యేళ్ల చిన్నా రిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్(30) అనే యువకుడు ఆడుకుంటామని తన రూంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని, గత యేడాది ఆగస్టులో బాధి తురాలి తాత త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అనంతరం టెక్నికల్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత కేసు పరి శోధన పూర్తిచేసి నేరస్తునిపై కోర్టులో ఛార్జిషిట్ వేసినట్లు తెలిపారు. న్యాయ మూర్తి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తునికి 20 యేండ్ల కఠిన కారాగార జైలుశిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలి పారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, కోర్టు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు

## మరో 15 బిల్లులు ప్రవేశపెడుతున్న కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి 30:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు మొత్తం 16 బిల్లులుప్రవేవపెట్టాలని ఎన్డీయే సర్కారు సిద్ధంచేసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే వక్స్ సవరణబిల్లుతోపాటు, వన్ ఎలక్షన్ ఒన్‌నేషన్ బిల్లును కూడా ఆమోదించు చేసుకోవాలనే తాపత్రయంతో ఉంది. మొత్తం 16 బిల్లులను సభలోప్రవేశపెడతామని, 2025 ఆర్థికబిల్లు, ఇమిగ్రేషన్ ఫారినర్స్ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అలాగే 2025-26 సంవత్సరానికిగాను వివిధ శాఖల పద్దులపైనా పార్లమెంటులో చర్చి స్తారు. జెపిసి ఇటీవలే సవరణ బిల్లును ఆమో దించింది. విపక్ష ఎంపిలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులుసూచించగా 14 సవరణలను కమిటీ అంగీకరించింది. అందుకు సంబందించిన తుది నివేదికను సిద్ధంచేసి లోక్‌సభ స్పీకర్‌ఓంబిర్లాకు అందిచింది. ఈ సమా వేశాల్లోనే ఈ బిల్లు ఆమోదం పొందేవిధంగా ఎన్డీయే కసరత్తులు చేస్తోంది.

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని తీసుకు రావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యమని కేంద్రం చెపుతోంది. ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యంచేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశ్యమనిప్రతిపక్షాలు విమర్శల దాడిచేస్తున్నా బిల్లును ఆమోదింపచేసుకునేందుకే ఎన్డీయేసర్కారు మొగ్గుచూపిస్తోంది.



# ఇంటర్ విద్యార్థుల సెల్‌ఫోన్లకే హాల్‌టికెట్ల లింక్

## ప్రాక్టికల్ పరీక్షలతోపాటు.. థియరీకి హాల్‌టికెట్లు

### పైలట్‌గా ఎథిక్స్, ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్లు జారీ

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇంటర్ విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం కాలేజీ యాజమాన్యాలను బ్రతిమాలుకోవల్సిన అవసరం లేకుండా.. విద్యార్థుల హాల్ టికెట్ల లింక్‌ను విద్యార్థులు సమర్పించిన ఫోన్ నంబర్లకే నేరుగా లింక్‌ను పంపించనుంది ఇంటర్ బోర్డు. ఇందుకు సంబంధించి ప్రయోగాత్మకంగా గురువారం జరిగిన ఎథిక్స్ అండ్ ఎన్వీరాన్‌మెంటల్ పరీక్ష హాల్ టికెట్ల లింక్‌ను పంపించింది. దాంతోపాటు నేడు(శుక్రవారం), రేపు(శనివారం) జరగనున్న ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లను విద్యార్థులు సమర్పించిన ఫోన్ నంబర్లకు పంపించినట్టు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు. ఇదే విధంగా ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లతోపాటు.. మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్న వార్షిక పరీక్షల హాల్ టికెట్లను కూడా జారీ చేయనున్నట్టు తెలిపారు. గతంలో కేవలం కాలేజీలకే హాల్ టికెట్లను బోర్డు పంపించేది. ఆ తర్వాత వెబ్‌సైట్‌లో పెట్టి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడైతే ఏకంగా విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నంబర్‌కే నేరుగా హాల్ టికెట్ లింక్‌ను ఇంటర్ బోర్డు పంపించనుంది. ఆ లింక్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులతోపాటు, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్ ఉన్నాయి. వారి కూడా త్వరలోనే పంపిస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది.

## ప్రశాంతంగా ముగిసిన జెఇఇ మెయిన్ ఫేజ్-1

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** దేశంలోని ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-2025 మెయిన్ ఫేజ్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దేశంతోపాటు ఇతర దేశాల్లో కలిపి 598 పరీక్షా కేంద్రాల్లో 284 నగరాల్లో పరీక్షను నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 13,78,232 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,00,273 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్షలకు మొత్తంగా 94.4 శాతం మంది హాజరయ్యారు.

ఈ నెల 22, 23, 24, 28, 29 తేదీల్లో ఎన్ఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీ కోసం పేపర్-1 పరీక్షను నిర్వహించగా.. ఈ నెల 30న బీఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల కోసం పేపర్-2 పరీక్షను నిర్వహించారు.

# బాపూజీ నివాళి సభలో చప్పట్లు కొట్టిన బీహార్ సిఎం!

**పాట్నా, జనవరి 30:** మహాత్మాగాంధీ వర్ధంతిసభలో పూజ్యబాపూజీకి నివాళులర్పించిన అనంతరం బీహార్‌ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చప్పట్లు కొట్టడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గురువారం ఆయన నివాళులు అర్పించిన వెంటనే చపట్లు చరిచారు. అంతలోనే తన తప్పును తెలుసుకుని చప్పట్లను నిలిపివేసారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో బాపూజీకి ఘననివాళులర్పించే కార్యక్రమం ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ సీఎం నితీష్‌కుమార్ బాపూజీకి నివాళులర్పించి అందరిలోను ఒక్కసారిగా చప్పట్లు కొట్టడంతో పక్కనున్నవారు విస్తుపోయారు. అసలు సందర్భం ఏమిటి? నితీష్ చప్పట్లు కొట్టడం ఏమిటి అన్న అంశాన్ని అందరూ చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ స్పీకర్ నంద్‌కిశోర్‌యాదవ్ ఆయన పక్కనే నిలుచుని ఉండటంతో చప్పట్లు ఆపేయాలని సంకేతాలివ్వడంతో నితీష్ తన తప్పు తెలుసుకుని చప్పట్లు నిలిపివేసారు. నితీష్‌కుమార్ ఇలా తప్పులుచేసి హెడ్‌లైన్లలోకి రావడం కొత్తేమీ కాదు. ఎన్డీయే కూటమికోసం 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేస్తూ ఎన్డీయేకు లోక్‌సభలో 4000 సీట్లకు పైగా వసానతయని ప్రకటించారు. లోక్‌సభ సీట్ల కంటే ఎన్నోరెట్లు సంఖ్యను చెపుతూ ఆయన ప్రకటన చేయడాన్ని అందరూ నోరెళ్ల బెట్టారు. ఆయన విడియో లను అప్పట్లో ఆర్జేడి నాయకులు రాష్ట్రమంతటా వైరల్‌చేసారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలనాయకులు,అధికార పార్టీలనేతలు ఘననివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానిమోడీతోపాటు విపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, ఖర్గే, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు మహాత్మాకు నివాళి అర్పించినవారలో ఉన్నారు. ప్రధానిమోడీ ఈసందర్భంగా బాపూజీ అభివృద్ధిచెందిన భారతావనికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారన్నారు. అహింసావాదం, సత్యమేవ జయత్ నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంచేసారన్నారు. రక్షణమంత్రి ఇతర మంత్రులు మనోహర్‌లాల్‌ఖట్టర్, ఇతర మిలిటరీ ప్రతినిదులు కూడా బాపూజీకి నివాళులర్పించారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోగనున్న పెళ్లిబాజాలు

## 2025లో పెళ్లి ముహూర్తాల జోరు ఆరంభం

### నేటి నుంచి మార్చి 6 వరకు శుభముహూర్తాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మొత్తంగా కల్యాణ ఘడియ లొచ్చాయ్....పుష్యమాసం ముగిసింది. మాఘ మాసం ఆరంభమవ్వడంతో శుక్రవారం నుంచి కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. శుభ ముహూర్తాలకు తెరతొలగి, పెళ్లిళ్ల బాజాల, భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మాఘ, ఫాల్గుణ మాసాలలో 25 శుభ ముహూర్తాలున్నట్లుగా యాదగిరి క్షేత్రంలోని ఆలయ పంచాంగకర్తలు, పూజారులు, బ్రాహ్మణులు చెబుతున్నారు. దీంతో వివాహాలను కుదుర్చుకునే పర్వాలలో పెళ్లి చూపులు, మాటా ముచ్చట్లు వేగవంతమయ్యాయి.

ఈ నెల 31 నుంచి శుభ పర్వాలు మొదలై, మార్చి 6వ తేదీ వరకు పెళ్లి తతంగాలు జరుపుకోవచ్చు. మాఘ మాసంలో జనవరి 31వ తేదీన ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలు, ఫిబ్రవరి 2నాటి ఉదయం, రాత్రి 7వ తేదీన ఉదయం, రాత్రి, 13 తేదీన ఉదయం, 14వ తేదీ రాత్రి, 16, 20 తేదీల్లో మూడు వేళల్లో, 22, 23న కూడా రెండేసి ముహూర్తాలున్నాయి. ఫాల్గుణ మాసంలో వచ్చే మార్చి నెల 2న ఉదయం రెండు,రాత్రి రెండు ముహూర్తాలు, 6వ తేదీన 3 వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లుగా పంచాంగకర్తలు తెలిపారు. ముహూర్తాలు సమీపించడంతో పెళ్లి పెద్దలు ఒకవైపు కుటుంబ సభ్యులు మరోవైపు ఏర్పాట్లపై వ్యూహ రచనకు రంగంలోకి దిగారు. కొనుగోలు, విందు, ఫొటో షూట్, రాకపోకల కోసం ఇరు కుటుంబాల చర్చలు సాగుతున్నాయి. కల్యాణ మండపాలు హంగామాలతో రూపు దిద్దుకుంటున్నాయి.

# అధిష్ఠానానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా

## ఫిబ్రవరి రెండోవారం సూర్యాపేటలో రాహుల్‌గాంధీ సభ

## టీచర్ ఎమ్మెల్సీపై ఫిబ్రవరి 3న కేబినెట్ సబ్‌కమిటీ

## సమావేశం, 5న కులగణనపై..: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్



గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ఏఐసిసి ప్రకటిస్తుందని ఢిల్లీకి పేర్లు నివేదించామని తెలిపారు. నక్సలిజం లా అండ్ ఆర్డర్ ప్రాబ్లంగా మారిందని అన్నారు. సూర్యాపేటలో రాహుల్‌సభ ఉంటుందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ చెప్పారు. ఫిబ్రవరి రెండోవారం రాహుల్‌గాంధీ సభను తెలంగాణలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరుపై ఇప్పటికే కసరత్తు జరిగిందని ఢిల్లీకి పంపిరామని తెలిపారు. కుల గణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం ఉంటుంది. టీచర్స్ ఎమ్మెల్సీపై ఫిబ్రవరి 3న సమావేశం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి కుల గణన సర్వే జరిగితే తమకు నష్టం జరుగుతుందని అది జరగకుండా కుట్రలు చేశాయని ఆయన ఆరోపించారు. స్థానికసంస్థల ఎన్నికలు కేబినెట్‌లో నిర్ణయిస్తారని రిజర్వేషన్ పెంపు తర్వాత ఉంటాయని టిపిసిచీఫ్ స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని జోస్యంచెప్పారు. మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. బిజెపి కార్పొరేటర్లు బిక్షాటన చేస్తూ జిహెచ్‌ఎంసి సమావేశాని రావడం విడ్డూరమని కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని ఇద్దరు బిజెపి కేంద్ర మంత్రులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో విఫలం కావడంతో సంక్షేమపథకాలు లబ్దిదారులకు అందడంలేదని ఆయన ఆవేదన చెందారు. హామీల అమలుకు కొంత ఆలస్యం అవుతుందేమోకాని ప్రజల్ని మోసం కాంగ్రెస్ మోసం చేయ దని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పథకాలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉద్దేశ్యం డబ్బులు లేవని కాదని అధికా రుల వల్ల సంక్షేమపథకాలు కొంత మందికి అందంలో ఆలస్యం అవుతుందనే భావంలో మాట్లాడారని ఆయన అర్థం వివరించారు. పటాన్‌చెరుపై కమిటీ నివేదిక ఇంకా రాలేదని ఎమ్మెల్యే కమిటీ ముందుకు రావాల్సి ఉందని సమస్యను సామ రస్యపూర్వకంగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సిఎం ఇంటి వద్ద సమీక్షలు చేస్తారు అందులో తప్పు ముందని ఆయన ప్రశ్నించారు. సచివాలయం కూల్చి మరలా కొత్తది కట్టాల్సిన అవసరం ఏముచ్చిందని అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమనాయకుడిగా కెసిఆర్‌పై అభిమానం ఉంటుందని, జగ్గారెడ్డిని మూడేండ్లు నెగ్గు కుంటూ వచ్చామని టిపిసిసి చీఫ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

# సచివాలయంలో ఇద్దరు నకిలీ ఉద్యోగులు

## అధికారులతో పనులు చేయిస్తామంటూ దందాలు

## రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భద్రతా సిబ్బంది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం బయటపడింది. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నకిలీ ఉద్యోగులు దర్జాగా తిరగడం కలకలం రేపింది. ఫేక్ ఐడీ కార్డు మెడలో వేసుకుని అన్ని సెక్షన్లు తిరుగుతూ హల్చల్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సెక్రటేరి యట్‌లో ఇటీవల నకిలీ ఉద్యోగులు తిరుగుతు న్నారని భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దీంతో నిఘా పెట్టిన ఇంటెలిజెన్స్ శాఖ.. ఇద్దరు నకిలీ ఉద్యోగులను అదుపులోకి తీసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ రావు, డ్రైవర్ రవి ఫేక్ ఐడీ కార్డులు తయారుచేసి సెక్రటేరియట్‌లో దందా చేస్తున్నారు. సెక్షన్ ఆఫీసుల్లో తిరుగుతూ అక్కడికి వచ్చిన వారిని మాటల్లో పెట్టి వివరాలు రాబడుతున్నారు. వారి పని పూర్తి చేయిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారు. నకిలీ ఉద్యోగుల సమాచారంతో అప్రమత్తమైన సచివాలయ భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ శాఖ అధికారులు నిఘా పెట్టారు. ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు చాకచాక్యంగా వ్యవహరించి నకిలీ ఉద్యోగులు ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా చలామణి అవుతున్న భాస్కర్ రావుతో పాటు డ్రైవర్ రవిని పోలీసులు విచారిస్తున్నారు. సచివాలయంలో ఫేక్ ఐడితో ఓ వ్యక్తి దొరికాడు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చెప్పుకుంటూ సదరు వ్యక్తి బిల్డప్ ఇస్తున్నాడు. నకిలీ ఉద్యోగి కదలికలు అనుమానంగా ఉండడంతో సెక్రటేరియట్ సిఎస్ఓ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ నిఘా ఉంచి పట్టుకుంది. మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి ప్రశాంత్, డ్రైవర్ రవిలు ఫేక్ ఐడీ కార్డు తయారు చేసి భాస్కర్ రావుకు ఇచ్చినట్లు ఎస్పిఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ మీడియా సమావేశంలో ఉద్యోగి పేరిట హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బట్టబయలైంది. నకిలీ ఐడెంటిటీ కార్డుతో చలామణి అవుతున్న విషయం బయటపడింది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ అనే వ్యక్తి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా నకిలీ ఐడెంటిటీ కార్డు తీసుకుని సెక్షన్‌లో దర్జాగా తిరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ గుర్తించారు.



# జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలి

## మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వరి స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 3వ తేది వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేది వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ ఇఒ పురేంద్ర కుమార్, అర్చకులు సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను, ఆహ్వానపత్రికను మంత్రికి అందించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణం, మహా పుర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, జోగులాంబ బాల బ్రహ్మేశ్వర్‌స్వామి కళ్యాణోత్స వం, మహాశివరాత్రిని పురస్కరించుకుని కళ్యాణో త్సవం, రథోత్సవం, అశ్వ వాహన సేవ, అవభృదోత్స వాలను నిర్వహిం చను న్నట్లు ఇఒ పురేంద్రకుమార్ మంత్రికి వివరించారు. వరుస ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇతర శాఖల అధికారులను సమన్వ యం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ ఇఒను ఆదే శించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి లోటురాకూడదని మంత్రి ఆదేశించారు. దేదీప్య మానంగా బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి ఉత్స వాలను నిర్వహించాలని మంత్రి సురేఖ సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి కార్య దర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

### గోవర్ధనగిరిలో ఉపాధికూలీ మృతి ఘటనపై మంత్రి కొండా సురేఖ ఆరా

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని గోవర్ధనగిరిలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు తమ పనులలో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు మరణించడంతో పాటు పలువురు గాయపడంపై మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి, దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం కింద నిబంధనల ప్రకారం కూలీలకు అందించాల్సిన ఆర్థిక సహాయం, ఇతర సహకారాలపై కలెక్టర్‌తో మంత్రి సురేఖ చర్చించారు.



# తెలంగాణ తరహా అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

## ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జనవరి 30,ప్రభాతవార్త:** తెలంగాణ తరహాలో అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్‌ను ఢిల్లీ ప్రజలు గెలిపించాలని కాంగ్రెస్‌ను గెలిపించాలని పిసిసి మాజీ అధ్యక్షుడు,మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ఢిల్లీలోనీ నాంగ్లోయ్ జాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రోహిత్ చౌదరి తరఫున కాంగ్రెస్ నేతలు సచిన్ పైలట్, వి.హనుమంత రావు, మాణిక్ రావు ఠాక్రే ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడతాడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న యువకుడు, సౌమ్యుడు రోహిత్ చౌదరి కి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ గెలుపుతో రాజ్యాంగ పరిరక్షణ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కులగణ చేసి అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని తెలిపారు. ఢిల్లీలో మౌలికవసతులు శీలాదీక్షిత్ కాలంలో ఉన్నవే ఇప్పటి ఉన్నాయని ఇంకా పెంచాలనే ఆలోచన రెండు ప్రభుత్వాలు చేయ లేదన్నారు. తెలంగాణలో రెండులక్షల రుణమాఫీచేశామని, రైతుభరోసా ఇచ్చామని కరెంటుఉచితంగా ఇస్తున్నామని ఆరు గ్యారెంటీలను ఏకరువుపెట్టినారు.

# ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూలసిద్ధాంతం

## వివేక్ వ్యతిరేకించడం పార్టీకి విరుద్ధం

## ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతం వివేక్ కానీ ఇంకెవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీకి విరుద్ధంగా వ్యవ హరించడమే అని ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎలాంటి ఆందోళన చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మాదిగ రిజర్వేషన్ ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకంగా ఎవరు మాట్లా డినా చర్యలు తప్పవు. వివేక్ మీటింగ్‌లు పెడుతున్నారని తెలిసిందని, అది మానుకోవాలని హితవు చెప్పారు. మాదిగల కోసం సిఎం రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించిన ఏకైక ముఖ్యమంత్రి అని సంపత్ గుర్తు చేశారు. ఏకపక్ష కమిషన్ రిపోర్టు రాగానే తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. మాదిగ సమాజిక వర్గానికి న్యాయం చేస్తాం అని హరీష్‌రావు కేటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఉషామెహ్రా కమిషన్ రిపోర్టును ఢిల్లీకి తీసుకోదాం అని నేను అసెంబ్లీలో అంటే పదేళ్ల బిఆర్ ఎస్ నాయకులు నోరు మెదపలేదని గుర్తుచేశారు. అసెంబ్లీలో ఇప్పటికే రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. వర్గీ కరణ అమలు దిశగా కేబినెట్ సబ్‌కమిటీ కూడా వేశారని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

## బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందజేయాలి అని బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇల్లులేని పేదలు 1లక్ష 90వేల దరఖాస్తులు వస్తే నియోజకవర్గం నుండి సుమారు 70 వేలకుపైగా దరఖాస్తులు వస్తే కేవలం 3,500 ఇల్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులను ఎలా గుర్తిస్తారు. దానికి సంబంధించిన పూర్తి ప్రణాలికను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. రేషన్‌కార్డు జారీలపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# విలువలతో కూడిన విద్యను అందించాలి

## జడ్పీ పాఠశాల వార్షికోత్సవాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని ఐటీ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పోచారం మున్సిపాలిటీ ప్రతాప సింగారంలో జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని అన్నారు. అనతికాలంగా విద్యావ్యవస్థలో గల లోపాలను గుర్తించామని వాటిని సవరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా ఎదగాలని అన్నారు. ప్రైవేటు విద్యలో ఇంటర్ విద్యార్థులే విద్యబోధనలు చేస్తారని అదే ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు బోధనలు చేస్తారని అన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యతతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందించడానికి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. భవిష్యత్తు అంతా చదువుకున్న యువతదేనని విద్య ద్వారానే ఉన్నత ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని సంప్రదాయం స్త్రీని పూజించేది భారతదేశం ఒక్కటేనని అన్నారు. సమాజ ప్రగతికి మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని తెలిపారు. అప్పట్లో సరియైన వసతులు లేకున్నా పట్టుదలతో శ్రమించి విద్యనభ్యసించినట్లు తెలిపారు. భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడానికి కష్టపడి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపిం చారు. అంతకు ముందు వేదికపై పాఠశాల విద్యా ర్థులచే ప్రదర్శించబడిన సంస్కతిక కార్యక్రమాలు ఆలరించాయి. మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సిహెచ్. మల్లారెడ్డి, యశస్వినీరెడ్డి, మఖన్ సింగ్ ఠాగూర్, డీఈవో విజయకుమారి, తహ సీల్దార్ రజిని, విద్యాశాఖ డైరక్టర్లు నర్సింహ రెడ్డి, రమేశ్‌లు, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు వై. సుదర్శన్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కందుల కుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతాప సింగారంలో జరిగిన జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నర్సరీలో ఆధునిక వంగడాల గురించి తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

# మిద్దె తోటలను ప్రమోట్ చేస్తున్నాం

## 17వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 30, ప్రభాతవార్త:** పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు చెట్లు పెంచుకునేలా సబ్సిడీ అందిస్తూ ఈ ఏడాది నుంచి టెర్రస్ గార్డెన్‌లను ప్రమోట్ చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా లో 17వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టికల్చర్‌షో ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహిస్తున్నామని ప్రకటించారు. ఏమాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనంగా ఉండేలా మొక్కలు పెంచాలని మంత్రి పిలుపు నిచ్చారు. కాలుష్యం నుంచి ఉపశమనం పొందడానికి రూఫ్ గార్డెన్, వర్టికల్ గార్డెన్స్ ఇలా ఇంటి నిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామన్నారు. నర్సరీ ప్రేమికుల కోసం దేశ విదేశాల నుంచి అరుదైన మొక్కలు,విత్తనాలు తీసుకు వచ్చి ఒక వేదికగా నర్సరీ మేళాలో అందించడం అభినందనీయమన్నారు. నర్సరీ మేళా ఇంచార్జి ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ నర్సరీ మేళాలలో దేశ విదేశాల నుంచి 150 స్టాల్స్ లో అందమైన పూల మొక్కలు తక్కువ ధరతో పాటు లక్షల రూపాయల ఖరీదైన మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ ఆఫీసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



బిసి విద్యార్థుల సమర శంఖారావం సభలో అభివాదం చేస్తున్న అఖిలపక్ష పార్టీల నేతలు, బిసి సంఘాల నేతలు

# ఫీజు రీయిబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే సెక్రటేరియట్ ముట్టడిస్తాం

## బిసి విద్యార్థుల సమరభేరి సభలో అఖిలపక్ష పార్టీల, బిసి సంఘాల నేతల హెచ్చరిక

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 30, ప్రభాతవార్త:** విద్యార్థుల త్యాగాలతో వచ్చిన రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని, పది రోజుల్లోగా విద్యార్థుల ఫీజు రీయిబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని అఖిల పక్షాల నేతలు, బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ అధ్యక్షతన బీసీ విద్యార్థుల సమార శంఖారావం మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రం గౌడ్ సమన్వయం చేయగా, బీజేపీ పార్లమెంట్ సభ్యుడు, మాజీమంత్రి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఫీజుల రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు కాదని, అది విద్యార్థుల హక్కని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ, ఫీజుల బకాయిలు 4,600 కోట్లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఖర్చుగా భావించవద్దని, దానిని మానవ వనరుల అభివృద్ధి కోణంలో చూడాలని సూచించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, యేడాది గడిచిపోయిన్నప్పటికీ బీసీ ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించటంలో విఫలమయిందని ఆరోపించారు. పదిరోజుల లోగా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షం వేలాది మంది విద్యార్థులతో సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ విద్యార్థుల బలిదానాలతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం అయిందని, అటువంటి విద్యార్థులను అక్కున చేర్చుకోవలసిన ప్రభుత్వం విద్యార్థుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆరోపించారు.

# ఉపాధి హామీ కూలీకి వెళ్లిన తల్లీ, కూతురు దుర్మరణం

## గోవర్ధనగిరిలో విషాదం

**అక్కన్నపేట, జనవరి 30, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గోవర్ధనగిరిలో గురువారం తీవ్రవిషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం ఉపాధి హామీ కూలీకి వెళ్లిన తల్లి, కూతురు కందారపు సరోజన (45), అన్నాజీ మమత (28) మాదిరిగానే ఇంట్లో నుండి ఉదయం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీపనికి వెళ్లారు. సంజీవయ్యగుట్ట నుండి వ్యవసాయదారుల బావులకు వెళ్లేందుకు జరుగుతున్న పనులు లోతులో జరుగుతుండడంతో పైనుండి పెద్దపెద్ద బండ రాల్లు ఒక్కసారిగా కింద పనిచేస్తున్న వారిపై పడడంతో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు మహిళా కూలీలు రేణుక, స్వరూప సహా ఐదుగురికి గాయాలైనట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు చనిపోయిన తల్లి, కూతుళ్లను బండ రాళ్ల కింద నుండి అతికష్టం మీద జెసిబి సహాయంతో బయటకు తీశారు. కాళ్లు విరిగిన రేణుక, స్వరూపలను 108లో హుస్నా బాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, సిఐ కొంగ్ర శ్రీనివాస్, ఎస్ఐ విజయ్‌భాస్కర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేసి కేసు నమోదు చేసుకున్నారు.

### ఇద్దరి మృతి ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

మండలంలోని గోవర్ధన గిరిలో ఉపాధి హామీ పనుల్లో ఇద్దరు కూలీలు మృతి చెందిన విషయం పట్ల మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండ సురేఖ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులతో పాటు ఆర్డీవోను ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశిం చారు. జరిగిన ప్రమాదం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో పనులు చేయించవద్దని జిల్లా అధికారులకు వారం క్రితమే అధికారులను మంత్రి సీతక్క చెప్పినా.. పనులు చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మరణించిన, ప్రమాదానికి గురైన కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మంత్రి కొండ సురేఖ జిల్లా కలెక్టర్ మనుచౌరికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతులకు అందిం చాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూడడంతోపాటు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, ఎంజిఎంలో చికిత్స పొందు తున్న మహిళ భర్తకు ఆహారం, వసతి ఇతర సౌకరాలు కల్పించాలని సూచించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎసిపి వాసాల సతీష్



వివిధ రాష్ట్రాల బిసి ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

# బిసిలకు 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** బీసీలకు 2 లక్షల కోట్ల బడ్జెట్తో బీసీ సబ్ ప్లాను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మహిళ విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణవతి ఆధ్వర్యంలో గురువారం కాచిగూడలో వివిధ రాష్ట్రాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం మహిళ విభాగం జాతీయ ప్రధానకార్యదర్శిగా చెరుకుల సుగుణవతిని నియమిస్తూ నియామకపత్రాన్ని ఆర్ కృష్ణయ్య అందజేశారు. ఓబీసీ జాతీయ సెమినార్లు నిర్వహించాలని కోరుతూ ఫిబ్రవరి 6,7 తేదీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, అసోం, పంజాబ్ తదితర రాష్ట్రాల నుండి వేలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ బీసీలకు రాజ్యంగా బద్ధంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరడంలేదని, దేశంలోని బీసీలకు రావాల్సిన హక్కులను కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తుందన్నారు.

తెర

# మేగోటి డైరెక్షన్‌లో 'వరలక్ష్మి శరత్‌కుమార్'

సీనియర్ నటుడు శరత్‌కుమార్ కూతురిగా వెండితెరకు పరిచయమైనా, తన వైవిధ్యమైన నటన, విలన్ పాత్రలతో ఆకట్టుకుంటోంది వరలక్ష్మి. నటిగా సౌతిండియా భాషల్లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని దూసుకుపోతోంది. ఈ క్రమంలో ఆదిపర్వం మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శత్వంలో ఓ తెలుగు సినిమా చేయబోతున్నట్టు సమాచారం. సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సబ్జెక్టు కోసం వరలక్ష్మి శరత్ కుమార్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్‌పాత్ర చేయనుంది. భారీ బడ్జెట్‌తో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీ నటులను




తీసుకోబోతున్నారట. వరలక్ష్మి శరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ ప్రాజెక్టు ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటించనున్నట్టు సమాచారం.

# టివి ఆర్టిస్టుల సంక్షేమం కోసమే 'జీఎస్ హారి ప్యానెల్'

తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 31న జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో జీఎస్ హారి ప్యానెల్ సభ్యులు మేనిఫెస్టో విడుదల చేశారు. తమ జీఎస్ హారి ప్యానెల్ గెలిస్తే.. తెలుగు టెలివిజన్ ఆర్టిస్టులకు పలు ప్రయోజనాలు అమలు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ టీవీ నటుడు విజయ్ యాదవ్ మాట్లాడుతూ, టెలివిజన్ కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా వినోద్ బాల ఆధ్వర్యంలో 27 ఏళ్ల క్రితం మా తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ అసోసియేషన్‌ను ప్రారంభించాము. ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమలు చేశామని ఘనంగా చెప్పగలుగుతున్నాం. మా అసోసియేషన్‌కు మాత్రమే సొంత బిల్డింగ్ ఉంది. వందలాది మంది ఆర్టిస్టుల సమస్యలు పరిష్కరించాం. మెడిక్లెయిమ్ చేయించాము. తెలుగు ఆర్టిస్టులకు మాత్రమే అవకాశాలు ఇవ్వాలనేదే మా ప్రయత్నం. సీరియల్ షూటింగ్ టైమింగ్ విషయాలపై మేము ఒకరికొకరు సపోర్ట్ చేసుకున్నాం. కరోనా సమయంలో చిరంజీవి ట్రస్ట్, అప్పటి మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ల సహకారంతో ఆర్టిస్టులందరికి సహాయం చేశాం. పేద కళాకారులకు పెన్షన్ ఇచ్చాము. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. సమర్థులైన జీఎస్ హారి ప్యానెల్ సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటే టెలివిజన్ కళాకారుల సమస్యలు తీర్చుతూ, సంక్షేమంపై దృష్టిపెడతాము. అని అన్నారు. జీఎస్ హారి ప్యానెల్ నుంచి అధ్యక్ష అభ్యర్థి జీఎస్ హారి మాట్లాడుతూ, నటుడుగా ఒక దశలో నా జీవితం అయిపోయింది అనుకున్న సమయంలో నన్ను ఆదుకుని నా నట జీవితాన్ని నిలబెట్టింది ఈ టెలివిజన్ రంగం. ఈరంగానికి పెద్ద దిక్కుగా మిత్రులు విజయ్ యాదవ్, వినోద్ బాల అందరికి సపోర్టుగా నిలుస్తున్నారు. అర్ధరాత్రి తలపు తట్టిన కూడా ఆదుకునే మంచి మనసున్న వారు. కరోనా సమయంలో పెద్దలు చిరంజీవి, తలసాని శ్రీనివాస్ సహకారంతో ఇంటింటికి నిత్యావసర వస్తువులు అందించే బాధ్యత తీసుకున్నది మన అసోషియేషన్‌ది. నిరంతరం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని గర్వంగా చెప్పగలను. విజయ్ యాదవ్, వినోద్ బాల ఆధ్వర్యంలో నా మీద నమ్మకంతో నాకు అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు.





# గుజరాత్ సిఎంతో మోహన్ బాబు, మంచు విష్ణు

లెజెండరీ నటుడు మోహన్ బాబు, డైనమిక్ స్టార్ విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రేజీ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో పాటుగా ప్రమోషన్స్ కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. ఈ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా కన్నప్ప టీమ్ దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తోంది. ఈ క్రమంలో మోహన్ బాబు, విష్ణు మంచు గుజరాత్ ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ భూపేంద్ర పటేల్‌ని కలిశారు. ఈటూర్‌లో శరత్ కుమార్, ముఖేష్ రిషి, వినయ్ మహేశ్వరి కూడా సందడి చేశారు. ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ అతిథి మర్యాదలకు, పలికిన సాదర స్వాగతాలకు కన్నప్పటీం హృదయపూర్వక కృతజ్ఞతలుతెలిపింది. ప్రముఖ తెలుగు కళాకారుడు రమేష్ గొరిజాల అందమైన పెయింటింగ్‌ను విష్ణు మంచు ముఖ్యమంత్రికి బహూకరించారు. కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోన్న సంగతి తెలిసిందే.

# 'కిల్లర్' మూడో షెడ్యూల్ పూర్తి

శుక్ర, మాటరాని మోనమిది ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్‌ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ మరో సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ "కిల్లర్" సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మూడో షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం 50 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొని, కీలకమైన యాక్షన్, రొమాంటిక్, థ్రిల్లింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలను అద్భుతంగా మిళితం చేస్తూ, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. సరికొత్త సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమా మెమొరబుల్ ఎక్స్పీరియన్స్ ఇవ్వనుంది. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం టీమ్ త్వరలో రెడీ అవుతోంది. కిల్లర్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నారు. నటీనటులు: జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, చందూ, గౌతమ్, తదితరులు.



# అందంలో తారలకి పోటీ డ్యాజ్లింగ్ దిశా..


దిశా పటాని ప్రధానంగా హిందీ చిత్రాలలో పని చేస్తున్నారు. పటాని తెలుగు చిత్రం లోఫర్‌తో సినీ రంగ ప్రవేశం చేసింది. బయోపిక్‌గా వచ్చిన ఎం.ఎస్ ధోనితో తన మొదటి హిందీ చిత్రం. ఇటీవల పాన్ వరల్డ్ బ్లాక్ బస్టర్ సినిమా కల్కి 2898 ఎడిలో ప్రభాస్ పక్కన నటించింది. ఆమె ఫోర్బ్స్ ఇండియా 2019 సెలబ్రిటీ 100 జాబితాలో కనిపించింది. తాజాగా కొన్ని సిజ్లింగ్ ఫొటోలతో కుర్రాళ్లను ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. 13 జూన్ 1992న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో హిందూ రాజపుత్ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ దిశా పటాని. ఈ ముద్దుగుమ్మ తండ్రి జగదీష్ సింగ్ పటానీ పోలీసు అధికారిగా పని చేస్తున్నారు. తల్లి పద్మ పటాని హెల్త్ ఇన్‌స్పెక్టర్. 13 జూన్ 1992న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో హిందూ రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ దిశా పటాని. ఈ ముద్దుగుమ్మ తండ్రి జగదీష్ సింగ్ పటానీ పోలీసు అధికారిగా పని చేస్తున్నారు. తల్లి పద్మ పటాని హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఈ వయ్యారి అక్క ఖుష్బూ పటానీ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్. ఆమెకి సూర్యాంశ్ పటానీ అనే తమ్ముడు కూడా ఉన్నాడు. లక్నోలోని అమిటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేస్తున్న సమయంలో సినిమా అవకాశం రావడంతో మధ్యలోనే వదిలేసింది. ఈ వయ్యారి అక్క ఖుష్బూ పటానీ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్. ఆమెకి సూర్యాంశ్ పటానీ అనే తమ్ముడు కూడా ఉన్నాడు. లక్నోలోని అమిటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేస్తున్న సమయంలో సినిమా అవకాశం రావడంతో మధ్యలోనే వదిలేసింది. 2013లో ఇండోర్ వేదికగా జరిగిన పాండ్స్ ఫెమినా మిస్ ఇండియా వేడుకలో మొదటి రన్నరప్‌గా నిలిచింది ఈ వయ్యారి. 2015లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన తెలుగు యాక్షన్ డ్రామా సినిమా లోఫర్‌తో చలనచిత్ర అరంగేట్రం ఈ వయ్యారి భామ. 2013లో ఇండోర్ వేదికగా జరిగిన పాండ్స్ ఫెమినా మిస్ ఇండియా వేడుకలో మొదటి రన్నరప్‌గా నిలిచింది ఈ వయ్యారి. 2015లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన తెలుగు యాక్షన్ డ్రామా సినిమా లోఫర్‌తో చలనచిత్ర అరంగేట్రం ఈ వయ్యారి భామ. 2016లో సుశాంత్ సింగ్ హీరోగా ఎం.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీలో ఓ కీలక పాత్రలో నటించింది ఈ అందాల తార. ఇటీవల తెలుగు ఇండియన్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ డిస్టోపియన్ చిత్రం కల్కి 2898 ఏడిలో ప్రభాస్ పక్కన ఆకట్టుకుంది. 2016లో సుశాంత్ సింగ్ హీరోగా ఎం.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీలో ఓ కీలక పాత్రలో నటించింది ఈ అందాల తార. ఇటీవల తెలుగు ఇండియన్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ డిస్టోపియన్ చిత్రం కల్కి 2898 ఏడిలో ప్రభాస్ పక్కన ఆకట్టుకుంది. ప్రస్తుతం సూర్య హీరోగా తెరకెక్కుతున్న కంగువ అనే ఓ తమిళ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తుంది ఈ బ్యూటీ.






# యూవీ క్రియేషన్స్ విటి15 వర్కింగ్ టైటిల్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా యంగ్ అండ్ టాలెటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ ఓ సినిమా రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇండోకొరియన్ హారర్ కామెడీ జానర్‌లో రానుంది. విటి15 వర్కింగ్ టైటిల్‌తో వరుణ్ తేజ్ 15 సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ వియత్నాంలో శరవేగంగా జరుగుతోంది. హీరో వరుణ్ తేజ్, డైరెక్టర్ మేర్లపాక గాంధీతో పాటు నిర్మాతలు వియత్నాంలో అద్భుతమైన లొకేషన్స్ ను చూస్తున్నారు. అలాగే స్క్రిప్ట్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి మార్చి మొదటి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. వరుణ్ తేజ్‌తో చేయబోతున్న ఈ సినిమా కోసం డైరెక్టర్ మేర్లపాక గాంధీ యూనిక్ స్టోరీలైన్‌ను డిజైన్ చేశారు. సరికొత్త జానర్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ ఇప్పటి వరకు కనిపించని సరికొత్త మేకోవర్‌తో స్క్రీన్ పై మెస్మరైజ్ చేయనున్నారు. ఇప్పటికే ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు అద్భుత మైన సంగీతం అందించిన ఎస్ఎస్ తమన్ ఈ సినిమాకు సంగీతం అందించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. తారాగణం: వరుణ్ తేజ్, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: మేర్లపాక గాంధీ, నిర్మాతలు: యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్.




# 'మజాకా' బ్యాచ్‌లర్ యాంథమ్ రిలీజ్

ఎన్నో చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ కెరీర్‌లో మైల్‌స్టోన్ మూవీ (30వ సినిమా)గా రాబోతున్న చిత్రం 'మజాకా'. 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి తన సత్తా చూపించిన డైరెక్టర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి విజయవంతమైన చిత్రాల రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ కథ, కథనం, మాటలు అందించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటుడు రావురమేష్‌కు జోడీగా 'మన్మధుడు' ఫేం అన్షు నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ముఖ్యంగా రావు రమేష్, సందీప్ కిషన్ మధ్య వచ్చే సీన్స్ థియేటర్లలో ప్రేక్షకులకు పొట్టచెక్కలయ్యేలా ఉన్నాయి. ఫిబ్రవరి 21న రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా నుంచి మొదటి పాట బ్యాచ్‌లర్ యాంథమ్‌ను విడుదల చేశారు మేకర్స్. బ్యాచ్‌లర్స్ జీవితంలో ఉండే స్ట్రగుల్స్, జాయ్స్‌ను హైలైట్ చేసేలా ఉన్న ఈ సాంగ్ కుర్రాళ్లకు చార్ట్‌బస్టర్ కానుంది. పాపులర్ రైటర్ రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాట కుర్రాళ్లకు ఎవర్‌గ్రీన్ ఫేవరెట్ కానుంది. ఈ పాటలో బ్యాచ్‌లర్స్ తమ జీవితంలో పడే వంట కష్టాలు, సింగిల్ షాపింగ్ ట్రిప్స్ వంటి వాటిని చాలాబాగా ఎలివేట్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ధనుంజయ్ సీపాన ఎంతో హుషారుగా ఆలపించారు. కుర్రాళ్లందరికీ కనెక్ట్ అయ్యేలా తన గాత్రంతో కట్టిపడేశారు. లియోన్ జేమ్స్ అందించిన సంగీతం పాటకు మరింత ప్లస్ అయింది. రఘు మాస్టర్ అందించిన స్టెప్పులతో ఈ పాట సినిమాలో హైలైట్‌గా నిలవనుంది. ఈ పాటను సందీప్ కిషన్‌రావు రమేష్‌లపై వైజాగ్ బీచ్‌లో చిత్రీకరించారు. తండ్రీకొడుకుల బ్యాచ్‌లర్ జీవితంలో ఎత్తుపల్లాలను కళ్లకు కట్టినట్లు చూపించేలా తీశారు. వారిద్దరి ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను పడిపడినవ్వేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు ఈ బ్యాచ్‌లర్ యాంథమ్ బ్లాక్‌బస్టర్ బిగినింగ్‌లా చెప్పొచ్చు. తారాగణం: సందీప్ కిషన్, రీతు వర్మ, రావు రామేష్, అన్షు. సాంకేతిక బృందం: దర్శకుడు: త్రినాధరావు నక్కిన, బ్యానర్స్: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియో, నిర్మాతలు: రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్, కథ, కథనం, డైలాగ్స్: ప్రసన్న కుమార్ బెజవాడ, సహ నిర్మాత: గుట్ట బాలాజీ, లైన్ ప్రొడ్యూసర్: పాపూరి కిరణ్, సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: నిజార్ షఫి, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మకడలి, స్టంట్స్: పృథ్వీ, పీఆర్వో: వంశీ శేఖర్, డిజిటల్: హ్యాష్‌ట్యాగ్ మీడియా.



# ఒంపు సొంపుల్లో సొగసరి పాయల్ రాజ్‌పుత్ !

అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ఎక్స్ 100 సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది పాయల్. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో పాయల్ తన నటనతో పాటు అందంతో కవ్వించింది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోయి నటించింది. తొలి సినిమాలోనే ఈ అమ్మడు ఆ రేంజ్‌లో అందాలు ఆరబోయడం, రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోవడంతో కుర్రకారు ఫిదా అయ్యారు. 5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ యాక్టింగ్‌లో డిప్లొమా చేసింది. అలాగే ప్రముఖ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ భామ. 5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ యాక్టింగ్‌లో డిప్లొమా చేసింది. అలాగే ప్రముఖ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ భామ. తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న ఈ బ్యూటీకి చిన్నతనం నుంచే నటనపై ఆశక్తితో గ్రాడ్యు యేషన్ తర్వాత చిత్రసీమలో అడుగు పెట్టింది. ముందుగా బుల్లితెరపై తన కెరీర్ మొదలుపెట్టింది ఈ వయ్యారి భామ. తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న ఈ బ్యూటీకి చిన్నతనం నుంచే నటనపై ఆశక్తితో గ్రాడ్యుయేషన్ తర్వాత చిత్రసీమలో అడుగు పెట్టింది. ముందుగా బుల్లితెరపై తన కెరీర్ మొదలుపెట్టింది ఈ వయ్యారి భామ. 2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్‌లో సోనాక్షిగా టెలివిజన్‌లో తన కెరీర్‌ని ప్రారంభించింది. ఆఖిర్ బహు భీ తో బేటీ హీ హై సీరియల్‌లో సియా అనే ప్రధాన పాత్రను పోషించింది. గుస్తాఖ్ దిల్, మహాకుంభ్: ఏక్ రహస్యా, ఏక్ కహానీ సీరియల్స్‌లో నటించింది. 2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్‌లో సోనాక్షిగా టెలివిజన్‌లో తన కెరీర్‌ని ప్రారంభించింది. ఆఖిర్ బహు భీ తో బేటీ హీ హై సీరియల్‌లో సియా అనే ప్రధాన పాత్రను పోషించింది. గుస్తాఖ్ దిల్, మహాకుంభ్: ఏక్ రహస్యా, ఏక్ కహానీ సీరియల్స్‌లో నటించింది. 2017లో చన్నా మేరేయా అనే ఓ పంజాబి చిత్రంలో కథానాయకిగా ప్రధాన పాత్రలో సీని అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. 2018లో వీరేకి వెడ్డింగ్ అనే ఓహిందీ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయింది ఈ భామ. 2017లో చన్నా మేరేయా అనే ఓ పంజాబిచిత్రంలో కథానాయకిగా ప్రధానపాత్రలో సీని అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ.



# ఏకైక మహిళా కమాండర్ ..

రితికా ఖరేటా... ఢిల్లీలోనే పుట్టి పెరిగిన తను, ఇప్పుడు అదే రోడ్లమీద మార్చ్ కంటింజెంట్ కమాండర్‌గా ఉంటుందని ఊహించలేదు. అదీ అత్యంత టెక్నికల్ నైపుణ్యాలు కలిగిన 146 మంది సైనికులతో కూడిన 'ఆర్మీ కార్ప్స్ సిగ్నల్ టీం'కి నాయకత్వం వహిస్తుంది. అనుకోలేదట. నాన్న ఢిల్లీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, అమ్మ టీచర్. తండ్రి ప్రేరణతో ఆర్మీలోకి ప్రవేశించింది రితికా. ఆర్మీనెట్ వర్క్ సైబర్ వెల్ఫేర్, ఎలక్ట్రానిక్ వారెఫేర్... ఈ టీమ్ బాధ్యతలు. 'ఎర్రకోట వద్ద మేము మార్క్ ఫాస్ట్ చేయడం ఇదే మొదటిసారి. కెప్టెన్‌గా నా నాయకత్వాన్ని నమ్మి, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆర్మీకి కృతజ్ఞతలు. ప్రతి ఒక్క అమ్మాయీ కలలు కనాలి. దానికోసం శ్రమించాలి. మొత్తం పూర్తిగా వినియోగించుకోవాలే కానీ, అసాధ్యమైనది ఏదీ లేదు. భారత ఆర్మీ మహిళలను స్వాగతించడమే కాదు, వాళ్లను సాధికారత వైపు నడిపిస్తోంది అంటూ భావోద్వేగానికి గురైంది రితిక.




సిగ్నల్ ట్రైనింగ్ సెంటర్(ఎస్టీసీ) నుంచి షార్ట్‌స్ట్ అయిన 12మంది ఆఫీసర్లలో రితికకు ఈ అవకాశం దక్కిం దంటే, ఈ టీమ్ 146మందిలో ఏకైక మహిళ రితికనే కావడం విశేషం.


# వందేభారత్ రైలు నడిపిన తొలి మహిళ

**ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా.. రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ఖఎట్ హోమ్ రిసెప్షన్‌ఖ పేరుతో ప్రత్యేక విందును ఏర్పాటుచేయడం అనవాయితీ రాజకీయ ప్రముఖులతో పాటు దేశవ్యాప్తంగా ఆయా రంగాల్లో రాణిస్తూ గుర్తింపు సంపాదించుకున్న కొద్దిమందిని ఈ విందులో పాల్గొనాల్సిందిగా స్వయంగా రాష్ట్రపతే వారికి ఆహ్వానం పంపుతారు.** అలా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రోజున జరగనున్న ఈ ప్రత్యేక విందులో పాల్గొనే అవకాశం దక్కించుకుంది రితికా టిర్కీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా . ప్రారంభించిన ఖవందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ఖ రైలుకు తొలి మహిళా లోకోపైలట్గా ఎంపికై చరిత్ర సృషించిందామె. ప్రతిభ, పట్టుదల ఉంటేపురుషాధిపత్యం ఉన్న రంగాల్లోనూ మహిళలు " దూసుకుపోవచ్చని నిరూపించింది. రితిక ఇప్పుడు రాష్ట్రపతి ఆహ్వానం అందుకొని మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ గిరి పుత్రిక గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా గుర్తింపు పొందిందిది. గంటకు గరిష్టంగా 180 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లే ఈ రైలు నడపాలంటే ఎన్నో ఏళ్ల పూర్వానుభవం ఉండాలి. అయితే లోకో పైలట్ కేవలం ఐదేళ్ల పూర్వానుభవంతోనే ఈ బుల్లెట్ రైలు నడిపే సువర్ణావకాశాన్ని దక్కించుకుంది 27 ఏళ్ల రితిక. గతేడాది టాటానగర్ పాట్నా నగరాల మధ్య ప్రారంభమైన వంద భారత్ రైలుకు అసిస్టెంట్ లోకో పైలట్ నియమితురాలైన ఆమె.. ఈ బుల్లెట్ రైలు నడిపిన తొలి మహిళా లోకో పైలట్‌గా చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఇదే హోదాలో కొనసాగుతోంది ఫస్ట్ ఉమన్.

**షంటర్ టు లోకోపైలట్:** జార్ఖండ్‌లోని ఓ గిరిజన తెగకు చెందిన రితిక చిన్నతనం నుంచి చాలా చురుకైన అమ్మాయి. చదువులో, ఇతర వ్యాపకాల్లో ముందుండేది. అందరిలా ఏదో ఒక ఉద్యోగం వస్తే చాలనుకోకుండా.. పురుషాధిపత్యం ఉన్న రంగాల్లోనే కెరీర్‌ను వెతుక్కోవాలని నిర్ణయించుకుందామె, "BIT-Mesra"లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాక.. భారతీయ రైల్వేలో లోకో పైలట్!! 'బిఐటిమేరా'లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాక.. భారతీయ రైల్వేలో లోకోపైలట్‌గా స్థిరపడనుంది. అనుకుంటే 2019లో ఆగ్నేయ రైల్వేకు చెందిన చక్రధర్‌పూర్ డివిజన్‌లో షంటర్ (రైలు నుంచి వేరు చేసిన ఇంజిన్, ప్యాసింజర్ కోచ్‌లను డిపోకు తరలించడం) కెరీర్ ప్రారంభించింది. ఆపై గూడ్స్, ప్యాసింజర్ రైళ్లనూ నడిపింది. ఆమె కోరుకునే లోకో పైలట్‌గా మరిన్ని నైపుణ్యాలు సొంతం చేసుకున్న రితిక.. 2021లో టాటానగర్‌కు బదిలీ అయింది. అక్కడే ఆమెకు సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్‌గా పదోన్నతి కల్పించారు. ఇలా తన ప్రతిభా పాటవాలతో ఐదేళ్లలోనే ఉన్నత స్థాయికి చేరుకున్న రితిక గతేడాది మరో సువర్ణా వకాశం అందుకుంది. సెప్టెంబర్‌లో టాటానగర్‌పాట్నాల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది ప్రభుత్వం. ఇందులో భాగంగానే ఈ రైలుకు అసిస్టెంట్ లోకో పైలట్‌గా బాధ్యతలు స్వీకరించాం. నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపిన తొలి మహిళగా గుర్తింపు సంపాదించుకుంది రితిక.

**ఇదో గొప్ప అనుభూతి!** టాటానగర్‌పాట్నా వందేభారత్ రైలు నడిపిన రితిక పేరు ఆ సమయంలో మార్మోగింది. ప్రస్తుతం ఇదే రైలుకు అసిస్టెంట్ లోకోపైలట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. ఈసారి గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఆతిథ్యం స్వీకరించారు. 'రిపబ్లిక్ డే'ను పురస్కరించుకొని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన 'ఎట్ హోమ్ రిసెప్షన్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఆమె పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి పలువురు ప్రముఖులకు ప్రత్యేకంగా విందు ఇస్తారు. రాజకీయ ప్రముఖులతో పాటు ఆయా రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి ఈ విందులో పాల్గొనేందుకు కొన్ని రోజుల ముందుగానే ఆహ్వాన పత్రిక పంపుతారు. అలా ఈసారి ఈ అవకాశం అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందంటోంది రితిక. మాది మధ్య తరగతి కుటుంబం. ఐదుగురు తోబుట్టువుల్లో నేనే పెద్ద. అయినా అమ్మానాన్న నా ఇష్టాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. నచ్చిన రంగంలో రాణించేలా నన్ను ప్రోత్స హించారు. వందేభారత్ రైలు నడిపే సువర్ణావకాశం రావడం గొప్పగా అనిపిస్తోంది. ఇక ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం మరో అనుభూతి నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకున్నప్పుడే మనమేంటో నిరూపించుకోగలుగుతాం.. అంటూ తన మాటలతోనూ నేటి యువతలో స్ఫూర్తి నింపుతోంది.



# విదేశాలకు పల్లె రుచులు !

**పల్లె అమ్మాయి.. ఉరుకులు, పరుగుల జీవితం రుచించలేదు. అందుకే సాఫ్ట్‌వేర్ కొలువును వదిలి కమ్మని వంటకాలపై దృష్టిపెట్టింది. 20 దేశాలకు మన రుచులను పంపుతూ ఆదాయాన్ని అందుకుంటోంది**

చిలువేరు సామితి.



మాది మంచిర్యాల ఏర్పాటు నెన్నెల. నాన్న సత్యనారాయణ చిరువ్యాపారి. బీటెక్ పూర్తయ్యాక హైదరాబాద్ టీసీఎస్‌లో రూ.9 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. రెండేళ్లపాటు చేశా. కోవిడ్‌లో ఇంటి నుంచి పనిచేసేటప్పుడు అమ్మ, అమ్మమ్మ చేసే పచ్చళ్లు, చిరుధాన్యాలతో చేసే లడ్డూల వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను. దేశవిదేశాల్లో ఉన్న తెలుగువారు తమకీ కావాలని అడిగేవారు. ప్రస్తుతం నాకు ఉరుకుల పరుగుల జీవితం నచ్చలేదు. దీనితో 2021లో రాజీనామా చేశా. అప్పుడే విదేశాల్లో ఉన్న తెలుగువారు మన రుచులకు దూరమవుతున్నారని గ్రహించి 'తెలుగు ఫ్లేవర్స్' ప్రారంభించారు. 20 రకాల పచ్చళ్లు, స్నాక్స్, స్వీట్స్, పిండివంటలతోపాటు, మసాలాలు తయారు చేయిస్తున్నా. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీసహా 20 దేశాల్లో స్థిరపడ్డ తెలుగువారి నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. విదేశాల్లో శుభకార్యాలు చేసుకుంటున్నవారూ మమ్మల్ని సంప్రదిస్తున్నారు. ఆర్డర్లు రావడంతో 10 మంది మహిళలను చేర్చుకున్నా. ఒక్కొక్కరికి రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున చెల్లిస్తున్నా. మా ఇల్లే తయారీ కేంద్రం. తయారీ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తారు. వాటితోనూ ఆర్డర్లు వస్తున్నాయి. కలుషితంలేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి. మా సంస్థకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నది నా కోరిక. ముఖ్యంగా చిరుధాన్యాలతో వాటిని ప్రజలకు చేరువ చేయాలన్నది నా ధ్యేయం.

# విడిపోయి కలుస్తున్నారు !

**భార్యా భర్తలన్నాక గొడవలు సహజం.** కానీ వాటిని ఎలా పరిష్కరించు కుంటున్నారు. అన్నదానిపైనే దాంపత్య జీవితం ఆధారపడి ఉంటుంది. కోపంలో ఒకరినొకరు కసురుకున్నా... ఉదయం అయ్యేసరికి పరిస్థితుల్ని చక్కబెట్టుకుంటేనే బంధం బలపడేది. కానీ ఇప్పటి వరకు ఉన్నారు. చిన్నచిన్న విషయాల్ని తెగేదాకా లాగుతున్నారు. అవే చినికిచినికి గాలివానగా మారి విడి పోవడానికి కారణమవుతున్నాయి.. ఇకపై ఇలా కాకూడదంటే తీసుకోమంటున్నారు నిపుణులు. అదేంటంటే...



✦ చెడమడ తిట్టుకుని కలిసి ఒకేచోట ఉండాలంటే కోపం మరీ పెరిగిపోతుంది. అందుకే నిద్రపోయేటప్పుడు ఉండ మంటున్నారు నిపుణులు. దీనివల్ల మనసు కుదుటపడి అవతలి వాళ్ల వెర్షన్ని అర్థం చేసుకునే సమయం దొరుకు తుందట. పైగా మంచినిద్ర మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. రోజును తాజాగా ప్రారం భిం చేందుకు ఇది అందు బాటులోకి వచ్చింది. ✦ చాలామంది మగవాళ్లు ఎంత పెద్ద గొడవైనా, ఏం జరగనట్లు నడుచుకుంటుం టారు. ఆడవాళ్లు సుల భంగా దేన్నీ మరచి పోలేరు. అయితే అన్ని సార్లు ఈ పద్ధతి మంచిది కాదు. ఆ కోపం తగ్గాలంటే ఒంటరిగా ఒక రాత్రి గడవడమే మేలట. ✦ గొడవ అయ్యాక చాలామంది బాధపడుతూ కూర్చుంటారు. అవతలి వాళ్లేమో నిద్రపోతుంటారు. అది ఇంకా మనలో ఒత్తిడినీ, కోపాన్నీ పెంచేస్తుంది. అందుకే వాళ్లకి కాస్త దూరంగా ఉంటే వేరే వ్యాపకాలమీదకు మనసు మళ్లుతుందట. చిన్నచిన్న కారణాలతో విడాకులు తీసుకుని జీవితాంతం విడిపోయే బదులు, ఇలా కాస్త ఎడబాటుగా ఉండి ఎవరికి వాళ్లు సమయం ఇచ్చుకోవడం మంచిదేమో కదా. పైగా మిలీనియల్స్ ఈ ట్రెండ్ ఫాలో అవడానికి ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారట.

# కాబోయే అమ్మకు జాగ్రత్తలు..

**కడుపులో పెరుగుతోన్న బిడ్డ ఎదుగుదల గురించే అనుక్షణం ఆలోచిస్తుంటుంది. కాబోయే అమ్మ మనసు. ఈ క్రమంలో దగ్గర్నుంచి వ్యాయామాల వరకు.. ప్రతి అంశంలోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే అంటున్నారు నిపుణులు.**



గర్భస్థ సమయంలో బిడ్డ ఎదుగుదలకు ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన మాంసాహారం తినడం మంచిదే! అయితే వీటిని బాగా ఉడికించుకొని తీసుకోవాలి. అప్పుడే అవి త్వరగా, సులభంగా జీర్ణమవు తాయి.


✦ఆహారం ఏ పూటకు ఆ పూటే వేడి వేడిగా వండుకొని తీసు కోవాలి. ఉదయం వండినవి. సాయంత్రం, రాత్రి వండినవి మరుసటి రోజు వేడి చేసుకొని తినకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.

✦గర్భస్థ సమయంలో మహిళలు పెరిగే బరువు ఆరోగ్యకరంగా ఉండాలి. నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకుంటూ ఈ సమయంలో జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, చిప్స్, బిస్కట్స్.. వంటి వాటికి దూరంగా ఉండాలి. అలాగే స్వీట్స్ కూడా పూర్తిగానే తీసుకోవాలి.

✦ రోజూ తాగే నీళ్లు కూడా కాచి చల్లార్చినవైతే మరీ మంచిదంటున్నారు నిపుణులు. అలాగే శరీరంలో తేమ స్థాయిలు తగ్గకుండా కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. ఫలితంగా ఉమ్మనీరు తగ్గకుండా జాగ్రత్తపడచ్చు. గర్భిణిగా ఉన్న సమయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి నిపుణుల సలహాలు తీసుకుంటే.. యోగా, నడక వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే శరీరం యాక్టివ్‌గా ఉంటుంది.

# ఎదుటివారి మాట వినండి..

మన పని మనం చేసుకుపోదాం. చాలామంది ఉద్యోగినుల ధోరణి అలాగే ఉంటుంది. అనవసర వివాదాల్లో దూరతామేమో అన్న భయం ఒకటే. పని ముగించుకుంటే త్వరగా బయటపడొచ్చు అన్న ఆలోచన మరొకటిందా. సందేహం అడిగితే ఏమీ తెలియదు అనుకుంటారు. ప్రశ్నిస్తే పొగరుగా బావిస్తారు ఇలా లోలోపలే బోలెడు ఊహించుకుంటారు. కానీ ఈ తీరే వారిని ఎనగకుండా ఆపుతుంది. మీదీ అనే వరసైతే బ్రాండింగ్ తప్పనిసరి అంటే మేకోవర్. దుస్తుల్నీ, హెయిర్‌స్టైల్‌లో మార్చమని కాదు... మీ పూర్తి ఇమేజింగ్ మార్చుకోమని అర్థం. అడగండి... ప్రమోషన్ కానీ, ఫైనాళ్ల మెచ్చుకోలు కానీ రానప్పుడు నిరాశ సహజమే కానీ ఎందుకు రావట్లేదు. అన్న ప్రశ్న వేసుకోండి. అయితే దీనికి మాత్రం మీరే సమాధానం ఇవ్వవద్దు. ఎందు కంటే.. ఫలానా అమ్మాయి నా గురించి చెడుగా చెప్పిందేమో, నేనెక్కడ ఎదిగి పోతానో అని వల్ల ఇలా మనమంటే పడనివారి మీదకే దృష్టి వెళ్తుందట. వాటివల్ల ప్రయోజనం లేకపోగా వర్థం అందుకే మీ పనితీరు తెలిసినవారిని అడగండి వాళ్లైతే మీ లోపాలు కచ్చితంగా చెబుతారు. ఉద్యోగి ఇలాగే చేస్తే ఆమెకేం సలహాలొచ్చాయో తెలుసా! పని చేస్తావు కానీ... అభిప్రాయాలు చెప్పవు ఎప్పుడూ దీనంగా ముఖం పెట్టుకుని ఉంటావు... దీనితో నీతో పని చేయాలని పించదు. వ్యక్తిగత శుభ్రత పాటించు... అంటూ సలహా లొచ్చాయట. అసలీ కోణాలూ మనపై ప్రభావం చూపు ఊహించ గలమా? కొన్ని సార్లు చిన్న అంశాలూ పెద్ద సమస్య అవుతాయనడా నికి ఇది ఉదాహరణ కాబట్టి, ఏ మార్పు అవసరమో అడిగి తెలుసుకోండి. చెప్పినవన్నీ మార్చుకోవాలనేం లేదు. కానీ కొన్నింటినైనా ప్రయత్నించొచ్చు. అప్పు డు నెమ్మదిగా మీలో మార్పు మొదలవు తుంది. చుట్టుపక్కల వాళ్లూ దాన్ని గమని స్తారు. ఒక పరిశోధన ప్రకారం... ఒక పదిని అక్క మగ ఇద్దరూ చేస్తున్నప్పుడు... ఆడవాళ్ల నుంచేఎక్కువ ఫలితం ఆశిస్తారట. మీ సాయి వాళ్లూ అలాగే ఆలోచిస్తుండొచ్చు. కాబట్టి, వాళ్లతోనూ మాట్లాడండి మీ నుంచి ఏమేం ఆశిస్తున్నారో తెలుసుకోండి అయితే వాటిలో సాధ్యా సాధ్యాలు మనిషివి అప్పుడే చెప్పండి. మనకి ఇంటి బాధ్యతలు అదనం. వాటిని గుర్తు చేస్తే ఈ ఆశించడం తగ్గుతుంది అయితే ఒక్కసారి మాట్లాడి ఇబ్బందులన్నీ చెప్పడంతో సమస్య తీరుతుంది. ఎవరికి లేదు. సాధన చేయాలి. నో చెప్పాలి అదంతా నిరంతర ప్రక్రియ, అయితే ఎవరినో అనుపరించొద్దు, అనుకరించొద్దు. గంగలా మాట్లాడలేరా అయితే ఎదుటివారు చెప్పేది వినండి. మీటింగుల్లో కదిలించవ నర్లేదు..కానీ,అవసరమైన సందేహాలు అడగొచ్చు.



# 'పింక్ ఐ' అంటే ..

సాధారణంగా మేకప్ వేసుకునే కంటికి సంబంధించిన మేకప్ ఉత్పత్తుల్లోని అవశేషాలు, రసాయనాలు కంటికి అనుకూలంగా పేరుకుపోతాయి. ఇక రాత్రి పూట కూడా దాన్ని తొలగించకుండా అలాగే పడుకోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఇది అప్పటికప్పుడు ప్రతికూల ప్రభావం చూపకపోయినా కొన్ని రోజుల తర్వాత కళ్లలో దురద, ఎరుపెక్కడం.. వంటి కంటి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. అంతేకాదు.. దీర్ఘకాలంలో ఇది 'పింక్ ఐ' (కంటి చుట్టూ వాపు/ఇన్ఫెక్షన్ రావడం) సమస్యకు దారితీసే ప్రమాదమూ లేకపోలేదంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు మేకప్ ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిదని చెబు తున్నారు. అలాగే పడు కునే ముందు ఐ మేకప్ తొలగించుకోవాలి.



**కళ్లలోకి వెళ్లకుండా.....** కంటికి మేకప్ వేసుకోవడానికే కాదు.. తొలగించడానికీ ప్రస్తుతం మార్కెట్లో విభిన్న సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటితో పని లేకుండా ఇంట్లోనే సులభంగా కంటి మేకపన్ను తొలగించుకు నేందుకు బోలెడన్ని మార్గాలున్నాయి.

✦ సాధారణ మేకప్ తొలగించుకునేందుకు ఉపయోగించే కొబ్బరి నూనె కంటి మేకప్ తొలగించడానికి ఉపయోగపడుతుంది. ముందు గా కాటన్ ప్యాడ్‌పై కొన్ని చుక్కల కొబ్బరి నూనె వేసి.. దాన్ని కనురెప్పలు, కంటి చుట్టూ చర్మంపై నెమ్మదిగా రుద్దుతూ మేకప్ ను తొలగించు కోవాల్సి ఉంటుంది. ఈ కనురెప్పల వద్ద కాటన్ స్వాబ్ ఉపయోగిస్తే.. మేకప్ కంటి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తపడచ్చు.

✦ జెల్/పౌడర్/క్రీమ్ ఆధారిత మేకప్ ఉత్పత్తులను పూర్తిగా తొలగించడంలో పెట్రోలియం జెల్లీ కీలక పాత్ర ఈ కొద్దిగా జెల్లీ కంటి చుట్టూ అప్లై చేసి.. చూపుడు వేలితో గుండ్రంగా రుద్దుతూ మేకప్ తొలగించుకోవాలి. ఆపై గోరువెచ్చటి నీటిలో ముంచిన కాటన్‌తో ఆ ప్రదేశంలో తుడిచేస్తే సరిపోతుంది.

✦ కొద్దిగా బేబీ ఆయిల్ను కాటన్ ప్యాడ్పై వేసి.. దానితో కళ్ల చుట్టూ నెమ్మదిగా, గుండ్రంగా రుద్దుతూ కూడా మేకప్‌ను సులభంగా తొలగించవచ్చు.



✦ కనురెప్పలకు అప్లై చేసుకున్న మస్కారాను తొలగించుకునేలా మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు భావిస్తున్నారు. ఈ కాటన్ స్వాబ్‌గా కొబ్బరి నూనె/ బేబీ ఆయిల్లో ముంచి.. దానితో మస్కారా అప్లైట్లుగా చేసుకున్న కింది నుంచి పై దిశగా మేకప్ను తొలగించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా మస్కారా పూర్తిగా తొలగిపోవడంతో పాటు కంట్లోకి వెళ్లకుండా కూడా ఉంటుంది.

✦ మేకప్ బ్రష్లను శుభ్రం చేయకపోయినా కంటి సంబంధిత ఇన్ఫెక్షన్లు తప్పవంటున్నారు నిపుణులు. అందుకే వాటిని వాడిన ప్రతిసారీ బేబీ వాష్, లిక్విడ్ సోప్తో శుభ్రం చేసి.. పొడిగా ఆరబెట్టాలి. ఇక వాటి బ్రిజిల్స్ పాతబడిపోతే.. వెంటనే మార్చేయడం లేదంటే కొత్త బ్రష్లను కొనడం మంచిది. ముఖానికి పట్టించినట్లే కొందరు కంటికీ దట్టంగా మేకప్ వేస్తుంటారు. దానివల్ల కంటి సమస్యల్ని కోరికోరి కొని తెచ్చుకున్నట్లే కాబట్టి ఐ మేకప్ ఎంత సింపుల్‌గా, తక్కువగా వేసుకుంటే అందం అంతగా ఇనుమడిస్తుంది.. కంటి సమస్యలు రాకుండానూ జాగ్రత్తపడచ్చు. ఒకవేళ ఈ సమస్యలు మరీ తీవ్రమైతే మాత్రం నిపుణులను సంప్రదించడం మర్చిపోవద్దు!


# సకల విద్యా దాత్రి

ఆధ్యాత్మికం

**దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటిక మణిని భైరక్షమాలాందధానా హస్తేనైకేన పద్మం..** అన్నారు వీణాపాణి నాలుగు చేతుల్లో ధరించే వీణ, పుస్తకం, అక్షమాల, పద్మం సైతం మనకు జ్ఞానబోధ చేయగలవు. సరస్వతి వీణ పేరు కచ్ఛపి అది సృజనాత్మకత, కళలు, భావాలు, భావోద్వేగాలకు ప్రతీక. పుస్తకాలు నాలుగు వేదాలకు సంకేతం. అవి సార్వత్రిక, దైవిక, శాశ్వత, అనువర్తనీయ జ్ఞానాలను సూచిస్తూ అడుగడుగునా మార్గనిర్దేశం చేస్తాయి. అక్షమాల లేదా స్ఫటికమాల ధ్యానాన్ని సూచిస్తుంది. స్వీయ అంతర్దర్శనానికి దారితీసి తద్వారా విచక్షణ కలిగిస్తుంది. అమ్మ చేతిలోని పద్మం దైవత్వాన్ని సూచిస్తుంది. సమస్త విద్యలూ ప్రాప్తింపచేస్తుంది. అమ్మ హంసవాహిని. స్వభావరీత్యా హంస నీటిని వేరుచేసి స్వచ్ఛమైన పాలను గ్రహిస్తుంది. అలాగే బుద్ధిమంతులు చుట్టూ ఉన్న విషయాల్లోంచి మంచిని మాత్రమే గ్రహించాలి. పవిత్ర మాఘ మాసంలో శుద్ధపంచమిన అమ్మ అవతరించిం దని వేదోక్తి. అందుకే ఆ రోజు తెలుపు లేదా పసుపు దుస్తులు ధరించి పూజపీఠంపై పుస్తకాలనుంచాలి. వాటిని అమ్మగా భావించి జ్ఞానప్రాప్తికై షోడశోపచార పూజ చేయాలి. తెల్లటి పూలు, శ్రీగంధంతో అర్చించి క్షీ రాన్నం, రేగుపళ్లు, చెరుకురసాలను నివేదించాలి. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూ పమే వాగ్దేవి. అందుకే అమ్మ సన్నిధిలో అక్షరా భ్యాసం చేయిస్తారు. బెంగాల్లో సరస్వతీ పూజను ఘనంగా నిర్వహిస్తారు. మండ పంలో నెలకొల్పిన మూర్తిని నాలుగు రోజుల తర్వాత నిమజ్జనం చేస్తారు. రాబోయే వసంత రుతువుకు సూచికగా యువజనం మద నోత్సవాన్ని నిర్వహిస్తారు.

# చలిలో నల్లయాలకులు ..

**కొందరికి మెనోపాజ్‌లో భాగంగా చలి ఎక్కువగా అనిపిస్తుంది. అలాంటివాళ్లు నల్లయాలకులు తినండి: మంచి ఉపశమనం లభిస్తుంది అంటున్నారు నిపుణులు...**



రక్తప్రసరణ సవ్యంగా జరగకపోవడమే చలికి ప్రధాన కారణం. నల్లయాలకుల్లో ఉంటే ఫినోలిక్ ఆమ్లం దీన్ని సరిచేస్తుంది. శరీరం మొత్తం రక్తం ప్రవహించేందుకూ, వేడిని ఉత్పత్తి చేయడానికీ నల్లయాలకులు ఉపయోగపడతాయి. అయితే ఘాటు ఎక్కువగా ఉండటంవల్ల వీటిని అందరూ ఇష్టపడతారు. కానీ అత్యవసర సమయాల్లో వీటిని తింటే ఫలితముంటుం దట.హారం నేరుగా తినలేనివాళ్లు టీ, ఆహారంలో చేర్చుకోవచ్చు. 'నేషనల్ ఇనిషి యల్ ఆఫ్ హెల్త్' 2015 అధ్యయనం ప్రకారం... మెటబాలిక్ సిండ్రోమ్‌ను తిప్పికొట్టే డైటరీ ఫైబర్, కార్బోహైడ్రేట్లు నల్లయాలకు ఎక్కువగా ఉంటాయని నిరూపించారు. అంతేకాదు, అక్కడ ఉండే సినీయోల్, టెరిఫినైన్ జీవక్రియను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడటానికి ఉపయోగపడతాయి. అధిక బరువును తగ్గిస్తాయి. వీటి సువాసన మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.

# ఆకుకూరల్లో రారాణి

**ఆకుకూరల్లో బచ్చలి రారాణి అంటే అతిశయం కాదు.** పప్పులో వేసినా, పచ్చిమిర్చి జోడించి పచ్చడి చేసినా, పెరుగు పులుసు చేసినా సూపర్గా ఉంటుంది. ఇది రుచికే కాదు పోషకాల్లోనూ మేటి, ఇ, సి, ఐ, కె విటమిన్లు, క్యాల్షియం, ఫొలెట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, మాంగనీస్‌లతో మంచి పోషకాహారం. బచ్చలికూర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది. చర్మానికి కాంతి వస్తుంది. కుదుళ్లు గట్టిపడతాయి, జుట్టు రాలడం తగ్గుతుంది. ఆందోళన తగ్గుతుంది. మెదడు పనితీరు మెరుగవుతుంది. తరచుగా బచ్చలికూర తినేవారిలో కంటిచూపు బాగుంటుంది. ఇది క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. ఇందులో పీచు విస్తారంగా ఉన్నందున జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. బచ్చలికూరతో చేసే పకోడీలు, బజ్జీలు వంటివి కూడా యమా టేస్టీగా ఉంటాయి.



# అత్యంత చెత్త రికార్డు

## 2 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయిన మేఘాలయ

**ఢిల్లీ:** మేఘాలయ బ్యాటర్లు దారుణ ప్రదర్శన కనబరిచారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ తమ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. ఆరంభంలోనే ముంబై స్టార్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్ వికెట్లను పడగొట్టి దెబ్బతీశాడు. అతడి ధాటికి మేఘాలయ కేవలం 2 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో మేఘాలయ అత్యంత చెత్త రికార్డును తమ పేరిట లిఖించుకుంది. 152 ఏళ్ల ఫస్ట్ క్లాస్ క్రికెట్ హిస్టరీ లోనే తొలి ఆరు వికెట్లకు అత్యల్ప స్కోర్ చేసిన రెండో జట్టుగా మేఘాలయ నిలిచింది. ఈ చెత్త రికార్డు సాధించిన జాబితాలో ఎమ్‌సీసీ క్రికెట్ క్లబ్ అగ్రస్థానంలో ఉంది. 1872లో లార్డ్స్‌లో సర్రేతో జరిగిన మ్యాచ్‌లో ఎమ్‌సీసీ ఖాతా తెరవకుండానే తొలి 6 వికెట్లను కోల్పోయింది. ఈ లిస్ట్‌లో ఎమ్‌సీసీ, మేఘాలయ తర్వాతి స్థానాల్లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (3-6), లీసెస్టర్‌షైర్ (4-6), నార్తాంప్టన్‌షైర్ (4-6) ఉన్నాయి. ఇక ఈ మ్యాచ్ శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్ వికెట్లతో మెరిశాడు. మేఘాలయ ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన లార్డ్ శార్దూల్, బి అనిరుధ్, సుమిత్ కుమార్, జస్కిరత్‌లను వరుస బంతుల్లో ఔట్ చేశాడు. ఓవరాల్‌గా 11 ఓవర్లు బౌలింగ్ చేసిన ఠాకూర్, 43 పరుగులిచ్చి 4 వికెట్లను పడగొట్టాడు. అతడితో పాటు, మోహిత్ అవస్థి 3 వికెట్లు, సిల్వస్టర్ డిసౌజా 2 వికెట్లు,



షామ్స్ ములానీ 1 వికెట్‌ను సాధించారు. మేఘాలయ బ్యాటర్లలో టెయిలాండర్ హిమ్యాన్ 28 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# మాస్టర్స్ చెస్ టోర్నీలో..

## ఆధిక్యంలో గుకేశ్



**ఢిల్లీ:** టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో పదవ రౌండ్ తర్వాత భారత గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 7.5 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన మాక్స్ వార్మేర్‌డామ్‌తో జరిగిన పదవ రౌండ్ గేమ్‌లో గుకేశ్ 34 ఎత్తుల్లో గెలిచాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత గుకేశ్‌కు ఇదే మొదటి టోర్నమెంట్ కావడం గమనార్హం. మరోవైపు ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ 7 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. రష్యాకు చెందిన అలెక్సీ సరానాను నోడిర్బెక్ ఓడించాడు. ఇక భారత్‌కే చెందిన గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద 6.5 పాయింట్లతో మూడో స్థానంలో, ఇరిగేశి అర్జున్ 3 పాయింట్లతో 13వ స్థానంలో ఉన్నారు. 14 మందిమేటి గ్రాండ్ మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

# ఛాంపియన్స్ ట్రోఫీలో..

# అత్యధిక వికెట్ల హీరోలు

## టాప్ ప్లేస్‌లో కైల్ మిల్స్

**ఢిల్లీ:** క్రికెట్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి ఛాంపియన్ ట్రోఫీకి పాకిస్థాన్, దుబాయ్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ట్రోఫీలో మొదటి మ్యాచ్ పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య జరగనుంది. అయితే టీమిండియా ఫిబ్రవరి 20 నుంచి సమరంలోకి దిగుతోంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్ జట్టుతో టీమిండియా తలపడనుంది. ఇప్పటికే టీమిండియా స్క్వాడ్ ను బీసీసీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటివరకూ పలువురు బౌలర్లు





















అత్యధిక వికెట్లు సాధించి రికార్డు సృష్టించారు. అటువంటి వారిలో కైల్ మిల్స్(28) న్యూజీలాండ్ మాజీ పేసర్ ఈ లిస్ట్ లో టాప్ ప్లేస్ లో ఉన్నాడు. అతడు ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు 17 మ్యాచ్‌లు ఆడి 28 వికెట్లు పడగొట్టాడు. అతడి బౌలింగ్ యావరేజ్ 17.25గా ఉంది. 4/30 తన బెస్ట్ పెర్ఫామెన్స్ గా ఉంది. 2013లో ఇంగ్లాండ్ తో జరిగిన మ్యాచ్ లో కైల్ మిల్స్ ఈ ఘనత సాధించాడు. అలాగే లసిత్ మలింగా(25) శ్రీలంక గ్రేటెస్ట్ బౌలర్లలో మలింగ ఒకరు. గత రెండు దశాబ్దాలుగా అతనే అత్యుత్తమ బౌలర్. యార్కర్స్ సంధించడంలో మలింగాకు మంచి పేరుంది. అతడు 16 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమం 4/34. ఛాంపియన్స్ ట్రోఫీలో అతడి యావరేజ్ 19.09గా ఉంది. మలింగా 2009లో 4 వికెట్లు, 2013లో 7వికెట్లు, 2017లో 3 వికెట్లు రాబట్టాడు. దీంతో మలింగా ఇప్పటివరకు 25 వికెట్లు సాధించాడు. ఇక శ్రీలంక లెజెండరీ క్రికెటర్ ముత్తయ మురళీధరన్ ఐసీసీ ఛాంపియన్స్ టోర్నీలో ఇప్పటివరకు మొత్తం 17 మ్యాచ్‌లు ఆడి 24 వికెట్లు తీసుకున్నాడు. అంతేకాక మురళీధరన్ బెస్ట్ ఎకానమీ రేటును కలిగి ఉన్నాడు. అతని ఎకానమీ రేటు ఓవర్ కు 2.78 గా ఉంది. ఈ టోర్నమెంట్ లో ముత్తయ ప్రతి 15.10 బాల్స్ కు ఓ వికెట్ సాధించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. చాంఫియన్స్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల లిస్టులో మురళీధరన్ ఏకైక స్పిన్నర్ కావడం విశేషం. బ్రెట్ లీ (22) ఆస్ట్రేలియా ఫాస్టెస్ట్ బౌలర్ బ్రెట్ లీ కూడా ఈలిస్ట్ లో ఉన్నాడు. మొత్తం 4 టోర్నమెంట్స్ ఆడిన బ్రెట్ లీ మొత్తం 22 వికెట్లు పడగొట్టినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ టోర్నీలో అతడి బెస్ట్ బౌలింగ్ 3/38.. 2002లో న్యూజిలాండ్‌పై సాధించాడు. ఆస్ట్రేలియా లెజెండరీ బౌలర్ గ్లెన్ మెక్ గ్రాత్ (21). ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదవ స్థానంలో ఉన్నారు. కేవలం 12 మ్యాచ్‌లు ఆడిన మెక్ గ్రాత్ 21 వికెట్లు పడగొట్టాడు. అతడి బెస్ట్ పెర్ఫామెన్స్ 5/37గా ఉంది. 2002 న్యూజిలాండ్ తో జరిగిన మ్యాచ్ లో మెక్ గ్రాత్ ఈ ఘనత సాధించాడు. అయితే ఈ ఐదుగురిలో అత్యధిక సార్లు 5 వికెట్లు పడగొట్టిన బౌలర్ గా మెక్ గ్రాత్ నిలిచాడు.

# ఎటిపి టెన్నిస్ ఛాలెంజర్‌లో..

## క్వార్టర్ ఫైనల్స్‌కు అనిరుధ్ జోడీ





**ఢిల్లీ:** బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో భారత్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీల్ భాగంగా గురు వారం జరిగిన డబుల్స్ తొలిరౌండ్లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)-చార్లెస్ బ్రూమ్ (బ్రిటన్) ద్వయం 6-4,6-3తోహేడెన్‌జోన్స్-పావ్లెమారిన్‌కోవ్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. మరోవైపు ఫ్రాన్స్‌లో జరుగు తున్న

## సహజ, రష్మిక ఓటమి

మాంట్‌పెలి యర్ ఏటీపీ-250 టోరీలో యూకీ బాంబ్రీ (భారత్)- అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో యూకీ- ఒలివెట్టి జంట 7-5, 3-6, 10-8తో జేకబ్ ష్నయిటర్-మార్క్ వాల్నర్ (జర్మనీ) ద్వయంపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెడుంజెళియన్ (భారత్) జోడీ 1-6, 5-7తో ఫ్లావియో కొల్లి (ఇటలీ)-జొనాథన్ ఎసెరిక్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. మరోవైపు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 75 మహిళల టోర్నమెంట్‌లో భారత నంబర్ వన్ యామలపల్లి సహజ, భారత మూడో ర్యాంకర్, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది.

# థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో..

## శ్రీకాంత్ తొలి విజయం



**ఢిల్లీ:** కొత్త ఏడాదిలో భారత స్టార్ షట్లర్, ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి విజయం అందుకున్నాడు. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ 47వర్యాంకర్ శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బ్యాంకాక్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-18తో డానిల్ దుబోవెంకో (ఇజ్రాయెల్)పై గెలుపొంది ప్రిక్వా ర్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 36 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలిగేమ్ ఆరంభంలో వరుసగా 6పాయింట్లు గెలిచి 6-0 తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆతర్వాత ఇదేజోరునుకొనసాగించి గేమును దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్‌కు ఒకింత ప్రతిఘటన ఎదురైంది.స్కోరు 15-15తో సమమైన దశలో శ్రీకాంత్ ఒక్కసారిగా విజృంభించి వరుసగా4పాయింట్లు నెగ్గి 19-15 తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత 3పాయింట్లు కోల్పోయిన శ్రీకాంత్ 2పాయింట్లు గెలిచి గేమ్‌తో పాటు,మ్యాచ్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌లో మరో ప్లేయర్ మన్నేపల్లి తరుణ్ 11-21, 15-21తో చికో వార్దోయో (ఇండోనేసియా) చేతిలో, ఆయుశ్ శెట్టి 15-21, 17-21తో జింగ్ హాంగ్ కోక్ (మలేసియా) చేతిలో,మిథున్ మంజునాథ్ 14-21, 13-21తో షోలే ఐదిల్ (మలేసియా) చేతిలో, సతీశ్ కుమార్

## ముందంజలో రక్షిత



15-21,18-21తో అల్వీఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ (భారత్) 15-21, 21-15, 21-19తో జూన్ వె చీమ్ (మలేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. కాగా మహిళల సింగిల్స్‌లో రక్షిత శ్రీ ముందంజ వేయగా, తాన్యా హేమంత్, తారా షా, వలిశెట్టి శ్రియాన్షి తొలి రౌండ్లో ఓడిపోయారు. రక్షిత శ్రీ 21-19, 21-16తో లుయో యువు (చైనా)పై గెలుపొందగా, తాన్యా 21-15, 11-21, 13-21తో కిసోనా సెల్వదురయ్ (మలేసియా) చేతిలో, తారా షా 15-21, 16-21తో థమనోవన్ నితిత్‌క్రాయ్ (థాయ్‌లాండ్) చేతిలో, శ్రియాన్షి 17-21, 13-21తో పిచమోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివాని ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జంట 21-8, 21-16తో వీరాఫట్-సరారట్ (థాయ్‌లాండ్) జోడీపైవిజయం సాధించింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 30:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపు ఒత్తిడికి లోనయ్యాయి. ఆ తర్వాత ఐటి షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచీలు చివరికి లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 76,598.84 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. కాసేపు లాభ నష్టాల మధ్య కొనసాగిన సూచి ఇంట్రాడేలో 76,401.13 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. ఫార్మా షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచి 76,962.88 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరింది. చివరికి సెన్సెక్స్ 226 పాయింట్లు లాభపడి 76,759 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 86పాయింట్లు లాభపడి 23,249 పాయింట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఏసియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభపడ్డాయి. టాటామోటార్స్, ఐటిసిహోటల్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, జొమాటో, కోటాక్ మహీంద్రా బ్యాంకు షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.05 డాలర్ల వద్ద ట్రేడయింది.





# బడ్జెట్‌పైనే ఆరోగ్య రంగం ఫోకస్

**న్యూఢిల్లీ, జనవరి 30:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 8వ బడ్జెట్‌ను 1 ఫిబ్రవరి 2025న ప్రవేశపెట్టనున్నారు. నిజానికి బడ్జెట్‌పై ప్రతి రంగానికి అంచనాలు ఉంటాయి. అయితే ఈ సారి బడ్జెట్‌లో తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆరోగ్య శాఖ కోరుతోంది. వీటిలో ఆరోగ్య సంరక్షణలో పన్ను సంస్కరణలతో పాటు ఆవిష్కరణలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. వాస్తవానికి హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇంకా మెడ్-టెక్ వ్యాపారాలు ఈ రంగాన్ని పునర్నిర్మించగల అలాగే ఆవిష్కరణలు ఇంకా ఆరోగ్య సేవలకు యాక్సెస్ పరంగా దేశాన్ని ప్రపంచ లీడర్‌గా స్థాపించగల సంస్కరణల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. వైద్య పరికరాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించడానికి, అధునాతన సాంకేతికతలో పరిశోధన అలాగే అభివృద్ధిలో ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని







ఆరోగ్య సంరక్షణ రంగం అభ్యర్థిస్తోంది. అలాగే స్థానిక తయారీ, గ్రామీణ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించే విధానాలు కోరుతుంది. జీరో డ్యూటీ మినహాయింపు నోటిఫికేషన్‌లను తొలగించాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత బడ్జెట్ ప్రసంగంలో హామీ ఇచ్చారని రాజీవ్ నాథ్ చెప్పారు. అందువల్ల ఎఐఎంఇడి రాయితీ డ్యూటీ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరింది. ఇది సుంకాన్ని 0-7.5శాతానికి తగ్గిస్తుంది. అలాగే వైద్య పరికరాల దిగుమతులపై 5శాతం నుంచి 15శాతం సుంకాన్ని విధించాలని కోరింది.

# 10 నెలల్లో సొంత ఎఐ మోడల్: అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, జనవరి 30:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో అమెరికా, చైనాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న వేళ కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. రాబోయే కొన్ని నెలల్లో భారత్ సొంత జనరేటివ్ ఎఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకోబోతోందని వెల్లడించారు. ఉత్కర్ష్ ఒడిశా కాన్‌క్లేవ్‌లో ఈ మేరకు ఆయన ఈ ప్రకటన చేశారు. భారత దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకొన్ని ఈ ఎఐ మోడల్‌ను తీర్చిదిద్దనున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ఎఐ మోడల్ పూర్తిగా ఇండియా ఎఐ కంప్యూటర్ సామర్థ్యంతో రూపొందనుందని తెలిపారు. మన దేశంలోని భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అతితక్కువ ఖర్చుతో ఈ ఎఐ మోడల్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. దేశీయ అవసరాల కోసం రూపొందించనున్న ఈ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ అభివృద్ధికి సుమారు 19వేల జిపియులు అవసరమవుతాయన్నారు. ఇందులో 15 వేల జిపియులు హైఎండ్‌వి అని తెలిపారు. ఇప్పటి వరకు ఆరుగురు దెవలపర్లను గుర్తించామని, రాబోయే 8-10 నెలల్లో ఎఐ మోడల్‌ను సిద్ధం చేసే అవకాశం ఉందని చెప్పారు. ఇదే జరిగితే ఎఐ రంగంలో దూసుకెళుతున్న అమెరికా, చైనాల సరసన భారత్ నిలవనుందన్నారు.

# పాపులర్ ప్లాన్లను తొలగించిన జియో

**ముంబై, జనవరి 30:** ప్రముఖ టెలికం సంస్థ రిలయన్స్ జియో రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను తొలగించింది. వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా ప్యాకేజీలు తీసుకురావాలని టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో కొత్త ప్లాన్లను పరిచయం చేసిన జియో, అదే సమయంలో పాత ప్లాన్లను తీసేసింది. ఇప్పటి వరకు అందిస్తున్న రూ.189, రూ.479 రీఛార్జ్ ప్లాన్లను తన వెబ్‌సైట్ నుంచి పూర్తిగా తొలగించింది. తక్కువ డేటా, ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు కావాలనుకొనే యూజర్ల కోసం జియో గతంలో రూ.189 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు అందించేది. 2జిబి డేటా కూడా లభించేది. దీని వ్యాలిడిటీ 28 రోజులు. దీంతో పాటు 84 రోజుల వ్యాలిడిటీతో రూ.479 ప్లాన్ అందుబాటులో ఉండేది. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 1000 ఎస్సెమ్మెస్‌లు, 6జిబి డేటా వంటి ప్రయోజనాలు లభించేవి. వాల్యూ ప్లాన్స్‌గా వీటిని వ్యవహరించేవారు. ట్రాయ్ ఆదేశాలకు అనుగుణంగా రెండు వాయిస్ ఓన్లీ ప్లాన్లను ఇటీవల జియో ప్రవేశపెట్టింది. 84 రోజుల వ్యాలిడిటీతో రూ.458 ప్లాన్, 365 రోజుల వ్యాలిడిటీతో రూ.1958 ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్లపై జియో టివి, సినిమా, క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్ సదుపాయాలు జోడించింది. ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ట్రాయ్ పేర్కొన్న నేపథ్యంలో ఈ ప్రయోజనాలు అలాగే ఉంచుతూ ప్లాన్ల ధరలినన తగ్గించింది. రూ.458 ప్లాన్‌ను రూ.448కు, రూ.1958 ప్లాన్‌ను రూ.1748కు తగ్గించింది. వాల్యూ ప్లాన్లను తొలగించింది.





# భారత్‌కు వస్తున్న ఓపెన్‌ఎఐ సిఇఒ!

**వాషింగ్టన్, జనవరి 30:** చాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ త్వరలో భారత్‌కు రానున్నారు. వచ్చే వారంలో భారత్‌లో పర్యటించి ఇక్కడి అధికారులతో భేటీ అవుతారని తెలిసింది. భారత్‌లో ఓపెన్ ఎఐ న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. మరోవైపు చైనా ఎఐ డీప్‌సీక్ రాకతో ఈ విభాగంలో గట్టి పోటీ నెలకొంది. ఈ తరుణంలో ఆల్ట్‌మన్ పర్యటన చేపట్టనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫిబ్రవరి 5న ఢిల్లీకి వచ్చే అవకాశం ఉందని, అయితే షెడ్యూల్‌లో మార్పు ఉండొచ్చని తెలుస్తోంది. ఆల్ట్‌మన్ చివరిసారిగా 2023లో భారత్‌ను సందర్శించి ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. భారత్‌లో సాంకేతిక వ్యవస్థను పెంచడంలో కృత్రిమ మేధ సామర్థ్యాన్ని వివరించారు. కృత్రిమ మేధ సాంకేతికతతో ఓపెన్‌ఎఐ తీసుకొచ్చిన చాట్‌బాట్‌ను వినియోగిస్తున్న వారిలో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఓపెన్ ఎఐకు భారత్ అతిపెద్ద మార్కెట్ అని అభి వర్ణించారు. మరోవైపు ఓపెన్ ఎఐ భారత్‌లో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. కాపీరైట్ ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ దేశీయ వార్త సంస్థ ఎఎన్‌ఐ గతేడాదిలోనే దావా వేసింది. దీంతో పాటు పలు మీడియా సంస్థలు కూడా ఈ కేసులో చేరాయి. దీనిపై ఓపెన్ ఎఐ స్పందించింది. నిబంధనలకు లోబడి కేవలం బహిరంగంగా అందుబాటులో ఉన్న డేటాను మాత్రమే ఉపయోగిస్తుందని తెలిపింది.



# వాణిజ్యం

## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు

**వాషింగ్టన్, జనవరి 30:** ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్ద ఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. తాజా రౌండ్ తొలగింపులో కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులను ఇంటికి పంపనుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు ఖర్చుల్ని తగ్గించేందుకు అమెజాన్ సిద్ధమవుతోంది. అందులో భాగంగా తాజా తొలగింపులు చేపట్టనుంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కంపెనీ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ చర్యలు చేపడుతోంది. అమెజాన్ కార్యకలాపాలు చురుగ్గా సాగడానికి 'లే ఆఫ్'లు దోహదపడతాయని కంపెనీ పేర్కొంది. లేఆఫ్‌లపై కంపెనీ ప్రతినిధి బ్రాడ్ గ్లాసర్ స్పందించారు. ఉద్యోగుల తొలగింపు నిజమైనది పేర్కొన్న ఆయన ఈ నిర్ణయం సులభమైనది కాదన్నారు. కస్టమర్లను





మరింత చేరువయ్యేందుకు, ఉనికిని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం సాయపడుతుందన్నారు. లేఆఫ్‌ల కారణంగా ప్రభావం ఎదుర్కొనున్న ఉద్యోగులకు తాము సాయం అందిస్తామని ఆయన తెలిపారు. అమెజాన్ సిఇఒగా ఆండీ జస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా లేఆఫ్‌లను ప్రటకిస్తూనే వచ్చారు. కార్యకలాపాలను విస్తృతంచేసే కఠిన చర్యల్లో భాగంగా వరుసగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నారు. 2022లో ఏకంగా 27వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. తాజాగా కమ్యూనికేషన్ విభాగంలోని ఉద్యోగులపై ఈ వేటు పడింది. అయితే ఎంత మందిపై ఈ ప్రభావం పడనుందనే విషయాన్నిమాత్రం కంపెనీ వెల్లడించలేదు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.